సెప్టెంబర్
2018

149

సంపుటి : 13 సంచిక : 5 వెల రు. 10 /-

## ఈ సంచికలో........

ఎన్నికల సంస్కరణలు
నూతన రాజకీయ ప్రత్యామ్నాయానికి కలిసి రండి
మన వ్యవసాయం ఏం కానుంది?
భారతీయ సాంస్కృతిక వైవిధ్యం - సవాళ్ళు
ప్రమాదపు అంచుల్లో ఉన్నత విద్య
ఆర్ఎస్ఎస్ - ఎమర్జెన్సీ
21వ శతాబ్దంలో కమ్యూనిస్టు ప్రణాళిక
ప్రమాదంలో సమాచార హక్కు చట్టం
ప్రత్యామ్నాయ విధానాల చుట్టూ ప్రజలను సమీకరించాలి
అసామాన్య ఆర్థికవేత్త సమీర్ అమీన్

# అసామాన్య ఆర్థికవేత్త సమీర్ అమీన్

**ప్రభాత్ పట్నాయక్**

ప్రముఖ మార్క్సిస్టు ఆలోచనాపరుడు, ఆర్థికవేత్త సమీర్ అమీన్ ఆగస్టు 13న పారిస్‌లో కన్నుమూశారు. ఆయన తండ్రి ఈజిప్టుకు, తల్లి ఫ్రాన్స్‌కు చెందినవారు. ఆయన 1931, సెప్టెంబర్ 3న కైరోలో జన్మించారు. పారిస్‌కు వెళ్ళడానికి ముందు ఆయన ప్రాథమిక విద్య ఈజిప్టులోనే సాగింది. ఆయన పారిస్‌లో రాజకీయ అర్థశాస్త్రంలో డాక్టరేట్ పట్టా పొందారు. ఆయన చదువుకుంటున్న రోజుల్లోనే సోషలిజం వైపుకు ఆకర్షితులయ్యారు. కొద్దిరోజుల్లోనే ఆయన ఈజిప్టు కమ్యూనిస్టు పార్టీ సభ్యులయ్యారు. కమ్యూనిస్టులపై నాసర్ సాగిస్తున్న అణచివేతలో ఈజిప్టు నుంచి బయటికి పంపేయడానికి ముందు ఆయన కైరోలో ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎకనామిక్ మేనేజ్‌మెంట్‌లో పనిచేశారు. తొలుత ఐరాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్‌గానూ, తృతీయ ప్రపంచ వేదిక ఆఫ్రికా కార్యాలయ డైరెక్టర్‌గానూ తరువాత ఆయన సెనెగల్‌లోని డకార్‌లో స్థిరపడ్డారు.

రెండు విశిష్టతలు సమీర్ అమీన్‌ను ప్రత్యేకమైన మార్క్సిస్టు మేధావిగా నిలిపాయి. మొదటిది సోషలిజం సాధన క్రమంలో ఆచరణకు ఆయన ఇచ్చిన ప్రాధాన్యత. ఆయన సమకాలీన వాస్తవాన్ని విశ్లేషించేందుకు మార్క్సిజాన్ని వాడుకునే పడక కుర్చీ సిద్ధాంతవేత్త కాదు. అందుకు భిన్నంగా గట్టి నిబద్ధత గల కార్యకర్త. ఆయన ఆచరణకు మేధోపరమైన కార్యకలాపాలు సహాయక సాధనంగా ఉన్నాయి. మార్పుకోసం సమకాలీన ఉద్యమాలలో సమర్థవంతంగా జోక్యం చేసుకునేందుకు ఆయన ఎల్లప్పుడూ ప్రయత్నిస్తూనే ఉండేవాడు. తనతోటి కార్యకర్తలను సంఘటితపరచడంలో సెనెగల్ లోని కమ్యూనిస్టు ఉద్యమంతోను, పలు స్వచ్ఛంద సంస్థలతోను సన్నిహిత సంబంధాలు కలిగి వుంటూ మార్గదర్శకత్వం అందించేవారు.



రెండవది: తన మార్క్సిస్టు విశ్లేషణలో సామ్రాజ్యవాదానికి కేంద్రస్థానం ఇవ్వడం. సమకాలీన మార్క్సిస్టులలో కొందరు అభివృద్ధి చెందిన ప్రపంచానికి చెందినవారుగాని (మంత్లీ రివ్యూ గ్రూపువంటివారు ఇందుకు మినహాయింపు) చాలామంది మూడో ప్రపంచ దేశాలవారు గాని ప్రపంచీకరణ క్రమాన్ని సామ్రాజ్యవాదం బలహీనపడిపోతున్న క్రమంగా పరిగణిస్తారు. ఇందుకు భిన్నంగా సామ్రాజ్యవాదాన్ని కేంద్రస్థానంలో ఉంచడమే గాక, దానిని శ్రమవిలువ సిద్ధాంతపు చట్రంలో నిలిపారు. అతను ప్రతిపాదించిన 'అసమాన మారకం' సిద్ధాంతం ప్రఖ్యాతి పొందింది. సంపన్న దేశాలు మూడో ప్రపంచాన్ని తన చెప్పుచేతలలో ఉంచుకోవడం వలన అసమాన మారకాన్ని అది దారితీసిందన్న ఆ సిద్ధాంతం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది.

మైఖెల్ కాలెకీవంటి ఆర్థికవేత్తలు కూడా 'అసమాన మారకం' భావనను గుర్తించారు. అయితే వారి నిర్ధారణలు ఇలా ఉన్నాయి. సంపన్నదేశాలలో ఒకస్థాయిలో గుత్తాధిపత్యాన్ని సంపాదించిన అనంతరమే అవి మూడో ప్రపంచదేశాల ముడి సరుకులను కారుచవకగా కాజేయగలిగాయి. అందువలన ఆ సంపన్న దేశాలలో గుత్తాధిపత్యం ఏర్పడిన చారిత్రక కాలంనుండి అసమాన మారకం మొదలయినట్టు పరిగణించారు.

ఐతే, అమీన్, ఇమ్యాన్యుయెల్ వంటి సిద్ధాంతవేత్తలు అసమానమారకాన్ని ఒకానొక చారిత్రక కాలం నుండి ప్రారంభమైన అంశంగా చూడరాదని అన్నారు. మూడో ప్రపంచ దేశాల్లో ఒక యూనిట్ శ్రమ సృష్టించిన విలువ కన్నా, సంపన్న దేశాల్లో అదే యూనిట్ శ్రమ సృష్టించిన విలువ ఎక్కువ అని పరిగణించడం వల్లనే ఈ అసమాన మారకం సాగిందని అమీన్ సూత్రీకరించారు. దీనికితోడు మూడో ప్రపంచ దేశాలలో శ్రమశక్తి విలువ (జీతాలు–అను) సంపన్న దేశాలలోని శ్రమశక్తి విలువకన్నా తక్కువగా ఉండడంతో అది మరింత అసమానతను మారకంలో తెచ్చింది. 'అసమాన మారకం' కన్నా, సంపన్న దేశాలు మూడో ప్రపంచ దేశాలపై సాగించిన మహా దోపిడీ (సూపర్ ఎక్స్‌ప్లాయిటేషన్) కీలకమైన అంశం అని అమీన్ భావించాడు. సంపన్న దేశాల ఉత్పత్తులకు, మూడో ప్రపంచ దేశాల ఉత్పత్తులకు మారకం జరిగేటప్పుడు సమాన శ్రమకాలం ఇమిడివున్న సరుకుల మధ్యనే మారకం జరిగిందనుకున్నా, ఈ శ్రమ కాలానికి మూడో ప్రపంచ దేశాల కార్మికులకు ముట్టే ప్రతిఫలం సంపన్న దేశాల కార్మికులకు దక్కే ప్రతిఫలం కన్నా తక్కువ. నిరుద్యోగం మూడో ప్రపంచదేశాలలో అధికంగా ఉండడమే కారణం. మూడో ప్రపంచ దేశాల ఉత్పత్తులను కొని ఇతర ప్రాంతాలలో విక్రయించే వ్యాపారులకి సూపర్ లాభాలు చేకూరాయి. ఈ దేశాల కార్మికులకు మాత్రం తక్కువ ప్రతిఫలమే మిగిలింది. అమీన్ సిద్ధాంతానికి కేంద్రస్థానంలో మూడో ప్రపంచ దేశాల కార్మికులపై సాగిన ఈ 'మహాదోపిడీ' అన్న అంశం ఉంది.

ఈ వాదనతో ఛార్లెస్ బెటైల్‌హేమ్ వంటి ఆర్థికవేత్త ఏకీభవించలేదు. 'సంపన్న దేశాలలో శ్రమ ఉత్పాదకతతో పోల్చితే శ్రమవిలువ తక్కువే. (అక్కడ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వాడుతున్నందున –అను) అలాగే మూడో ప్రపంచ దేశాలలో శ్రమ ఉత్పాదకతతో పోల్చినప్పుడు అక్కడి శ్రమవిలువలో పెద్ద తేడా ఉండదు' అని ఆయన వాదించారు. దీనికి అమీన్ ఇచ్చిన సమాధానం ఇలా ఉంది' శ్రమ ఉత్పాదకతను పరిగణనలోకి తీసుకునేటప్పుడు తద్వారా ఉత్పత్తయ్యే సరుకుల విలువను బట్టి నిర్ధారించాలే తప్ప సరుకుల సంఖ్యను బట్టి కాదు. పైగా సంపన్న

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. **అసామాన్య ఆర్థికవేత్త సమీర్ అమీన్**
ప్రభాత్ పట్నాయక్................. 2

2. **ఎన్నికల సంస్కరణలు**
**సిపిఐ(ఎం) కేంద్రకమిటీ తీర్మానం .........** 4

3. **నూతన రాజకీయ ప్రత్యామ్నాయానికి కలిసిరండి**
**సిపిఐ(ఎం)-సిపిఐ ఉమ్మడి ప్రణాళిక ......** 9

4. **మన వ్యవసాయం ఏం కానుంది?**
ఎంవిఎస్ శర్మ.................... 14

5. **భారతీయ సాంస్కృతిక వైవిధ్యం - సవాళ్ళు**
తెలకపల్లి రవి ..................... 17

6. **ప్రమాదపు అంచుల్లో ఉన్నత విద్య**
ఆర్. రామచంద్రన్.............. 22

7. **ఆర్ఎస్ఎస్ - ఎమర్జెన్సీ**
ఎ.జి. నూరాని .................. 24

8. **21వ శతాబ్దంలో కమ్యూనిస్టు ప్రణాళిక**
పాల్‌యం స్వీజీ, జాన్ మాగే,
జాన్ బెల్లమి ఫాస్టర్ ............. 28

9. **ప్రమాదంలో సమాచార హక్కు చట్టం**
ఎం. శ్రీధర్ ఆచార్యులు ......... 30

10. **ప్రత్యామ్నాయ విధానాల చుట్టూ ప్రజలను సమీకరించాలి**
బివి రాఘవులు.................... 33

11. **భారత సంస్కృతిపై మతతత్వ దాడి**
బిపన్‌చంద్ర ...................... 36



**సంపాదకుడు:**
**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరఫున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ) గుంటూరు(జి)
**ఫోన్: ఎడిటర్ : 9490099333**
**మేనేజర్ : కె.హరికిషోర్: 9490099275**
email:venkataraosankarapu@gmail.com
visit cpi(m) site at : cpim.org


# ప్రత్యామ్నాయం

**ఆ**రుగాలం శ్రమించి సంపదలు సృష్టించిన వాడే కూడు కోసం, గూడు కోసం, గుడ్డ కోసం; విద్య వైద్యం కోసం చేతులుచాచి అడుక్కోవలసిన పాడు వ్యవస్థ మనకు దాపురించింది. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచిపోయింది. పాలకులు రకరకాల పథకాలు ప్రకటిస్తున్నారు. ప్రజలకు బర్రెలిస్తున్నారు, గొర్రెలిస్తున్నారు, ఇళ్లిస్తున్నారు, రేషన్ ఇస్తున్నారు. కార్పొరేట్ విద్య, వైద్యం ఇళ్లముందుకు తెస్తున్నారు. ఇంకోవైపు దాతృత్వ సంస్థలు ప్రజల సహాయార్థం ఇబ్బడి ముబ్బడిగా ముందుకొస్తున్నాయి. ఈ మధ్య గ్రామాలనూ, పట్టణాలనూ దత్తత తీసుకునే 'రాజపోషకుల' సంఖ్యా పెరుగుతోంది. అందరూ, అన్నీ ఇస్తున్నట్లే ఉన్నారు, కానీ ప్రజల పరిస్థితిలో మార్పులేదు. సంపద సృష్టించే శ్రామికులు రోజురోజుకూ ఆ సంపదకు మరింత దూరమవుతూనే ఉన్నారు. తాము సృష్టించిన సంపదనే చేయి చాచి అడుక్కోవలసిన పరిస్థితుల్లోకి నెట్టబడుతూనే ఉన్నారు.

ఈ మధ్య టివీల్లో నెలకు ఒక్క రూ. 500 ఇవ్వండి అంటూ అడ్వర్టయిజ్‌మెంట్లు వేస్తున్నారు. పిల్లలకు పోషకాహారం కోసం, ఆడపిల్లలకు చదువు, కంటి ఆపరేషన్లు, జల సంరక్షణ... ఇలా రకరకాల ప్రజాహిత కార్యాల కోసం దానం చేయమని దాతలను కోరుతున్నారు. ఉన్నవాడు దానం చేయడంలో తప్పులేదు. కానీ ఈ పనులన్నీ దాతలే చేస్తే ఇంక ప్రభుత్వాల పనేమిటి? ప్రభుత్వాలు చేయాల్సిన పనులను దాతలకు, దాతృత్వ సంస్థలకు వదిలేయడమంటే ప్రజలను అడుక్కునేవాళ్లుగా మార్చడమే.

ప్రపంచ వ్యాపితంగా, భారత దేశంలోను ఆమాటకొస్తే నయా-ఉదారవాద విధానాలు అమలు జరిపే అన్నిచోట్లా ముఖ్యంగా రెండు పరిణామాలు జరుగుతున్నాయి. మొదటిది, ప్రజల మధ్య అసమానతలు విపరీతంగా పెరుగుతున్నాయి. సంపదలు సృష్టించే వారి చేతిలో సంపద నిలవడం లేదు. అది కొద్ది మంది బడా పెట్టుబడిదారుల వద్ద పోగవుతోంది. అందువల్ల విస్తారమైన ప్రజానీకం పేదరికంలోకి నెట్టబడుతున్నారు. రెండోది, ఈ విధానాలు అనుసరించే ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని విడనాడి పెట్టుబడిదారుల సేవలో, వారి వద్దకు ప్రజల సంపదను చేరవేసే పనిలో నిమగ్నమైనాయి. ప్రజల సంక్షేమ బాధ్యతల నుండి ప్రభుత్వాలు ఉపసంహరించుకుంటున్న కొద్దీ ప్రయివేటు పెట్టుబడులు, కార్పొరేట్ లాభాపేక్ష ఆ స్థానాన్ని ఆక్రమించుకుని ప్రజలపై విపరీతమైన భారాలు పడుతున్నాయి. ఈ భారాల పర్యవసానంగా ప్రజలలో పెరిగే అసంతృప్తి సంఘటితం కాకుండా ఎక్కడికక్కడ చల్లార్చడానికి సేవా, దాతృత్వ సంస్థలను కార్పొరేట్లే ముందుకు తెస్తున్నాయి. దేశానికి నేనూ ఏదో చేయాలి అన్న విధాన స్పందించే కొంతమంది స్పృహగలిగిన వారూ ఉన్నారు. వారి ఆలోచనలను సేవా కార్యక్రమాలకు పరిమితం చేసి రాజకీయ రూపం తీసుకోకుండా అడ్డుకోడానికి కూడా ఈ ప్రక్రియ పాలకవర్గాలకు దోహదపడుతుంది.

అందువల్ల నయా-ఉదారవాద విధానాలు అనుసరించే ఏ పార్టీలు అధికారంలో ఉన్నా ప్రజలను ముష్టి వాళ్లుగానే మారుస్తాయి. ఈ విధానాల స్థానంలో ప్రజల సంపదను తిరిగి వారికి చేర్చే ప్రత్యామ్నాయ విధానాలు గల పార్టీలు అధికారంలోకి రావాలి.

మరి కొన్ని మాసాల్లో కేంద్రంలోనూ, తెలుగు రాష్ట్రాల్లోనూ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ ఎన్నికల్లో కేంద్రంలో బిజెపి కాకుంటే కాంగ్రెస్, కాంగ్రెస్ కాకుంటే బిజెపి ఈ రెండూ కాకుంటే ప్రాంతీయ పార్టీల కూటమి అధికారంలోకి రావచ్చనీ, రావాలనీ ఊహాగానాలు సాగుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో తెరాస, తెదేపా, వైసిపి వ్యూహ ప్రతివ్యూహాలు పన్నుతున్నాయి. కానీ వీటి పేర్లలోనే తప్ప మౌలిక విధానాల్లో తేడాలేదు. ఇవన్నీ నయా-ఉదారవాద తానులో గుడ్డలే. అందువల్ల వామపక్షాలు, ప్రజాతంత్ర శక్తులతో కూడిన విధానపరమైన ప్రత్యామ్నాయం బలపడాల్సిన అవసరం నేడెంతైనా ఉంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ దిశలో జరుగుతున్న కృషిలో పార్టీ సభ్యులంతా చురుకుగా భాగస్వాములు కావాలి.


**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా: **రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

# ఎన్నికల సంస్కరణలు

కేంద్ర కమిటీ నిర్ణయాన్ని అనుసరించి సిపిఐ(ఎం) పి.బి. ఆగస్టు 3, 4 తేదీలలో ఎన్నికల సంస్కరణలకు సంబంధించి ఆమోదించిన తీర్మానాన్ని మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం. – సంపాదకులు

## ముందుమాట

బిజెపి ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చిన లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు జమిలి ఎన్నికల ప్రతిపాదన పూర్తిగా ప్రజాస్వామ్య విరుద్ధమైనది గనుక ఎన్నికల సంస్కరణల గురించి చర్చించాల్సిన అవసరం ఉంది. ఎన్నికల సంస్కరణలు సమగ్రంగా ఉండాలి. ఎన్నికల నిధులు, అవినీతి, కార్పొరేట్ నియంత్రణ, పాక్షిక దామాషా ప్రాతినిధ్యం, ఎన్నికల సంస్థలు నిష్పక్షపాతంగా, స్వతంత్రంగా ఉండడం, మీడియా పాత్ర వంటి విషయాలన్నీ సంస్కరణల్లో భాగంగా ఉండాలి. రానున్న లోక్ సభ ఎన్నికల్లోపు ఈ చర్యలు తీసుకోవాలి.

ఎన్నికల బాండ్లు, ద్రవ్య బిల్లు ద్వారా విదేశీ విరాళాల నియంత్రణ చట్టానికి చేసిన సవరణ (ఇది రాజకీయ పార్టీలకు విదేశీ కంపెనీల భారతీయ సబ్సిడీలు నిధులు సమకూర్చడానికి మార్గం సుగమం చేస్తుంది), రాజకీయ విరాళాలపై పరిమితులు ఎత్తివేస్తూ, నిధులు ఇచ్చేవారి వివరాలు బయటకు రాకుండా చేసే కంపెనీ చట్ట సవరణ మొదలైన వాటిని వెంటనే వెనక్కు తీసుకోవాలని తక్షణం డిమాండ్ చేయాలి.

అయితే మోడీ ప్రభుత్వం పార్లమెంటులో ఎటువంటి చర్చ లేకుండా తీసుకువచ్చిన ఈ మూడు అంశాలు బిజెపికి ఎక్కువ లాభం చేకూర్చుతాయి. వీటి వల్ల రాజకీయ వ్యవస్థపై కార్పొరేట్‌ల పట్టు పెరుగుతుంది. అవినీతికి ద్వారాలు బార్లా తెరుచుకుంటాయి. అందువల్ల ఈ అంశాలపై వెంటనే చర్చ జరిగి ఈ ప్రజా వ్యతిరేక విధానాలను తిరస్కరించాల్సిన అవసరం ఉంది.

## ఎన్నికల సంస్కరణలు

పార్లమెంటుకు, చాలా రాష్ట్రాల అసెంబ్లీ లకి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల సంస్కరణలు ప్రస్తుతం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఈ మధ్య కాలంలో ముఖ్యంగా ఆర్ఎస్ఎస్/ బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత, ప్రముఖ కార్పొరేట్లన్నీ ప్రధాన మంత్రి మోదీకి పూర్తి దన్నుగా ఉన్న తరువాత, రాజకీయ పార్టీలకు మరీ ముఖ్యంగా ఎన్నికల తరుణంలో నిధులు అందుబాటులోకి రావడం పెద్ద ప్రభావం కలిగిస్తోంది. బిజెపికి పెద్దఎత్తున నిధులు సమకూరుతున్నాయి. ఎన్నికల గోదాలో అసమాన పోటీ ఏర్పడింది. నియంత్రణా వ్యవస్థలో ఉన్న లొసుగుల కారణంగా ఎన్నికల్లో డబ్బు విపరీతంగా ఖర్చు చేస్తున్నారు. ముఖ్యంగా బిజెపి చేస్తున్న ఎన్నికల ఖర్చులకు ఆకాశమే హద్దుగా ఉన్నది.

దేశ ప్రజలు ఈ విషయంలో ఆందోళన లను ఏ మాత్రం పట్టించుకోకుండా, ప్రస్తుత ప్రభుత్వం పార్లమెంటుకు, రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు ఒకేసారి జరిపే ప్రతిపాదనలను ముం దుకు తెస్తున్నది. ఎన్నికల సంస్కరణల గురించి జరిగే ప్రచారంలో ఈ ప్రతిపాదనను నిర్ద్వం దంగా తిరస్కరించాలి.

అవినీతి, కార్పొరేట్ల నియంత్రణ – ఈ రెండు అంశాలు ఇప్పుడు ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి; రాజకీయపార్టీ, కార్పొరేట్ల మిలాఖత్ ఇప్పుడు రాజకీయాలను శాసిస్తున్నది. అంతిమంగా ఈ కలయిక, ప్రజాస్వామ్యం పునాదినే కదిలించివేస్తున్నది.

ఎన్నికల్లో అత్యధిక ఓట్లు పొందిన వ్యక్తే గెలుపొందినట్టు ప్రకటించే పద్ధతి, మొదటి ఎన్నికల నుండి కొనసాగుతున్నా రానురాను ఈ పద్ధతి ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించడంలో విఫల మవుతున్నది; ఈ పద్ధతి వలన రాజకీయ పార్టీలు పొందిన ఓట్లకు గెలిచిన సీట్లకు పొంతన లేకుండా చేస్తున్నది.

రాజకీయ పార్టీల నిర్వహణలో జవాబు దారీతనం, పారదర్శకత లోపించడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నది. ఈ సమస్యను స్వచ్ఛంద చర్యలతో ఎదుర్కొనడం అసాధ్యం. సరైన చట్టబద్ధ నియమనిబంధనలతోనే దీనిని నియంత్రించగలం. భారత ఎన్నికల సంఘం ఒక స్వతంత్ర రాజ్యాంగబద్ధ సంస్థగా ఉన్నందు వలన అది ఈ రకమైన నియంత్రణకు లోబడి పనిచేస్తుంది. కానీ దానికి తగిన చట్టబద్ధ అధి కారాలు లేకుండా ఈ బాధ్యత నిర్వహించలేదు. అయితే అదే సమయంలో ఎన్నికల సంఘానికి స్వతంత్రత, స్వయం ప్రతిపత్తితో పాటు జవాబు దారీ తనాన్ని కూడా జోడించాలి. ఇటీవల భారత ఎన్నికల సంఘం ప్రవర్తన పట్ల, నిష్పా క్షికత పట్ల తీవ్రమైన ఆందోళన బయలుదేరింది. ఇది ఏ స్థాయికి చేరిందంటే కొందరు మాజీ ఎన్నికల ప్రధానాధికారులు బహిరంగంగానే తమ ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల ఎన్నికల సంస్కరణల కోసం సిపిఐ(ఎం) చేసే ప్రతిపాదనల్లో ఈ క్రింది స్థూల అంశాలుండాలి.

### జమిలి ఎన్నికల ప్రతిపాదన

మన రాజ్యాంగం ప్రకారం ఏ ప్రభుత్వ మయినా అవిశ్వాస తీర్మానంలో ఓడిపోయినా లేక ద్రవ్య బిల్లుపై జరిగిన ఓటింగులో ఓడి పోయినా అది రాజీనామా చేయాల్సి ఉంటుంది. ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటు చేయలేకపోతే సభను రద్దు చేసి మధ్యంతర ఎన్నికలు నిర్వ హించాలి. లోక్‌సభకుగానీ, రాష్ట్రాల శాసన సభలకుగానీ రాజ్యాంగంలో ఒక నిర్దిష్ట కాలాన్ని నిర్ణయించలేదు. 83(2) అధికరణం, 172(1) అధికరణం రెండూ "ముందుగానే రద్దు చేయ బడకపోతే" లోక్‌సభ, శాసన సభ కాల పరి మితులు అయిదేళ్లు అని నిర్వచించాయి.

లోక్‌సభ, లేక శాసనసభల కాల పరిమితిని పెంచడం రాజ్యాంగ విరుద్ధమేగాక, ప్రజా స్వామ్య వ్యతిరేకం. తాము ఎన్నుకున్న ప్రతినిధుల ద్వారా ప్రజాభిప్రాయం అమలు జరగాలి.

జమిలి ఎన్నికలు నిర్వహించడం కోసం రాజ్యాంగానికి అనేక రకాల సవరణలు ప్రతిపాదిస్తున్నారు. నీతి ఆయోగ్ విడుదల చేసిన చర్చా పత్రంలో ఈ విధంగా ప్రతిపాదించారు.

లోక్ సభను రద్దు చేయడం అనివార్యం అయితే, మిగిలిన లోక్‌సభ కాలం తక్కువగానే ఉంటే, అప్పుడు రాష్ట్రపతి పరిపాలనా బాధ్యతలను తీసుకునే విధంగా ఒక నిబంధనను చేర్చవచ్చు. ఈ కాలంలో రాష్ట్రపతి మంత్రివర్గాన్ని నియమించుకుని మంత్రుల సలహాలతో సహకారంతో కొత్త సభ ఏర్పడే వరకు పరిపాలనా బాధ్యతలు నిర్వహించేట్లు రాజ్యాంగంలో నిబంధన చేర్చాలి. ఈ దారుణమైన ప్రతిపాదన వల్ల రాష్ట్రపతి పరిపాలనా విభాగానికి అధిపతి అవు తారు. ఇది దొడ్డిదారిన అధ్యక్షతరహా పాలనను ప్రవేశపెట్టడమే.

మరో సూచన ఏమంటే; సభను రద్దు చేసేనాటికి సభ నిర్వహించాల్సి ఉన్నా మిగిలిన కాలం చాలా ఎక్కువగా ఉంటే అప్పుడు తాజాగా ఎన్నికలు నిర్వహించాలి. అయితే ఆ మిగిలిన కాలానికి మాత్రమే సభ ఎన్నుకోబడుతుంది. అంటే ఉదాహరణకు, ఎన్నికైన రెండేళ్లకే సభ రద్దయిందనుకోండి, అప్పుడు మూడేళ్ల కాల పరిమితికే సభను సరికొత్తగా ఎన్నుకోవాలి. అంటే అప్పుడు లోక్‌సభ ఎన్నికలు ఎక్కువసార్లు జరుగుతాయి. ఇది అసలు జమిలి ఎన్నికలు జరపాలనుకుంటున్న ప్రయోజనాన్నే దెబ్బ తీస్తుంది. జమిలి ఎన్నికల వల్ల దెబ్బతినే మరో అంశం ఫెడరలిజం. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను జమిలిగా జరపాలని 2015లో 79వ పార్లమెంటరీ స్థాయీ సంఘం, నీతి ఆయోగ్ ప్రవేశపెట్టిన పత్రాల్లో దశలవారీగా కొన్ని శాసన సభల కాలపరిమితులు పెంచాల్సి వస్తుందనీ, కొన్నింటి కాలపరిమితి తగ్గించాల్సి వస్తుందని ప్రతిపాదించారు. శాసన సభల కాలపరిమితి పెంచడం గానీ, తగ్గించడం గానీ రాష్ట్రాల హక్కులపైన దాడి చేయడమే. తమ శాసన సభలను ఎన్నుకోడానికి పౌరులకు గల హక్కులను భంగపరచడమే.

శాసనసభల విషయంలో మరో ప్రతిపాదన ఏమంటే, సభ కాలపరిమితిలో ఎక్కువ భాగం పూర్తి అయిపోయాక దాన్ని రద్దు చేస్తే అప్పుడు మిగిలిన భాగానికి గవర్నర్ పాలన ప్రవేశ పెట్టాలి. అంటే మళ్లీ ఇది కేంద్రం పాలనే అవుతుంది. చట్ట సభల జవాబుదారీ తనాన్ని నీరుగార్చి వాటిని కాలపరిమితి ముగిసే వరకు ఏదో విధంగా కొనసాగేట్లు చేసేందుకు రకరకాల ప్రతిపాదనలు ముందుకు తెస్తున్నారు. భారత న్యాయ కమిషన్ ముసాయిదా వర్కింగ్ పత్రం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినప్పుడే దానితో పాటు సభలో కొత్త నాయకుడిని ప్రతిపాదించే తీర్మానం కూడా ప్రవేశపెట్టాలి అని ప్రతిపాదించడం జరిగింది. అంటే ప్రభుత్వాన్ని అవిశ్వాసం

> **“రాష్ట్రాల శాసనసభల ఎన్నికలను లోక్‌సభ ఎన్నికలతో ముడిపెట్టేందుకు చేస్తున్న ప్రతిపాదనలన్నీ ఫెడరల్ సూత్రాల పట్ల గాని రాష్ట్రాల హక్కుల పట్ల గానీ గౌరవం లేకుండా చేస్తున్నవే. కేంద్ర ప్రభుత్వం 356వ అధికరణాన్ని దుర్వినియోగం చేయడం వల్లనే అనేక రాష్ట్రాల ఎన్నికలు జాతీయ ఎన్నికల నుండి విడగొట్టబడ్డాయి అన్న విషయం మనం గుర్తించాలి.”**



ఓటు వేయటం కోసం బారులు తీరిన మహిళలు

ద్వారా ఓడించే శాసన సభ్యుల హక్కును కాలరాయడమే. కొత్త ప్రభుత్వాన్ని ఏర్పరచగలిగినప్పుడు మాత్రమే అవిశ్వాస తీర్మానపు హక్కు వినియోగించుకోవాలన్న షరతు పెడుతున్నారన్న మాట. ఏ ప్రభుత్వాన్నయినా ఓడించేందుకు ఎన్నికైన శాసనసభ్యులకు, లేక లోక్ సభ సభ్యులకు ఉన్న హక్కును కాలరాయకూడదు. అలాగే సభలో స్థిరమైన మెజారిటీ ఉన్న ప్రభుత్వానికి సభను రద్దు చేసి, ముందస్తు ఎన్నికలకు సిఫార్సు చేసేందుకు ఉన్న హక్కును కూడా కాలరాయకూడదు. రాష్ట్రాల శాసన సభల ఎన్నికలను లోక్ సభ ఎన్నికలతో ముడిపెట్టేందుకు చేస్తున్న ప్రతిపాదనలన్నీ ఫెడరల్ సూత్రాల పట్ల గాని రాష్ట్రాల హక్కుల పట్ల గానీ గౌరవం లేకుండా చేస్తున్నవే. కేంద్ర ప్రభుత్వం 356వ అధికరణాన్ని దుర్వినియోగం చేయడం వల్లనే అనేక రాష్ట్రాల ఎన్నికలు జాతీయ ఎన్నికల నుండి విడగొట్టబడ్డాయి అన్న విషయం మనం గుర్తించాలి. 1959లో కేరళలో కమ్యూనిస్టు మంత్రివర్గాన్ని రద్దు చేయడంతో ఈ క్రమం ప్రారంభమైంది.

జమిలి ఎన్నికల పేరుతో ముందుకు వస్తున్న ఈ ప్రతిపాదనలన్నీ గవర్నరు పాత్రనూ, కేంద్రం జోక్యాన్నీ పెంచుతాయి.

లోక్‌సభ, రాష్ట్రాల శాసన సభ ఎన్నికలను జమిలిగా నిర్వహించాలంటే చట్ట సభకు ప్రభుత్వం జవాబుదారీగా ఉండాలని రాజ్యాంగంలో పేర్కొనబడిన సూత్రాన్ని నీరుగార్చడమే అవుతుంది. మంత్రి వర్గం ప్రజా ప్రాతినిధ్య సభకు సమిష్టిగా బాధ్యత వహించాలి అని 75(3) అధికరణం చెబుతోంది. అదే విధంగా మంత్రి వర్గానికి సంబంచిన 164(1) అధికరణం రాష్ట్ర శాసన సభకు సమిష్టిగా బాధ్యతవహించాలని చెబుతోంది. భారత దేశం అనేక వైవిధ్యాలు గల విశాల దేశం. ఇక్కడ ఫెడరల్ వ్యవస్థ మాత్రమే రాజకీయ ప్రజాస్వామ్యాన్ని రక్షించగలదు. రాష్ట్రాల్లో వివిధ సందర్భాల్లో ఎన్నికలు జరగడం అనేది ఫెడరల్ వ్యవస్థలో ఒక అంశం.

అందువల్ల ప్రస్తుత రాజ్యాంగపరమైన పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని తొత్తడం చేయడం ద్వారా మాత్రమే జరిగే జమిలి ఎన్నికల కృత్రిమ ప్రతిపాదనను భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పూర్తిగా వ్యతిరేకిస్తోంది.

**నిధులు :**

ధన బలం అనేది రాజకీయ పార్టీల మధ్య సమానావకాశాలను దెబ్బతీస్తున్నది. ప్రజాస్వామ్యబద్ధ రాజకీయ వ్యవస్థ ప్రధాన లక్షణం స్వేచ్ఛాపూరితమైన, న్యాయబద్ధమైన ఎన్నికల క్రమం; ధన బలం ఈ క్రమాన్ని అస్తవ్యస్థం చేస్తోంది. ధనబలం అధికంగా ఉన్నవారికి ఎన్నికల్లో అవకాశాలు పెరుగుతాయన్నది ఖండించలేని సత్యం. డబ్బు గల పార్టీలకు, అభ్యర్థులకు ఎన్నికల్లో గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. నల్ల డబ్బు, లంచాలు, నాకిదిస్తే నీకదిస్తా అనే పద్ధతులు ప్రబలంగా ఉండడం వల్ల అభ్యర్థులు ఎన్నికల్లో డబ్బు దండిగా ఖర్చు చేయగలుగుతున్నారు. 2014లో ఎన్నికైన లోక్‌సభ అభ్యర్థుల ఆస్తులను విశ్లేషించినప్పుడు ఈ కింది విషయాలు బయటపడ్డాయి; మొత్తం అభ్యర్థుల్లో 27 శాతం మంది (2,208 మంది అభ్యర్థులు) “కోట్లకు పడగలెత్తిన అభ్యర్థులు”. ఈ “కోట్లకు పడగలెత్తిన అభ్యర్థుల” సంఖ్య 2009 తో పోలిస్తే 2014కు 16 శాతం పెరిగింది.

ఎన్నికల సంస్కరణలపై భారత న్యాయ

**"ఇప్పుడొచ్చే సరికొత్త సవరణ ప్రకారం బహుళజాతి కంపెనీలు ఎన్నికల బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చవచ్చు. అటువంటి విరాళాలన్నిటినీ ప్రజలదృష్టికి రాకుండా రహస్యంగా ఉంచవచ్చు. దీని ప్రభావం ప్రజా స్వామ్య వ్యవస్థ పైనా, దేశ సార్వభౌమాధికారంపైనా తీవ్రంగా ఉంటుంది. ఈ సరికొత్త సవరణలు కార్పొరేట్ అనుకూల విధానాలకు మొగ్గుచూపే రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు డబ్బు సంచులు సమకూర్చి పెడతాయి."**

కమిషన్ నివేదిక నియంత్రణ లేని, లేక పరిమిత నియంత్రణగల ఎన్నికల నిధుల ప్రభావం గురించి ఇలా చెప్పింది: "నియంత్రణ లేని, లేక పరిమిత నియంత్రణ గల ఎన్నికల నిధుల వల్ల రెండు రకాల ఫలితాలుంటాయి. మొదటిది, పరిశ్రమలు లేక ప్రయివేటు సంస్థలు తమపై నియంత్రణ లు తగ్గించుకోడానికి ఈ ఎన్నికల నిధులను ఉపయోగించుకుంటాయి. ఎన్నికల్లో అవి ఖర్చు చేసిన డబ్బు చివరికి వాటికి అనుకూలమైన విధానాలు రూపొందించుకోవడానికి దారితీస్తుంది. రెండోది మరింత తీవ్రమైనది. అదేమంటే, వారు తమ సొంత ప్రయోజనాల కోసం, అసమాన స్థాయిలో ప్రభావితం చేయడం ద్వారా (కార్పొరేట్లు) తమను నియంత్రించేవారిని తమ అదుపాజ్ఞల్లో పెట్టుకోవడమే కాక సామాన్య ప్రజల ఆలోచనలను, "ప్రజా ప్రయోజనం" అని దేన్నయితే అంటున్నామో దాన్ని కూడా తమ కనుగుణంగా మలుచుకుంటారు.

అనేక దేశాల్లో ఎన్నికల నిధులను ప్రభుత్వాలు సమకూర్చడం ద్వారా ఎన్నికల్లో బడా వ్యాపార వర్గాల పాత్రను, దానికి వాటితో ముడి పడి వున్న లంచగొండితనం, లోబర్చుకోవడం, లాబీయింగ్, వ్యవస్థీకృతమైన అవినీతి వగైరాలను తగ్గించడానికి ప్రయత్నించారు. ఇంద్రజిత్ గుప్తా కమిటీ సిఫార్సు చేసినట్లు ఎన్నికల్లో ప్రభుత్వం పాక్షికంగా నిధులు సమకూర్చాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కోరుతోంది. ప్రభుత్వమే పూర్తిగా ఎన్నికల నిధులు సమకూర్చడం, లేక ప్రయివేటు నిధులకు (దాతల ద్వారా, కార్పొరేట్ల ద్వారా వచ్చేవి) ప్రభుత్వం మ్యాచింగ్ నిధులు సమకూర్చడం అనేది నేటి పరిస్థితుల్లో సాధ్యం కాదు. ప్రస్తుతం ఇస్తున్న పాక్షిక నిధులు రాజకీయ పార్టీల ఎన్నికల విధులు నిర్వహించుకోడానికి అవసరమైన కనీస ఖర్చులకు సరిపోతున్నాయి. అందువల్ల, ప్రభుత్వం ఇచ్చే పాక్షిక నిధులు వస్తు రూపంలో పార్టీలకు, అభ్యర్థులకు "ఆర్థిక విభాగం" ద్వారా అందించాలి. ఇది కూడా ఎన్నికల ఖర్చులను తగ్గిస్తుంది.

ప్రభుత్వం ఎన్నికలకు నిధులు ఇచ్చేందుకు తీసుకొచ్చే సంస్కరణలకు అనుగుణంగా ఎన్నికల ఆర్థిక సంస్కరణలు కూడా తీసుకురావాలి. అది జరగక పోతే ప్రజా ధనమైన ప్రభుత్వ నిధులు రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు ప్రభుత్వం సమకూర్చే మరో అదనపు వనరులుగా మారి పోతాయి. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని 77వ అధికరణం అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల మీద మాత్రమే పరిమితి పెడుతోంది. రాజకీయ పార్టీ లు మాత్రం సాధారణ ప్రచారం కోసం అయితే ఎంతైనా ఖర్చు చేయవచ్చు. ఎన్నికల్లో పార్టీ ఖర్చుపై ఎటువంటి పరిమితి లేదు. ఎన్నికల్లో పార్టీ ఖర్చుపై పరిమితిలేనంత కాలం, అభ్యర్థులపై పరిమితి పెట్టడం అర్థ రహితం అవుతుంది. అందువల్ల బ్రిటన్‌లోనూ, ఇతర దేశాల్లో ఉన్న మాదిరిగా రాజకీయ పార్టీల ఖర్చులపైన కూడా పరిమితి విధిస్తూ ప్రజా ప్రాతినిధ్య చట్టానికి తగిన సవరణలు చేయాలి. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని 77వ అధికరణం లో మరో లోపం ఏమంటే అది ఒక అభ్యర్థి ఎన్నికల ఖర్చుపై నామినేషన్ వేసిన తేదీనుండి ఫలితాలు ప్రకటించే తేదీ వరకే పరిమితి విధిస్తోంది. నిజానికి ఖర్చులు చేసే కాలం మాత్రం ఇంకా చాలా ఎక్కువగానే ఉంటోంది. ఈ లోపాన్ని సరిదిద్దడానికి తగిన చట్ట సవరణ చేయాలి.

ప్రతి రాజకీయ పార్టీ, తనకు వచ్చిన డబ్బు మొత్తాలను వెల్లడిస్తూ, తను చేసిన ఖర్చును స్పష్టంగా, పూర్తిగా వెల్లడించేటట్టు అకౌంట్లను స్పష్టంగా, పూర్తిగా నిర్వహించేటట్టు ప్రజా ప్రాతినిధ్య చట్టానికి తగిన సవరణలు చేయాలి. ఎకౌంట్లను అర్హులైన చార్టెడ్ ఎకౌంటెంట్ల చేత ఆడిట్ చేయించి నిర్దిష్ట సమయంలోగా ఎన్నికల సంఘానికి, ఆదాయపన్ను విభాగానికి సమర్పించాలి. అన్ని రాజకీయ పార్టీలు సమర్పించిన ఆడిట్ అకౌంట్లను ఎన్నికల సంఘం తన వెబ్‌సైట్‌లో ప్రజలందరికీ అందుబాటులో ఉంచాలి. 2016-17లో వివిధ రాజకీయ పార్టీలు రూ. 20,000 కు మించిన మొత్తాల్లో అందుకున్న నిధులపై సరికొత్త వివరాలు ఇలా ఉన్నాయి: బిజెపి రూ. 532.27 కోట్లు, కాంగ్రెస్ పార్టీ రూ. 41.9 కోట్లు, ఎన్‌సిపి రూ. 6.34 కోట్లు, సిపిఐ(ఎం) రూ. 5.23 కోట్లు, టిఎంసి రూ. 2.15 కోట్లు, సిపిఐ రూ. 1.44 కోట్లు. బిజెపికి 2015-16లో 76.85 కోట్లు రాగా ఆ మొత్తం అమాంతంగా ఇప్పుడు దాదాపు ఏడు రెట్లు పెరిగిపోయింది.

అయితే కొత్త ఎన్నికల బాండ్లు అమలులోకి వస్తే ఈ వివరాలు కూడా మనకు అందవు. కొత్త సవరణలు విదేశీ నిధులకూ, అపరిమితమైన గుప్త నిధులకూ అవకాశం కల్పిస్తాయి. ఎన్నికల బాండ్ల ద్వారా నిధులు సమ కూర్చుకునే పద్ధతి వల్ల కార్పొరేట్‌లు రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాలు పూర్తిగా ప్రజలకు తెలియకుండా మరుగునపడతాయి. ఆదాయపు పన్ను చట్టం, ప్రజాప్రాతినిధ్య చట్టాలను కూడా సవరిస్తారు. ఈ సవరణల వల్ల రాజకీయ పార్టీలు ఎన్నికల బాండ్ల ద్వారా వచ్చిన విరాళాలు ఎక్కడి నుండి వస్తున్నాయో వెల్లడించాల్సిన అవసరం ఉండదు. అంటే, రాజకీయ పార్టీలకు వచ్చే నిధుల విషయంలో పారదర్శకత పాటించే బదులు, ఈ సవరణ ద్వారా, ఎన్నికల నిధుల వివరాలు వెల్లడించాల్సిన అవసరం ఉండదు. రహస్య నిధులు అందేందుకు ఎన్నికల బాండ్లు ఇంకో దారి తెరుస్తున్నాయన్న మాట. ఇది రాజకీయ అవినీతిని చట్టబద్ధం చేయడం మినహా మరేమీ కాదు. రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు కార్పొరేట్ విరాళాలను పూర్తిగా నిషేధించాలి. ఒక వేళ ఇవ్వాల్సి వస్తే కార్పొరేట్లు, ఎన్నికల సంఘం పర్యవేక్షించే నిధికి విరాళాలివ్వాలి. ఈ నిధిని ఎన్నికల సమయంలో పార్టీలకు ప్రభుత్వం నిధులు సమకూర్చేందుకు వినియోగించవచ్చు. గతంలో కేంద్ర బడ్జెట్‌లో ఫైనాన్స్ బిల్లు ద్వారా విదేశీ నిధుల నియంత్రణ చట్టానికి ఒక సవరణ చేశారు. ఈ సవరణ ప్రకారం విదేశీ కంపెనీల భారతీయ అనుబంధ సంస్థల నుండి వచ్చే నిధులను భారత దేశం నుండి వచ్చే నిధులుగా పరిగణిస్తారు. ఇప్పుడొచ్చే సరికొత్త సవరణ ప్రకారం బహుళజాతి కంపెనీలు ఎన్నికల బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చవచ్చు. అటువంటి విరాళాలన్నిటినీ ప్రజలదృష్టికి రాకుండా రహస్యంగా ఉంచవచ్చు. దీని ప్రభావం ప్రజాస్వామ్య వ్యవస్థపైనా, దేశ సార్వభౌమాధికారంపైనా తీవ్రంగా ఉంటుంది. ఈ సరికొత్త సవరణలు కార్పొరేట్ అనుకూల విధానాలకు మొగ్గుచూపే రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు డబ్బు సంచులు సమకూర్చి పెడతాయి. ఇది ఎన్నికల్లో ధనబలం

పెరిగేందుకు దోహదపడుతుంది. ఈ సవరణలు, ఆర్థిక రంగం మీదనే కాకుండా దేశ రాజకీయాల మీద కూడా కార్పొరేట్‌ల పట్టు పెంచుతాయి. దేశ ప్రజాస్వామ్య రాజకీయాల మీద వీటి పరిమాణాలు తీవ్రంగా ఉంటాయి. ఈ మార్పులను వెనక్కు తిప్పికొట్టడానికి, ప్రధాన ప్రభుత్వ నిధులను ఎన్నికల సంఘం పారదర్శకంగా నియంత్రించడానికి ఒక వేదికను నిర్మించడం కోసం ప్రయత్నం చేయాలి. ఈ మార్పులపై సిపిఐ(ఎం) సుప్రీం కోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేసింది. అయితే, దీనిపై ప్రజాభిప్రాయాన్ని కూడగట్టే కార్యక్రమాలు చేయాల్సిన అవసరం ఉంది.

> **"న్యాయ కమిషన్ తన సిఫార్సుల్లో, ప్రస్తుత లోక్‌సభలోని 543 స్థానాలను ప్రత్యక్ష ఎన్నికల ద్వారా నింపాలనీ, దాంతోబాటు లోక్‌సభ స్థానాలను మరో 25 శాతం అంటే 136 పెంచి వాటిని దామాషా ఎన్నికల పద్ధతి ద్వారా నింపాలని ప్రతిపాదించింది. రాష్ట్రాల శాసనసభలను కూడా ఇలాగే విస్తరించాలని సిఫార్సు చేసింది. మొదటి దశలో ఈ పద్ధతిని ప్రయత్నించవచ్చు."**

**పాక్షిక దామాషా ప్రాతినిధ్యం :**

మన దేశ రాజకీయ-ఎన్నికల వ్యవస్థ రూపొందించబడిన పద్ధతి రీత్యా, ప్రజాప్రాతినిధ్యంలో తలెత్తిన కొత్త వాస్తవికతల దృష్ట్యా పాక్షిక దామాషా ప్రాతినిధ్యం అనేది తక్షణ సమస్యగా ముందుకు వచ్చింది. 'అధిక ఓట్లు వచ్చిన వారిదే గెలుపు' (మొదట గీత దాటిన వారిదే విజయం) అన్న ప్రస్తుత పద్ధతిలో ఓట్ల వాటా, సీట్ల వాటాల విషయంలో వైరుధ్యాలు ఏర్పడుతున్నాయి. ఈ పద్ధతిలో కొన్ని నియోజకవర్గాల్లో విజయం సాధించిన అభ్యర్థికి పోలైన మొత్తం ఓట్లలో కేవలం 20 నుండి 30 శాతం ఓట్లు మాత్రమే లభిస్తున్నాయి. ఓట్లలో గణనీయమైన శాతం సాధించిన పార్టీలకు ఆ మేరకు సీట్లలో వాటా రాని ఉదాహరణలున్నాయి. తక్కువ ఓట్ల శాతం వచ్చిన పార్టీలు అధికశాతం సీట్లు సంపాదించిన సందర్భాలున్నాయి. 2014 ఎన్నికల్లో 31 శాతం ఓట్లతో పాలక పార్టీ పార్లమెంటులో సగం సీట్లు గెలుచుకుంది. గతంలో ఇలా ఎన్నడూ జరగలేదు. కాంగ్రెస్‌కి 19.3 శాతం ఓట్లతో 44 సీట్లు వచ్చాయి. 2009 ఎన్నికల్లో బిజెపికి 18.5 శాతం ఓట్లు వచ్చాయి, కానీ అది 116 సీట్లు గెలుచుకుంది. ఉత్తర ప్రదేశ్‌లో బిఎస్‌పి కి 20 శాతం ఓట్లు వచ్చినా ఒక్క స్థానమూ గెలవలేదు. తమిళనాడులో డిఎంకె దాని మిత్రపక్షాలు కలిసి 27 శాతం ఓట్లు సాధించాయి, కానీ సీట్లు మాత్రం రాలేదు. ఒడిషాలో కాంగ్రెస్‌కు 26 శాతం ఓట్లు వచ్చాయి కానీ సీట్లు రాలేదు. బిజెపికి 27 శాతం ఓట్లు వచ్చాయి కానీ ఒక్క స్థానంలో గెలిచింది. పశ్చిమ బెంగాల్‌లో వామపక్షాలకు 30 శాతం ఓట్లు వచ్చాయి. కానీ రెండు స్థానాల్లో మాత్రమే గెలిచాయి. నియోజకవర్గాల్లో ప్రజాపునాది కలిగిన చిన్న పార్టీలకు గణనీయమైన ఓట్లు వచ్చినప్పటికీ అవి ఒక్క స్థానంలోనూ గెలవని పరిస్థితిని చూశాం. ఓట్ల శాతంలో చిన్న మార్పులు వచ్చినప్పటికీ అవి గెలుచుకునే స్థానాల సంఖ్యలో గణనీయంగా



సాదాసీదాగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సిపిఐ(ఎం)

మార్పులు వచ్చే అవకాశాలున్నాయి.

దామాషా ప్రాతినిధ్య పద్ధతిలో అయితే ఓట్ల శాతానికీ, గెలిచిన స్థానాల శాతానికీ మధ్య సాధ్యమైనంత సమతుల్యత ఉంటుంది. 'మొదట గీత దాటిన వారిదే విజయం' అన్న పద్ధతిలో లోపాలను సరిదిద్దేందుకు భారత దేశంలో ఎన్నికల వ్యవస్థను 'మొదట గీత దాటిన వారిదే విజయం' అన్న ఈనాటి పద్ధతికి దామాషా పద్ధతిని కలగలిపి ఒక సమ్మిళిత పద్ధతికి మార్చాలి. న్యాయ కమిషన్ తన సిఫార్సుల్లో, ప్రస్తుత లోక్‌సభలోని 543 స్థానాలను ప్రత్యక్ష ఎన్నికల ద్వారా నింపాలనీ, దాంతోబాటు లోక్‌సభ స్థానాలను మరో 25 శాతం అంటే 136 పెంచి వాటిని దామాషా ఎన్నికల పద్ధతి ద్వారా నింపాలని ప్రతిపాదించింది. రాష్ట్రాల శాసన సభలను కూడా ఇలాగే విస్తరించాలని సిఫార్సు చేసింది. మొదటి దశలో ఈ పద్ధతిని ప్రయత్నిం చవచ్చు. తదుపరి దశల్లో దామాషా పద్ధతిలో ఎన్నుకునే స్థానాల సంఖ్యను పెంచవచ్చు.

**రాజకీయ పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం :**

ప్రస్తుతం భారత దేశంలోని రాజకీయ పార్టీల అంతర్గత ప్రజాస్వామ్యాన్ని నియంత్రించే నిబంధనలేవీ లేవు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 29ఎ అధికరణం మాత్రం రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం వద్ద నమోదు చేసుకోవాలని నిర్దేశిస్తోంది. 29ఎ అధికరణం ప్రకారం రాజకీయ పార్టీలు ఎలా నమోదుచేసుకోవాలో తెలుపుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, దరఖాస్తు ఫారాలను జారీ చేసింది.

ఈ మార్గదర్శకాలు అభ్యర్థి ఎన్నిక విషయంలో మౌనం వహిస్తున్నాయి; ఇవి కొత్త పార్టీలకు వర్తిస్తాయి గాని అప్పటికే నమోదు చేసుకున్న రాజకీయ పార్టీల అంతర్గత పనిని నియంత్రించబోవు. బహుశా ఈ లోపమే ప్రధాన ఎన్నికల కమిషనర్, చట్టం ప్రకారం జారీ చేసిన తప్పుడు ఆదేశానికి కారణమై ఉంటుంది. ఇది ఆర్‌టిఐ ద్వారా బయటపడి, తీవ్రమైన వివాదం చెలరేగడానికి దారి తీసింది.

రాజకీయ వ్యవస్థను ప్రక్షాళన చేయాలన్నా, ప్రజలలో విశ్వాసం పాదుకొల్పాలన్నా రాజకీయపార్టీల నిధుల విషయంలో జవాబుదారీ తనం, పారదర్శకత అత్యంత అవసరం. ఈ సందర్భంగా అభ్యర్థి, అతని భార్య, అతనిపై ఆధారపడిన పిల్లల ఆస్తులను కూడా బహిరంగంగా వెల్లడించాల్సిన అవసరం ఉంది. ఆదాయపన్ను నుండి మినహాయించాలంటే రాజకీయ పార్టీలు ఈ క్రింది నియమాలు పాటించాలి: (1) పార్టీ అకౌంట్ బుక్స్‌నూ ఇతర పత్రాలనూ సక్రమంగా, నిర్వహిస్తూ ఉండాలి. (2) రూ. 20,000 కన్నా ఎక్కువ విరాళం ఇచ్చిన వారి పేరు, చిరునామా, పాన్ నెంబర్ తీసుకోవాలి. (3) రాజకీయ పార్టీల అకౌంట్లను చార్టడ్ ఎకౌంటెంట్ చేత ఆడిట్ చేయించాలి. (4) రూ. 20,000 కన్నా ఎక్కువ మొత్తంలో వచ్చిన విరాళాల వివరాలను ఎన్నికల సంఘానికి సమర్పించాలి. (5) ప్రతి సంవత్సరం నిర్దేశించిన తేదీ లోపల పన్ను రిటర్న్‌లనూ, ఎకౌంట్స్ స్టేట్‌మెంట్లనూ ఆదాయపన్ను విభాగానికి సమర్పించాలి. ఈ స్టేట్‌మెంటు ప్రతిని ఎన్నికల సంఘానికి పంపించాలి.

ఇప్పుడు ఒక రాజకీయపార్టీ తప్పుడు పద్ధతిలో నమోదు చేసుకుంటే, లేక అది భారత రాజ్యాంగాన్ని ఎంతమాత్రం ఆమోదించబోనని తన పార్టీ నియమావళిని సవరణలు చేసి ఎన్నికల సంఘానికి పంపించినపుడే దాని రిజిస్ట్రేషన్‌ను ఎన్నికల సంఘం రద్దు చేస్తుంది. ఎన్నికల్లో

> **"ఒకే యజమాని చేతిలో అనేక మీడియా సంస్థలుండటం సజీవమైన ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థకు ప్రమాదం. భారతదేశంలో ఇది జరుగుతోంది. మీడియా యాజమాన్యం కొద్దిమంది పెట్టుబడిదారుల చేతుల్లో వ్యాపారంగా మారటం వల్ల దేశంలో వైవిధ్యం, భిన్నత్వం నాశనం కాకుండా చూసుకోవడం నేడు భారతదేశంలో మీడియా ముందున్న ప్రధాన సమస్య."**

పోటీ చేయకుండానే ఒక పార్టీ 13 (ఎ) అధికరణం కింద పన్ను రాయితీలు పొందుతుంటే అటువంటి పార్టీని రద్దు చేసే అధికారం ఎన్నికల సంఘానికి లేదు. అందువల్ల పదేళ్ల పాటు ఎన్నికల్లో పాల్గొనని రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్లను రద్దు చేసే అధికారం ఎన్నికల సంఘానికి ఇస్తూ ప్రజా ప్రాతినిధ్య చట్టానికి సవరణలు చేయాల్సిన అవసరం ఉంది.

రాజకీయ పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని, పారదర్శకతను ప్రవేశపెట్టడం అన్నది ఆర్థిక జవాబుదారీ తనాన్ని పెంచడానికీ, అవినీతిని తగ్గించడానికీ, ప్రజాతంత్ర పని విధానాన్ని పెంచడానికీ, దేశం మొత్తంగా ఎన్నికల జవాబుదారీ తనాన్ని పెంచడానికీ చాలా ముఖ్యమైన చర్య. అయితే ఈ పేరుతో పార్టీ అంతర్గత పనిలోనూ, సిద్ధాంతంలోనూ ఏ అధికారులూ జోక్యం చేసుకోరాదు. దీనికి సంబంధించి న్యాయ కమిషన్ చేసిన సిఫార్సు లను విశాల మార్గదర్శకాలుగా అమలుజేసేం దుకు ప్రయత్నించాలి.

**ఎన్నికల సంఘాన్ని సంస్కరించాలి :**

ఎన్నికల సంఘం స్వతంత్రమైన రాజ్యాంగ సంస్థగా ఉండాలంటే అది స్వతంత్రంగా, స్వయం ప్రతిపత్తితో ఉండడం అవసరం. అయితే, దానికి హద్దు, అదుపు లేకపోతే గాడితప్పే అవకాశం ఉంది. అందువల్ల అది విస్తారమైన ఓటర్లకూ, దేశ ప్రజలకూ జవాబుదారీగా ఉండటం అత్యంత అవసరం.

దానికోసం కొన్ని సంస్థాగత మార్పులు చేయాలి. మొదటి అంశం కమిషనర్ల నియామకం. వీరి ఎన్నిక ప్రక్రియలో అధికార వ్యవస్థకు (ఎగ్జిక్యూటివ్‌కు) సంపూర్ణాధికారాలు దఖలు పడకుండా ఉండేందుకు గాను, అధికార వ్యవస్థ, చట్ట సభలు (లెజిస్లేచర్), న్యాయవ్యవస్థ (జ్యుడిషియరీ)లు కమిషనర్ల ఎంపిక ప్రక్రియలో పాల్గొనాలి. రెండోది, ఈ కమిషనర్లు చాలా వరకు మాజీ అధికారులు కావడం వల్లన ఈ నియామకాలన్నీ రిటైర్‌మెంటు తరువాత వారికి లభిస్తున్న లాభదాయక పదవులుగా మారడంతో ప్రస్తుతం అధికారంలో ఉన్న వారిపై దీని ప్రభావం పడుతోంది. మూడోది, ఎన్నికల సంఘానికి స్వతంత్రంగా అధికారులను ఆదేశించే అధికారం ఎన్నికల వరకే పరిమితం కావడంతో, వారు ఎన్నికల తరువాత కక్షసాధింపు నుండి రక్షణ పొందలేకపోతున్నారు. ఈ సమస్యను కూడా పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

**మీడియా పాత్ర, సమానావకాశాలు (లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్) పై దాని ప్రభావం :**

మీడియా యాజమాన్యాలు కొద్దిమంది బడా కార్పొరేట్‌ల అదుపు (ఓలిగార్ఖీస్)లో ఉండడం వలన భారత దేశంలో అధికారంలో ఉన్న పార్టీలకు ప్రయోజనం కలుగుతోంది. ఇది స్వేచ్ఛగా, న్యాయంగా ఎన్నికలు జరగడానికి ప్రతికూలంగా మారింది. రాజకీయ పార్టీల పైనా, అభ్యర్థులపైనా కక్షసాధింపులు, బురద జల్లడాలు జరుగుతున్నాయి. ఈ రంగంలో తగిన నియంత్రణ వ్యవస్థలు అవసరం. ఎన్నికల సమయంలో ప్రయివేటు యాజమాన్యాల్లోని ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాల్లో రాజకీయ పార్టీలకూ, అభ్యర్థులకూ సమయాన్ని కేటాయించడానికి తగిన ఏర్పాట్లు చేయాలి.

డబ్బిచ్చి వార్తలు కొనుక్కునే ఇటీవలి పరిణామం స్వేచ్ఛగా, న్యాయంగా ఎన్నికలు జరగడానికి ఆటంకగా ఉంది. ఇది ఓటర్ల సమాచార హక్కుకు భంగం కలిగిస్తోంది. ధన బలం ఉన్న వారికే అనుకూలంగా ఎన్నికలను మార్చేస్తోంది. వార్తల కోసం డబ్బు ఇవ్వడం, తీసుకోడాన్ని నిషేధించాలి. దీన్ని ఎన్నికల నేరంగా పరిగణించి శిక్షార్హమైనదిగా మార్చాలి. రాజకీయ ప్రకటనలను నియంత్రించాలి. అవి అడ్వర్టయిజ్ మెంట్లు అని తెలిపేందుకు అందులోని విషయంతో తమకు సంబంధం లేదన్న వాక్యం ప్రకటనతోపాటే చూపించాలి. రాజకీయ 'ప్రకటనలు' డబ్బిచ్చి ప్రచురించుకున్నవని ప్రజలకు తెలియడం కోసం, అవి వార్తలరూపంలో రాకుండా చూడటం కోసమే ఈ నియంత్రణలు అవసరం.

ఒకే యజమాని చేతిలో అనేక మీడియా సంస్థలుండటం సజీవమైన ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థకు ప్రమాదం. భారత దేశంలో ఇది జరుగుతోంది. మీడియా యాజమాన్యం కొద్దిమంది పెట్టుబడిదారుల చేతుల్లో వ్యాపారంగా మారటం వల్ల దేశంలో వైవిధ్యం, భిన్నత్వం నాశనం కాకుండా చూసుకోవడం నేడు భారత దేశంలో మీడియా ముందున్న ప్రధాన సమస్య. ఈ దిశలో నేటి క్రమం కొనసాగితే వార్తా ప్రసారాల్లో వైవిధ్యం దెబ్బతిని సమాచార ప్రయివేటీకరణ, వ్యాపారీకరణ పెరుగుతుంది. వాస్తవమైన, నిష్పాక్షికమైన, వైవిధ్యం గల అభిప్రాయాలు తెలుసుకునే పౌరుల హక్కును కాపాడేందుకు తగిన రక్షణచర్యలు తీసుకోవడం అవసరం. ఎన్నికల సంఘం ప్రభుత్వానికీ, ప్రయివేటు మీడియాకూ వర్తించే సాధారణ మార్గదర్శకాలు జారీ చేయగలదు. దూరదర్శన్, ఆలిండియా రేడియోలు కూడా ప్రభుత్వాన్ని నడుపుతున్న రాజకీయ పార్టీలకు అనుకూలంగా పాక్షిక వార్తలు ఇస్తున్నాయి. అందువల్ల జారీ చేసే మార్గదర్శకాలు ప్రభుత్వానికీ, ప్రయివేటు, సోషల్ మీడియాకు కూడా వర్తించేటట్లు ఉండాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాదిరిగానే స్వతంత్రమైన ప్రసార నియంత్రణ సంస్థ కూడా అవసరం.

**ఓటింగ్ పద్ధతి, టెక్నాలజీ ఎంపిక :**

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్(ఇవిఎం)ల పైనా, ప్రస్తుతం వివిపిఎటి మెషిన్లతో కలిపి వాటిని వాడడంపైనా పెద్ద చర్చ నడుస్తోంది. గతంలో సిపిఐ (ఎం) ఇవిఎం లకు మద్దతిచ్చింది. కానీ ప్రజల్లో దానిపట్ల సందేహాలు పెరుగుతున్న నేపథ్యంలో వివిపిఎటి మెషిన్ల వాడకాన్ని ప్రవేశపెట్టాలని ఇప్పుడు కోరుతున్నది. ఇవిఎంల వాడకంలో కుట్రలు దాగున్నాయన డానికి ఖచ్చితమైన సాంకేతిక ఆధారాలు లేనప్పటికీ కనీసం 10 శాతం బూత్‌లలో ఇవిఎం రికార్డులను వివిపిఎటి లెక్కతో సరిపోల్చాలని సిపిఐ (ఎం) గతంలో చేసిన సూచనను ఎన్నికల సంఘం ఆమోదించింది. కానీ దీన్ని అమలు చేయడం లేదు. దీనికి తోడు ఎన్నికల సందర్భంగా పెద్ద ఎత్తున యంత్రాలు విఫలమవుతున్న ఘటనలు రిపోర్టు అవుతున్నాయి. దీని వల్ల ప్రతికూల ప్రభావం పడుతోంది. ఇవిఎంలను వివిపిఎటి యంత్రాలతో అనుసంధానం చేయడంలో కొన్ని సాంకేతిక ఇబ్బందులున్నాయని అధికారులు అంగీకరిస్తున్నారు. ఇవిఎంల, వివిపిఎటిల విషయంలో డిజైన్, నిర్మాణం, నిర్వహణ, మరమ్మతు కార్యకలాపాలలో ప్రయివేటు వ్యాపారుల ప్రమేయాన్ని పూర్తిగా తొలగించాలి. వాటి భౌతిక రక్షణ పటిష్టంగా ఉండే విధంగా కొత్త మార్గదర్శకాలు రూపొందించేందుకు ఎన్నికల సంఘం అన్ని పార్టీలతో సంప్రదించి నిర్ణయాలు తీసుకోవలసిన అవసరం ఉంది. ❋

సమగ్రాభివృద్ధి సామాజిక న్యాయం ప్రజాసంక్షేమం కోసం

# నూతన రాజకీయ ప్రత్యామ్నాయానికి కలిసి రండి

రాష్ట్రంలో రాజకీయ ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటుచేయడం కోసం సిపిఐ(ఎం), సిపిఐలు రూపొందించిన ప్రచార కరపత్రాన్ని మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం.

\- సంపాదకులు

**ఆరు** దశాబ్దాలు ఐక్యంగా ఉన్న తెలుగుజాతి 2014 జూన్‌లో రెండుగా చీలిపోయింది. రెండు రాష్ట్రాలు ఏర్పడ్డాయి. విభజన అనంతరం తెలుగుదేశం పార్టీ, తాము అధికారంలోకి వస్తేనే నవ్యాంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి సాధ్యం అన్న ప్రచారంతో గెలిచి అధికారాన్ని చేపట్టింది. కానీ ఈ నాలుగేళ్ళలో ఆశించిన ఫలితాలు సాధించలేదు. రాష్ట్రం కొత్తదైనా విధానాలు మాత్రం పాతవే. అందుకే నేడు రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం, సామాజిక న్యాయం, ప్రజాసంక్షేమం కోసం ప్రత్యామ్నాయ విధానాలు అవసరం అయ్యాయి.

ఉమ్మడి రాష్ట్రంలో దీర్ఘకాలం కాంగ్రెసు, తర్వాత తెలుగుదేశం అభివృద్ధి పేరుతో పరిశ్రమలు, ఆధునిక ప్రాజెక్టులన్నింటినీ ఒకేచోట కేంద్రీకరించినందున రాష్ట్రం తీవ్ర అసమానతలకు లోనయింది. వెనుకబడిన ప్రాంతాలు, వర్గాలు, తరగతులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. హైదరాబాద్ నగరం చుట్టూ అభివృద్ధి కేంద్రీకరించబడింది. పెట్టుబడిదారులకు పెద్దపీట వేయడం, సరళీకరణ ఆర్థిక విధానాల పేరుతో మార్కెట్ శక్తులకు స్వేచ్ఛనివ్వడంతో వ్యవసాయ రంగం కునారిల్లిపోయింది. కార్మికుల నిజ వేతనాలు పడిపోయాయి. కొద్ది మంది సంపన్నులు, పారిశ్రామికాధిపతులు, కాంట్రాక్టర్లు, రియల్ ఎస్టేట్ ఓనర్లు, ఫైనాన్స్ కంపెనీల వద్ద సంపద పోగైంది. అత్యధికులు నిరుపేదలుగా మిగిలిపోయారు. రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. ఈ అసమానతల్లో నుంచే ప్రత్యేక తెలంగాణా ఉద్యమం రాజుకుంది. కాంగ్రెసు, తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెసు, బిజెపీల అవకాశవాద రాజకీయాలతో రాష్ట్రం రెండు ముక్కలైంది.

రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఐదేళ్ళు చాలదని 10సం॥లు కావాలని పార్లమెంటులో బిజెపి వాదించింది. తాను అధికారంలోకి వస్తే దాన్ని 10 ఏళ్ళు చేసి అమలు చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చకుండా దారుణంగా వంచించింది. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీలు, రైల్వే జోన్, కడప ఉక్కు, రాజధాని నిర్మాణానికి నిధులు, బడ్జెట్‌లోటు భర్తీకి నిధులు విద్యా, వైద్య సంస్థలు వంటి హామీలను అమలు చేయకుండా మోసం చేసింది. ఇప్పుడు ప్రజల్లో ఒంటరిపాటయ్యే కొద్దీ మత వివాదాలను ముందుకు తెచ్చి ప్రజల్లో చీలికలు పెట్టాలని బిజెపి ప్రయత్నిస్తోంది. అలాగే జాతీయ స్థాయిలో మోడీ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు రాష్ట్రాల హక్కుల్ని హరించడమేగాకుండా ప్రజలపై అదనపు భారాలను మోపుతున్నాయి. వ్యవసాయాభివృద్ధి, నీటి వనరుల కల్పన, కార్మికులకు కనీస వేతనాలు, యువతకు ఉద్యోగాలు, అవినీతి, గిట్టుబాటు ధరలు తదితర అంశాలపై చేసిన వాగ్దానాలను అమలు చేయకుండా బిజెపి మాట తప్పింది. తెలుగుదేశం గానీ, ప్రధాన ప్రతిపక్షంగా వున్న వైఎస్సార్ కాంగ్రెస్‌గానీ ఈ విధానాలపై మాట్లాడ్డం లేదు. ప్రత్యేకహోదాపై బిజెపి ప్రభుత్వ విద్రోహాన్ని వామపక్షాలు ఆందోళనలతో నిలదీస్తే ఆ పార్టీలను తెలుగుదేశం తూలనాడింది. రాష్ట్రం వివక్షతకు గురికావడానికి, వెనకబడడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విద్రోహం ప్రధాన కారణమైతే దానికి వంత పాడి ప్రజలను తప్పుదారి పట్టించిన తెలుగు దేశం కూడా అంతే కారణం.

తెలంగాణా విడిపోయాక రాష్ట్రానికి రాజధాని కూడా లేని దుస్థితి ఏర్పడింది. ఈ రాష్ట్రంలోని సంపదపరులంతా లాభాల కోసం వారి పెట్టుబడులను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. రాష్ట్రాభివృద్ధి పేరుతో ముఖ్యమంత్రి విదేశీ పెట్టుబడుల కోసం ఆరాట పడుతున్నారు. వారిని ఆకర్షించడానికి రైతుల, కూలీల, కార్మికుల మధ్యతరగతి ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారు. కార్పొరేట్ సెక్టార్‌ను సంతృప్తి పరిచేందుకు ఈజ్‌ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో బలవంతపు భూసేకరణ, కార్మికుల హక్కుల హరింపు వంటి ప్రజావ్యతిరేక చర్యలకు తెలుగుదేశం ప్రభుత్వం పూనుకుంటున్నది. సామాన్య ప్రజల ఇక్కట్లను గాలికొదిలేసి ఆగమేఘాలమీద కార్పొరేట్‌ల పనులు చేయాలన్న తపన ఈ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నది.

సామాన్య రైతుల భూములను, దళితుల అసైన్డ్ భూములను బలవతంగా ప్రభుత్వం గుంజుకొంటోంది. దీనికోసం 2013 భూసేకరణ చట్టాన్ని సవరించింది. కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నది. భూవినియోగ విధానం ఉపాధిని దెబ్బదీస్తోంది. కానీ పేదల ఇళ్ళ స్థలాలకు మాత్రం ఒక్క ఎకరా కూడా కేటాయించడం లేదు. కరువు ప్రాంతాలకు, వెనుకబడ్డ ప్రాంతాలకు సాగునీరు, త్రాగునీరు అందించే సమగ్ర విధానమూ లేదు. విభజన నాటితో పోల్చితే నికర సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. వ్యవసాయపంటల ధరలు పడిపోతున్నాయి. రుణమాఫీ పథకంలో జరిగిన ఆలస్యం అసలు పథకం లక్ష్యాన్నే దెబ్బదీసింది. రుణభారం పెరిగి రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. కూలీలు, వృత్తిదారులు ఉపాధిలేక వలసబాట పట్టారు. ఉపాధి హామీ పథకం సరిగ్గా అమలు కావడం లేదు. ఇళ్ళు లేని పేదలకు సెంటు భూమికానీ, ఇళ్ళు కానీ ఇవ్వలేదు. పారిశ్రామిక రంగంలో మూసివేతలు పెరుగుతున్నాయి. కార్మిక హక్కుల చట్టాలకు సవరణలు చేసి ఉన్న రక్షణల్ని ప్రభుత్వం దెబ్బదీసింది. యువత ఉద్యోగాలు లేక నిరాశకు లోనవుతోంది.

విద్య, వైద్య రంగాల్లో కార్పొరేట్ల లాభాలకు దాసోహం అని సామాన్యులకు భారాల్ని పెంచింది. ఉపాధి కల్పన దెబ్బతిన్నది. విద్యా, వైద్యంలో మానవాభివృద్ధి సూచికలలో రాష్ట్రం వెనకబడింది. ఇసుక, ఖనిజాలు, నీరు, భూమి, అడవులు లాంటి ప్రకృతి వనరులను అక్రమ మార్గాల్లో ధనవంతులు కొల్లగొడుతున్నారు.

"పాలకపక్షపు విధానాలను ఎదిరించి ప్రజలకు అండగా నిలవాల్సిన ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్‌సిపి రాష్ట్రపతి ఎన్నికల్లో బిజెపిని బలపర్చడానికి పోటీపడింది. మతోన్మాద ప్రమాదాన్ని గుర్తించ నిరాకరిస్తోంది. ఆపదలో ఉన్న ప్రజలకు "మన ప్రభుత్వం వస్తున్నది అప్పుడు చూద్దాం" అన్న మాటలతో సరిపుచ్చుతోంది."



సిపిఎం-సిపిఐ రాష్ట్ర సదస్సు

అగ్రకుల దురహంకార దాడులు పెరిగాయి. దళిత, ఆదివాసీ, బలహీనవర్గాలపై అత్యాచారాలు ఎక్కువయ్యాయి. ఈ దాడులను, అత్యాచారాలను, అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైంది. మహిళా సాధికారత మాటలకే పరిమితం అయింది. డ్వాక్రా గ్రూపులకు అప్పుల రద్దు వాగ్దానం అటకెక్కింది. గిరిజన భూములకు, హక్కులకు రక్షణ కరువైంది. జన్మభూమి కమిటీల పెత్తనంతో స్థానిక సంస్థలను నిర్వీర్యం చేశారు. అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం అవినీతిలో కూరుకు పోయాయి.

ప్రజా సమస్యలకోసం ఆందోళన చేసే ప్రజలమీద ప్రభుత్వం అధికార దుర్వినియోగంతో అణచివేతకు ప్రయత్నిస్తోంది. ప్రతిపక్ష పార్టీల పట్ల, ఉద్యమాల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తోంది. 144 సెక్షన్, పోలీసు యాక్ట్ 30ని నిరంతరం ప్రయోగిస్తున్నది. ముందస్తు అరెస్టులు, అక్రమ కేసులు మితిమీరాయి.

పాలకపక్షపు విధానాలను ఎదిరించి ప్రజలకు అండగా నిలవాల్సిన ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్‌సిపి రాష్ట్రపతి ఎన్నికల్లో బిజెపిని బలపర్చడానికి పోటీపడింది. మతోన్మాద ప్రమాదాన్ని గుర్తించనిరాకరిస్తోంది. ఆపదలో ఉన్న ప్రజలకు "మన ప్రభుత్వం వస్తున్నది అప్పుడు చూద్దాం" అన్న మాటలతో సరిపుచ్చుతోంది. అసెంబ్లీలో ఉండి కూడా 2013 భూసేకరణ చట్ట సవరణను అడ్డుకోలేదు. భూములు కోల్పోయిన రైతులు, దళితులు, ఆదివాసీల రక్షణకు ముందుకు రావడం లేదు. మహిళల హక్కుల విషయంలో కూడా ఇదే వైఖరి. అసెంబ్లీని బహిష్కరించడం ద్వారా ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడంలో ఘోరంగా విఫలమైంది. నవరత్నాల పేరుతో విద్యలో, వైద్యంలో ప్రయివేటు రంగాన్ని ప్రోత్సహించడానికే పూనుకున్నది. ఓట్లకోసం ప్రజాకర్షక వాగ్దానాలను గుప్పిస్తోంది. మౌలిక విధానాలలో వైఎస్సార్‌సిపికి, ఇతర పాలక పార్టీలకు తేడా లేదు. కాంగ్రెస్ పార్టీ విధానాలు కూడా ప్రయివేటు రంగాన్ని ప్రోత్సహించే వినాశకరమైన విధానాలే. బిజేపీ పెరుగుదలకు కాంగ్రెసు తప్పుడు విధానాలే కారణం. ఈ రాజకీయ పరిస్థితిని ఉపయోగించుకుని రాష్ట్రంలో మతోన్మాద శక్తులు బలపడేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి.

ఈ నాలుగు పార్టీల విధానాలు రాష్ట్రాభివృద్ధికి తోడ్పడేవి కావు. సంపన్నులు, బడా కార్పోరేట్ వర్గాలు మాత్రమే వీరి విధానాల వల్ల బాగుపడుతున్నారు. సామాన్యులు కుంగిపోతున్నారు. సామాజిక ప్రగతి, సామాజిక న్యాయం ఎజెండా మీద లేకుండా పోతున్నాయి. ప్రకృతి వనరులను లూటీ చేస్తూ, ప్రజల సంపదను, ఆదాయాలను కొల్లగొడుతున్నారు. ప్రతిఘటించే శక్తులను అణచి వేస్తున్నారు. ప్రభుత్వ మద్దతుతో పెత్తందార్లు, భూస్వాములు, పెట్టుబడిదారీ శక్తులు తమ ప్రాబల్యాన్ని కాపాడుకుంటున్నారు. ఇప్పటి వరకు ఉన్న అధికార పార్టీలన్నీ ఈ శక్తులకు కొమ్ము కాశాయి. ఈ పార్టీలన్ని ప్రపంచవ్యాపితంగా సంక్షోభానికి దారితీసిన సరళీకరణ ఆర్థిక విధానాలనే అమలు చేస్తున్నాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ విధానాలను విమర్శించిన ఈ పార్టీలు అధికారంలోకి రాగానే వాటినే కొనసాగిస్తున్నాయి. ప్రపంచ బ్యాంకు ప్రేరేపితమైన ఈ నమూనా మన రాష్ట్రానికి చెల్లదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో వీరి ప్రజా వ్యతిరేక పాలన ప్రజలకు అనుభవమే. ఒకరిని మార్చి ఒకరు అధికారంలోకి వచ్చినా ప్రజల బతుకుల్లో మార్పు ఉండదని రుజువైంది. వీరు అనుసరించే కార్పొరేట్ అనుకూల విధానాలు మారకుండా రాష్ట్రం ముందుకు పోదు. దీనికి భిన్నమైన విధానాలు, పరిపాలన కావాలి. అందుకే మరో ప్రగతిశీలమైన ప్రత్యామ్నాయం అవసరం.

ప్రజలకు అండగా నిలిచి, అభ్యుదయ, ప్రజానుకూల, లౌకిక విధానాలతో ప్రజలకు ఊరట కలిగించగలిగే శక్తులు బలపడాలి. వికేంద్రీకరణ విధానాలు కావాలి. సామాజిక న్యాయాన్ని కాపాడే శక్తులతో కూడిన ప్రత్యామ్నాయం నేటి తక్షణ అవసరం. కార్మికవర్గ, ఉద్యోగ వర్గాల పోరాటాలు, భూమికోసం, పునరావాసంకోసం, సామాజిక న్యాయంకోసం జరుగుతున్న ఉద్య మాలు, నాణ్యమైన విద్యకోసం విద్యార్థులు, ఉపాధికై ఉద్యమిస్తున్న యువత, మద్య నియంత్రణకోసం మహిళల ఉద్యమం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం జరిగే ఆందోళనలు, ప్రత్యేకహోదా, విభజన హామీల అమలు కోసం జరుగుతున్న కృషి రాష్ట్రంలో సానుకూలమైన పరిస్థితిని సృష్టించాయి. వామపక్ష ప్రజాతంత్ర శక్తుల కృషి, సామాజిక ఉద్యమాలు రాష్ట్రంలో నూతన రాజకీయ ప్రత్యామ్నాయ నిర్మాణం కోసం అనువైన వాతావరణాన్ని ఏర్పరిచాయి.

అనాదిగా తెలుగు ప్రజల భవిష్యత్తుకోసం నిలిచిన కమ్యూనిస్టు ఉద్యమ వారసత్వాన్ని కొనసాగించడానికి ఈ పరిణామాలు దోహదం చేస్తాయి. జమీందారీ వ్యతిరేక పోరాటం మొదలు నయా ఉదారవాద విధానాలను ప్రతిఘటించిన విద్యుత్ ఉద్యమం వరకు, భూపోరాటాలు, రైతాంగ పోరాటాలు మొదలుకొని ప్రత్యేక హోదా కోసం సాగిన ఉద్యమాలు, చుండూరు, కారంచేడు, నీరుకొండ మొదలు ఎస్సీ కమిషన్, సబ్‌ప్లాన్ కోసం సాగిన పోరాటాలు, తాజాగా గరగపర్రు, దేవరపల్లి, పెదగొట్టిపాడు, మహాభారతం ఉత్సవాల వరకు సాగిన సామాజిక ప్రతిఘటనోద్యమాలు, భూపోరాటాలు, గిరిజనోద్యమాలు, కాలుష్య

వ్యతిరేక దివీస్, తుందుర్రు పోరాటాలు, వామపక్ష ప్రజాతంత్ర శక్తుల పురోగమనానికి పునాదిగా ఉంటాయి.

ఈ ప్రాతిపదికన రాష్ట్రంలోని వామపక్ష పార్టీలు, వివిధ వర్గ సంఘాలు, ప్రజా ఉద్యమాలు, వామపక్ష ప్రజాతంత్ర భావాలుగల వ్యక్తులు, శక్తులు, సామాజిక ఉద్యమాలు, అభ్యుదయ సంస్థలు ఒకే వేదికపైకి సమీకరించేదానికి కృషి జరగాలి. నయా ఉదార వాద విధానాలను, మతోన్మాదాన్ని, కుల దురహంకార శక్తులను, నిరంకుశ విధానాలను ప్రతిఘటించే వారినందరినీ ప్రత్యామ్నాయ కార్యక్రమం చుట్టూ సమీకరించాలి. ప్రస్తుత రాష్ట్ర పరిస్థితులలో ఇదే సరైన మార్గమని సిపిఐ-సిపిఐ(యం) భావిస్తున్నాయి.

వామపక్ష పార్టీలతోపాటుగా జనసేన, లోక్‌సత్తా, ఆమ్‌ఆద్మీ, బిఎస్పీ, విసికె (విదుతలై చిరుతైగల్ కచ్చి) తదితర పార్టీలు వారి వారి విధానాలతో ముందుకు వస్తున్నాయి. సామాజిక సమస్యలపై మరికొన్ని పార్టీలు పనిచేస్తున్నాయి. జనసేన కొన్ని ప్రజా సమస్యల్ని లేవనెత్తి పోరాడుతున్నది. సరళీకరణ ఆర్థిక విధానాలు, మతోన్మాదం వంటి సమస్యలపై ఈ పార్టీల్లో భిన్న దృక్పథాలున్నాయి. అయినా ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఇలాంటి శక్తులు ముందుకు రావడం ద్వారా రాజకీయ గుత్తాధిపత్యాన్ని బద్దలు కొట్టి బహుముఖ రాజకీయాల దిశగా నడిచే అవకాశం వుంది. ఈ పరిస్థితి వామపక్ష ప్రజాతంత్ర శక్తుల పురోగమనానికి తోడ్పడుతుంది. అలాగే సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధి, లౌకికవాదం, ప్రజాస్వామ్య హక్కులు లక్ష్యాలుగా పనిచేసే పార్టీలు, శక్తులు కూడా పనిచేయడానికి అవకాశం వస్తుంది.

వివిధ పార్టీలు, సంస్థల మధ్య సైద్ధాంతిక విభేదాలుంటాయి. రాజకీయ తేడాలుంటాయి. అయినా అంగీకృత అంశాలపై కలసి పని చేయడానికున్న అవకాశాలను పరిశీలించాలి. దానికొక కార్యక్రమం అవసరం. కనీస అంశాల ప్రాతిపదికగాప్రజానుకూల ప్రత్యామ్నాయంకోసం కలిసొచ్చే అన్ని శక్తులు ఒకతాటిపైకి రావాలి. తద్వారా నూతన రాజకీయ ప్రత్యామ్నాయాన్ని బలపర్చవచ్చు. ఈ నేపథ్యంలో ఉభయ కమ్యూనిస్టుపార్టీలు ఈ క్రింది కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రజల ముందుకు తెస్తున్నాయి. వామపక్ష శక్తులు, ప్రజాస్వామిక శక్తులు, పార్టీలు, సామాజికోద్యమ నాయకులు, సంఘాలు, అభ్యుదయ వాదులు రాష్ట్రాభివృద్ధి, సామాజికన్యాయం, ప్రజాసంక్షేమాన్ని కోరుకునే వ్యక్తులు ఈ కార్యక్రమాన్ని చర్చించి తమ సూచనల ద్వారా దీన్ని పరిపుష్టం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

> **“వివిధ పార్టీలు, సంస్థల మధ్య సైద్ధాంతిక విభేదాలు ఉంటాయి. రాజకీయ తేడాలుంటాయి. అయినా అంగీకృత అంశాలపై కలసి పని చేయడానికున్న అవకాశాలను పరిశీలించాలి. దానికొక కార్యక్రమం అవసరం. కనీస అంశాల ప్రాతిపదికగాప్రజానుకూల ప్రత్యామ్నాయంకోసం కలిసొచ్చే అన్ని శక్తులు ఒకతాటిపైకి రావాలి. తద్వారా నూతన రాజకీయ ప్రత్యామ్నాయాన్ని బలపర్చవచ్చు.”**

రాష్ట్ర సమగ్రాభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం, లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, వికేంద్రీకరణ - లక్ష్యాలుగా నూతన ప్రత్యామ్నాయాన్ని ప్రతిపాదిస్తున్నాం.

**రాష్ట్ర సమగ్రాభివృద్ధి - వెనుకబడిన ప్రాంతాలకు ప్రాధాన్యత**

సమగ్రాభివృద్ధి అంటే అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి కావడం. రాజధాని పేరుతో అభివృద్ధినంతా ఒకే చోట కేంద్రీకరించే పద్ధతి వల్ల గత అనుభవాలే పునరావృత మవుతాయి. ప్రాంతీయ అసమానతలు తీవ్రతరమవుతాయి. ప్రజల మధ్య ద్వేషాలు పెరుగుతాయి. పట్టణాలు, గ్రామాల మధ్య అసమానతలు తగ్గాలి. అన్ని గ్రామాల్లోనూ కనీస వసతులు ఏర్పడాలి. మండలం యూనిట్‌గా అసమానతలను పూడ్చాలి. ఇందుకోసం

(1) రాష్ట్రానికి ప్రత్యేకహోదా కావాలి. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయాలి. విభజన చట్టంలోని ఇతర హామీల అమలు, రాజధాని నిర్మాణానికి, బడ్జెట్ లోటు పూడ్చుకోడానికి కేంద్రం నుండి నిధుల సాధన- విశాఖ రైల్వే జోన్, కడపలో ప్రభుత్వ ఉక్కు ఫ్యాక్టరీ, సెంట్రల్ యూనివర్శిటీ, గిరిజన యూనివర్శిటీ సాధన. పోలవరం నిర్వాసితులకు సంపూర్ణ పునరావాసం, ప్రాజెక్టు సత్వరం పూర్తి.

(2) రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం, నెల్లూరు జిల్లాలోని కరువు ప్రాంతాలకు నీటి ప్రాజెక్టులను పూర్తిచేయడానికిప్రాధాన్యత.

(3) విశాఖ ఉక్కుకు స్వంత గనుల కేటాయింపు, కెజిబేసిన్ గ్యాస్‌లో రాష్ట్రానికి వాటా, దానితో విద్యుత్ ఉత్పత్తికి, ఎరువుల ఉత్పత్తి. డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌ను ప్రయివేటీకరించరాదు.

(4) జ్యూట్, ఫెర్రో ఎల్లాయిస్, చక్కెర కర్మాగారాలు, స్పిన్నింగు మిల్లులు ఇతర మూతబడ్డ పరిశ్రమలను తెరిపించడం-ప్రభుత్వ రంగానికి ప్రాధాన్యత.

**శ్రమకు తగ్గ ఫలితం**

శ్రమచేసి దేశానికి సంపద పెంచుతున్న రైతులు, కూలీలు, కార్మికుల పరిస్థితి రోజు రోజుకూ దిగజారిపోతున్నది. వారి కష్ట ఫలితం వారికి దక్కితేనే జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. దేశం అభివృద్ధి చెందుతుంది.

**వ్యవసాయ రంగ పరిరక్షణ - రైతులు, కూలీల సంక్షేమం**

(5) రైతులకు కనీస మద్దతు ధర గ్యారెంటీ చట్టం-రైతు రక్షణ నిధి ఏర్పాటు, రుణ మాఫీ, ప్రైవేటు రుణ నియంత్రణచట్టం. బ్యాంకుల ద్వారా వడ్డీలేని పంట రుణం.

(6) కౌలు రైతులందరికీ కార్డులు, హామీ లేకుండా రుణాలు, ఇన్స్యూరెన్సు. 50 ఏళ్ళు దాటిన పేద రైతులకు పెన్షన్.

(7) స్వామినాథన్, జయతీఘోష్, కోనేరు రంగారావు కమిటీల సిఫార్సుల అమలు.

**కార్మిక హక్కులు**

(8) నెలకు రూ. 18,000/-లు కనీస వేతనం, కార్మిక హక్కులను దెబ్బదీసే చట్టాల రద్దు, కార్మిక చట్టాల అమలు యంత్రాంగం బలోపేతం - కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, గౌరవ వేతన కార్మికులకు ఉద్యోగ భద్రత, రెగ్యులరైజేషన్, అందరికీ ఇఎస్ఐ, పిఎఫ్ అమలు. స్కీం వర్కర్లను ప్రభుత్వ సిబ్బందిగా గుర్తించి వేతనాలు పెంచడం. ప్రభుత్వ రంగ పరిరక్షణ - వలస కార్మికులకు రక్షణ.

**సిపియస్ వద్దు**

(9) కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ విధానం, 2004 తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారికి మరణశాసనంగా మారింది. రిటైర్మెంట్ తర్వాత జీవితం గాలిలో దీపంలా మారుతుంది. దానికి వ్యతిరేకంగా ఉద్యోగులు పెద్దఎత్తున పోరాడుతున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం 2014 ఎన్నికల్లో పాత విధానాన్ని పునరుద్ధరిస్తానని వాగ్దానం చేసి అమలు చేయకుండా దారుణంగా మోసం చేసింది. దీన్ని పునరుద్ధరించడం వామపక్ష,

**"సామాజిక న్యాయం అంటే సమాజంలో అట్టడుగున ఉన్న దళితులు, ఆదివాసీలు, బడుగు బలహీన వర్గాలు ఇతర కులాలతో పాటు సమానంగా అభివృద్ధి కావడం. అంటరానితనం, కుల వివక్షత అంతం చేయాలి. కులాంతర వివాహాలు చేసుకునే వారిని ప్రోత్సహించాలి. అలాంటి జంటలకు రక్షణ కల్పించి బతకడానికి భరోసా ఇవ్వాలి."**



పేదలనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి. మధు

ప్రజాతంత్ర శక్తుల వల్లే సాధ్యమవుతుంది.

### భూమి కావాలి

(10)భూమి లేని నిరుపేదలకు కుటుంబానికి ఉచితంగా రెండు ఎకరాల భూమి.

(11)వ్యవసాయ కార్మికులకు సంవత్సరం పొడవునా పనులు, కనీస వేతనం అమలు– పేదలకు ఉచిత విద్యుత్, ప్రతి ఇంటికీ టాయిలెట్, మంచినీరు, గ్యాస్ సరఫరా. నిర్వాసితులకు సంపూర్ణ పునరావాసం

(12)ఐదేళ్ళు దాటినా ఫ్యాక్టరీలు పెట్టని భూములను వెనక్కు తీసుకుని పేదలకు ఇవ్వాలి. రైతులు, గ్రామీణ ప్రజలను భూములు ఖాళీ చేయించి బలవంతంగా పంపరాదు. సంపూర్ణ పునరావాసం పూర్తయ్యాకే అభివృద్ధి పనులకు కేటాయించాలి. కార్పొరేట్లకు కేటాయించిన భూముల్లో పరిశ్రమలు పెట్టకుంటే వెనక్కి తీసుకొని పేదలకు పంచాలి.

(13)భూసేకరణ – పునరావాస చట్టం 2013 పక్కాగా అమలు – 2018 సవరణల ఉపసంహరణ.

### సామాజిక న్యాయం

సామాజిక న్యాయం అంటే సమాజంలో అట్టడుగున ఉన్న దళితులు, ఆదివాసీలు, బడుగుబలహీనవర్గాలు ఇతర కులాలతో పాటు సమానంగా అభివృద్ధి కావడం. అంటరానితనం, కుల వివక్షత అంతం చేయాలి. కులాంతర వివాహాలు చేసుకునే వారిని ప్రోత్సహించాలి. అలాంటి జంటలకు రక్షణ కల్పించి బతకడానికి భరోసా ఇవ్వాలి. అణగారిన కులాలపై దాడులకు తెగబడే సాహసం చేయకుండా అగ్రకుల దురంహకారాన్ని కట్టడి చేయాలి.

(14)ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత – ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ–ప్రయివేటురంగంలోనూ రిజర్వేషన్ల అమలు–ఎస్సీ కార్పొరేషన్ ద్వారా యువతకు రుణాలు–పున్నయ్య కమీషన్ సిఫార్సుల అమలుకు గ్యారెంటీ–దళిత పేటలకు స్మశాన భూముల కేటాయింపు–అసైన్డ్ భూములకు రక్షణ–దళితులకు రక్షణ, దాడులకు పాల్పడ్డ వారిపై కఠినచర్యలు–ప్రతి జిల్లాలో ప్రత్యేక న్యాయస్థానం. – మాన్యువల్ స్కావెంజింగ్ నిషేధం – ఆధునిక పరికరాల కల్పన.

### గిరిజన సంక్షేమం

(15)అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేసి గిరిజనులకు భూమిపై హక్కు కల్పించడం.

(16)గిరిజన జిల్లాల ఏర్పాటు, నాన్ షెడ్యూల్డ్ గ్రామాలను 5వ షెడ్యూల్‌లో చేర్చడం, పునరావాస గ్రామాలకు 5వ షెడ్యూల్ అమలు, గిరిజన యూనివర్శిటీ, 1/70 పటిష్టంగా అమలు.

### చేతి వృత్తులకు రక్షణ

(17)వృత్తిదారులకు ప్రత్యేక నిధులు. సహకార సంఘాల ద్వారా కష్టపడి వృత్తి చేసుకునే కుటుంబాలకు సహాయం. ప్రజాస్వామిక పద్ధతిలో ఎన్నికలు జరిపి వారి సంఘాలకు అధికారాలు కల్పించడం.

(18)చేతి వృత్తులకు రక్షణ చర్యలు–50 ఏళ్లు దాటినచేతివృత్తిదారులకు పెన్షను–వృత్తుల ఆధునీకరణకు సబ్సిడీ రుణాలు –బిసీలకు సబ్‌ప్లాన్. గొర్రెల, మేకల పెంపకం దార్ల సొసైటీలకు 5 ఎకరాల భూమి. మత్స్యకార నిర్వాసితులకు ఉపాధి, డీజిల్ సబ్సిడీ, వేట నిషేధ భృతి, రజక దోభీఘాట్ల నిర్మాణం, చేనేత, గీత, రజక, క్షౌర తదితర వృత్తిదార్లకు రక్షణ చట్టం.

### విభిన్న ప్రతిభావంతులు

(19)వికలాంగులకు ప్రత్యేక చట్టం. వారి నెల వారీ భృతి పెంచడం. గౌరవ ప్రదమైన జీవితాన్ని అందించడం.

### మహిళా హక్కులు

(20)మహిళల రక్షణకు ప్రత్యేక యంత్రాంగం–అత్యాచారాల కేసుల్లో సత్వర విచారణ, వెనువెంటనే శిక్షల అమలు,మహిళా సాధికారత.

(21) చట్టసభలలో మహిళలకు రిజర్వేషన్లు.

(22)మద్య నియంత్రణ, మున్సిపల్ వార్డు/ పంచాయతీ ఆమోదిస్తేనే షాపులకు అనుమతి.

### బాలల హక్కులు

(23)బాలల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చట్టం – విధులు – నిధులు. అనాధ బాలలకు ప్రత్యేక రక్షణ.

### మైనారిటీలకు రక్షణ

(24)మైనారిటీలకు రక్షణ, మతసామరస్యాన్ని కాపాడటం, సంక్షేమకార్యక్రమాలు, రిజర్వేషన్ల అమలు.

(25)దళిత క్రిష్టియన్లను ఎస్సీ జాబితాలో చేర్చడం.

(26)సచార్ కమిటీ సిఫార్సుల అమలు – వక్ఫ్ భూములకు రక్షణ – ఉర్దూ టీచర్ పోస్టుల భర్తీ.

### సంక్షేమ కార్యక్రమాల అమలు

(27)అర్హులైన అన్ని రకాల పెన్షన్ దారులకు నెలకు రు.3000 పెన్షన్– ప్రతి కుటుంబానికి రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ, అందరికీ రేషన్ కార్డులు, ఆహార భద్రత చట్టం అమలు–

(28)పేదలందరికీ ఉచితంగా పక్కా ఇళ్ళు– కులాంతర వివాహం చేసుకున్న దంపతులకు రెండు లక్షలు–పుట్టిన ప్రతి బాలికకూ లక్ష డిపాజిట్. ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి, పెన్షన్. పట్టణాల్లో అనాధ బాలలు, వృద్ధులు, మహిళ

లకు పునరావాసం – పేదలందరికీ సబ్సిడీపై చౌకగా ఆహారం, వసతి.

**ధరల నియంత్రణ**

(29)ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలి. జీవితావసర కనీస సరుకుల్ని చౌక ధరలకు అమ్మాలి.

(30)పెట్రో ఉత్పత్తులపై పన్ను తగ్గించి తక్కువ ధరకు అమ్మాలి.

**యువతకు ఉపాధి**

(31)ప్రభుత్వ ఉద్యోగాలలో ఖాళీల భర్తీ, పక్కాగా రోస్టర్ అమలు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, ప్రైవేటు పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు.

(32) నెలకు రూ.5000/–లు నిరుద్యోగ భృతి.

(33)ఐటి వంటి ఆధునిక పరిశ్రమల విస్తరణకు కృషి – శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాష్ట్రం ముందంజ వేయడానికి ప్రత్యేక ప్రణాళిక–శాస్త్రవేత్తలకు ప్రోత్సాహం.

**ప్రభుత్వరంగంలో విద్య, అధిక నిధులు**

(34)విద్యాహక్కు చట్టాన్ని సంపూర్ణంగా అమలు చేయడం – అందరికీ అందుబాటులో నాణ్యమైన విద్య. కార్పొరేట్ విద్యా సంస్థల నియంత్రణ, ఫీజుల నియంత్రణ, ప్రయివేటు టీచర్లకు కనీస వేతనాలు.

(35)ప్రభుత్వ విద్యకు 25% బడ్జెట్, ప్రభుత్వ యూనివర్శిటీలకు నిధులు–స్వయం ప్రతిపత్తి, ప్రభుత్వ విద్యా ప్రమాణాల మెరుగుదల, విద్యా సంస్థలలో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు.

(36)మాతృభాషలో విద్యా బోధన, తెలుగుభాష పరిరక్షణ, ప్రాచీన భాషగా గుర్తింపుకు చర్యలు.

**ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం**

(37)కార్పొరేట్ వైద్య సంస్థల నియంత్రణ, ప్రభుత్వ వైద్య సంస్థల సేవలను మెరుగు పర్చడానికి ప్రత్యేక బడ్జెట్.

(38)అంటువ్యాధుల నిర్మూలన, పేదలకు మెరుగైన ఉచిత వైద్యం, ఆదివాసీ, వెనుకబడిన ప్రాంతాల్లో ప్రత్యేక సౌకర్యాలతో కూడిన ఆసుపత్రుల నిర్మాణం.

**అందరికీ ఉచితంగా మంచినీరు ఒక హక్కు**

(39) ప్రతి ఇంటికీ ఉచితంగా రక్షిత త్రాగునీరు – మంచినీటి వ్యాపారంపై నియంత్రణ – భూగర్భ జలాల సంరక్షణ – నీటి కుంటలపై ప్రజలకు హక్కు.

**వికేంద్రీకరణ**

(40)వికేంద్రీకరణ అంటే పరిపాలనలో ప్రజల భాగస్వామ్యం పెంచడం. స్థానిక సంస్థలకు అధికారాలు పెంచడం–ప్రణాళికా నిధుల్లో సగం స్థానిక సంస్థలకు కేటాయించడం. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడం, వెనుకబడిన ప్రాంతాలకు, వర్గాలకు, తరగతులకు నిధుల కేటాయింపులో ప్రాధాన్యత నివ్వడం.

> **"చేతి వృత్తులకు రక్షణ చర్యలు-50 ఏళ్లు దాటినచేతివృత్తిదారులకు పెన్షను-వృత్తుల ఆధునీకరణకు సబ్సిడీ రుణాలు -బిసీలకు సబ్‌ప్లాన్. గొర్రెల, మేకల పెంపకం దార్ల సొసైటీ లకు 5 ఎకరాల భూమి. మత్స్యకార నిర్వాసి తులకు ఉపాధి, డీజిల్ సబ్సిడీ, వేట నిషేధ భృతి, రజక దోభీఘాట్ల నిర్మాణం, చేనేత, గీత, రజక, క్షౌర తదితర వృత్తిదార్లకు రక్షణ చట్టం."**




గుంటూరు ప్రభుత్వ వైద్యశాల

**అవినీతి నిర్మూలన – సుపరిపాలన**

(41)అవినీతి రహితంగా ప్రభుత్వ పాలన, పారదర్శకంగా నిర్ణయాలు, పంచాయతీలకు మున్సిపాలిటీలకు నిధులు, నిధులు– అభివృద్ధి వికేంద్రీకరణ ప్రణాళికలు.

– రాజకీయ అవినీతికి అంతం – ఎన్నికల్లో డబ్బు పంపిణీ అరికట్టడం.

– నియమిత కాలంలో పౌరుల ఫిర్యాదులకు సత్వర పరిష్కారం.

**ఎన్నికల సంస్కరణలు**

(42)నేటి ఎన్నికల వ్యవస్థ వ్యాపార రంగంగా మారింది. రాజకీయ వ్యవస్థ భ్రష్టు పట్టడంపై యువత ఆగ్రహంతో ఉంది. మధ్య తరగతి నిస్పృహతో ఉంది. ప్రతి ఒక్కరూ రాజకీయ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలి. అందుకు అనువైన ప్రజాస్వామిక వాతావరణం ఉండాలి. దానికి ఎన్నికల సంస్కరణలు తప్పనిసరి. ఎన్నికల్లో డబ్బు ప్రభావాన్ని లేకుండా చేయాలి.

(43)పాక్షిక లిస్టుతో కూడిన దామాషా ఎన్నికల విధానం అమలు చేయాలి. అన్ని రాజకీయ పార్టీలు ప్రజలకు బాధ్యత వహించాలి. చేసిన వాగ్దానాలు అమలు చేసేందుకు ప్రత్యేక చట్టం తేవాలి.

(44)ఎన్నికల వ్యయాన్ని ప్రభుత్వమే భరించాలి. అభ్యర్థులు కానీ, పార్టీలు కానీ ఖర్చు పెట్టకుండా నిషేధం విధించాలి. రాజకీయ పార్టీలకు కార్పొరేట్ నిధులు ఇవ్వకుండా నిషేధించాలి.

**అందరికీ అందుబాటులో న్యాయం**

(45)హైకోర్టును రాష్ట్రానికి తరలించడం.

(46) యువన్యాయవాదులకు ప్రోత్సాహం.

(47)పారదర్శకతతో న్యాయమూర్తుల నియామకం, రిజర్వేషన్ల అమలు.

**ప్రజాస్వామిక సంస్కృతిని పెంపొందించడం**

(48)ప్రజాస్వామ్య లౌకిక సంస్కృతి పరిరక్షణ–శాస్త్రీయ భావాల వ్యాప్తి, మూఢ నమ్మకాలకు, అంధ విశ్వాసాలకు, దురాచారా లకు, పురుషాధిక్యతకు వ్యతిరేకంగా చర్యలు.

(49)ప్రజానురంజకంగా, ప్రజా సంస్కృతిని ప్రోత్సహించేవిధంగా, ప్రజల హక్కులను సాధించుకునే సాధనంగా మీడియా.

(50)జానపద, వృద్ధ కళాకారులకు గౌరవభృతి.

(51)రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధికి కృషి.

**ప్రజల ఆవాసాలుగా పట్టణాలు**

(52)స్మార్ట్‌సిటీల పేరుతో పట్టణాల్లో బడా కార్పొరేట్లకు ప్రత్యేక సౌకర్యాలు ప్రజలపై పన్నుల భారాలు మోపే విధానాలు రద్దు. స్థానిక ప్రభుత్వాలకు నిధులకోతతో క్షేత్రస్థాయి ప్రజాస్వామ్యం మృగ్యమవు తోంది. పట్టణాల్లో పౌర సదుపాయాలు ప్రజలందరికీ దక్కాలి. అదనపు భారాలు వేయ కూడదు. ఇళ్ళు, ఇళ్ళ స్థలాల సమస్యల్ని విధిగా నిర్దిష్ట గడువులో పూర్తిచేయాలి. కాలుష్యాన్ని నివారించాలి. ప్రజా రవాణాను అభివృద్ధి చేయా లి. సంఘ వ్యతిరేక శక్తులకు పట్టణాలు నిలయా లుగా మారకుండా చూడాలి. చిట్టీలు, ఫైనాన్సు వ్యాపారాల్లో జరుగు

(మిగతా 34వ పేజీలో)

# మన వ్యవసాయం ఏం కానుంది?

ఎంవిఎస్ శర్మ



రచయిత
ప్రజాశక్తి సంపాదకులు

మన ప్రభుత్వాలు ప్రస్తుతం అమలు చేస్తున్న ఉదారవాద విధానాలే 2050 వరకూ కొనసాగితే మనదేశంలో కొన్ని మెగాసిటీలు తయారవుతాయి. ఒక్కో మహానగరంలోను 3-4 కోట్లమంది జనాభా చేరుతారు. ప్రస్తుతం 80 కోట్ల గ్రామీణ ప్రజానీకంలో కేవలం 25-30 కోట్ల మంది మాత్రం గ్రామాలలో మిగులుతారు. గ్రామాలను వదిలి నగరాలకు వలస వచ్చిన కోట్లాదిమంది గ్రామీణ పేదలు అతి తక్కువ కూలీకి పనిచేయడం, లేదా అసలు పనులే దొరక్క నానా అగచాట్లు పడడం జరుగుతుంది.

ఇంగ్లండ్‌లో పారిశ్రామిక విప్లవం మొదలైన తొలినాళ్లలో గ్రామాలను వదిలిపెట్టి పట్టణాలలో ఫ్యాక్టరీ పనులకు పోవడానికి రైతాంగం సుముఖంగా లేరు. తమకు అలవాటైన ప్రశాంత గ్రామీణ జీవితాన్ని వదిలి చాలీచాలని వేతనాలతో ఇరుకైన పట్టణ జీవితానికి మారడానికి వారు వ్యతిరేకం. వారిని బలవంతంగా భూముల నుంచి, గ్రామాల నుంచి వేరు చేసి పట్టణాలకు గెంటివేయడానికి పెట్టుబడిదారులు అనేక నిర్బంధ చట్టాలను రూపొందించి వాటిని కర్కశంగా అమలుచేశారు.

ప్రస్తుతం భారతదేశానికి వస్తే ఇక్కడ పాలకులు విదేశీ పెట్టుబడికి ఎర్రతివాచీ పరిచి స్వాగతం పలుకుతూ వారి కోసం ఇక్కడ వ్యవసాయాన్ని పూర్తిగా దెబ్బతీసే విధానాలు అమలు చేస్తున్నారు. ఒకవైపు వ్యవసాయం గిట్టుబాటు గాక రైతులు అగచాట్లు పడుతూ ఉంటే మరోవైపు ప్రభుత్వాలు అత్యంత ఆధునిక విమానాశ్రయాలు, రహదారులు, ఐ.టి పార్కుల కోసం వ్యవసాయ భూములను లాక్కుంటున్నారు. ప్రభుత్వం తీసుకునే ప్రతీచర్య కార్పొరేట్ల లాభాలను పెంచడం కోసమే తోడ్పడుతుంది తప్ప వేరొకటి కాదు.

స్థూల జాతీయోత్పత్తి-జి.డి.పి- అనేది అభివృద్ధికి అతి పవిత్రమైన కొలబద్ధగా మారిపోయింది. జిడిపి పెరుగుతూ ఉంటే చాలు అది అభివృద్ధికి సంకేతమేనంటున్నారు పాలకులు. ఇంకోపక్క కోట్లాది రైతాంగం పేదరికంలో కునారిల్లుతున్నా వారికేమీ పట్టదు. గ్రామీణ పేదలకు, తక్కిన ప్రజానీకానికి మధ్య ఆదాయాల వ్యత్యాసం విపరీతంగా పెరిగిపోతున్నది. 40 సంవత్సరాల క్రితం సగటున గ్రామీణరైతు సాలుకు194 కిలోల ఆహారధాన్యాలు వినియోగిస్తే ఇప్పుడు ఆ వినియోగం 130 కిలోలకు పడిపోయింది.

మరోవైపు అతితక్కువ వడ్డీకే కార్పొరేట్లు కోట్ల ధనాన్ని అప్పుగా పొందుతూ, పన్ను రాయితీలను, సబ్సిడీలను భారీగా అనుభవిస్తూ తమ సంపదను పెంచుకుంటున్నారు. వారికి ఎంత దోచిపెట్టినా కొత్తగా ఉద్యోగవకాశాలు పెరగటం లేదు. కోట్లాదిమందికి ఉపాధి కల్పించే వ్యవసాయరంగానికి రుణమాఫీ చేయమంటే మాత్రం అది ఆర్థికవ్యవస్థను డొల్ల చేసేస్తుందని గగ్గోలు పెడతారు.

పంటల దిగుబడి పెరుగుతున్నా రైతులు దివాలా తీయడం మనం చూస్తున్నాం. పెట్టుబడులకు అవసరమైన తోడ్పాటు వీరికి లభించడం లేదు. పెట్టిన పెట్టుబడికి గిట్టుబాటు ఏ విధంగా వస్తుందన్న గ్యారంటీ లేదు. మద్దతు ధర గ్యారంటీ లేదు. పైగా దేశీయ ఆహారోత్పత్తులకు పోటీగా, విదేశాల నుంచి చవుకగా దిగుమతులను ప్రభుత్వమే అనుమతిస్తోంది. ఇంకోపక్క విదేశీ గుత్తకంపెనీల గుప్పెట్లో విత్తనాల మార్కెట్ ఇరుక్కుపోయింది. ఇండో – అమెరికన్ నాలెడ్జ్ ఇనిషియేటివ్ పేర వ్యవసాయంలో కార్పొరేట్ల పట్టు పెరగడానికి ప్రభుత్వమే దారి సుగమం చేసింది.

పెద్దసంఖ్యలో వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్న చిన్న మధ్యతరహా రైతులను తొలగించాలనే కుట్ర నేడు మన కళ్లముందే జరుగుతోంది. భూమిలో నాటే విత్తునుంచి కంచంలో పెట్టుకునే అన్నం మెతుకు దాకా ఆహారధాన్యాల ఉత్పత్తి, మార్కెటింగ్ వ్యవస్థను మొత్తంగా శాసించే బహుళజాతి కంపెనీల చేతుల్లోకి మన వ్యవసాయం పోయి ఇరుక్కునే ప్రమాదం దాపురించింది. ఇందుకోసమే రైతులను దివాలా తీయిస్తున్నారు. భారీస్థాయి వ్యవసాయ పరిశ్రమలను నెలకొల్పాలన్న సాకుతో వారిని భూముల నుండి బేదఖల్ చేయటం పాలకుల ఎజెండా. ఇంకా ఎవరన్నా రైతులు వ్యక్తులుగా నిలబడితే వారిని భారీ కార్పొరేట్ వ్యవసాయ ప్రక్రియలో కాంట్రాక్టు వ్యవసాయదారులుగా మార్చివేస్తారు. ఏం పండించాలో, ఎంతకు అమ్మాలో- ఏదీ ఆ రైతు చేతుల్లో ఉండదు. అంతా కార్పొరేట్ వ్యవసాయ పరిశ్రమాధిపతులో, చిల్లర వ్యాపారాన్ని శాసించే కార్పొరేట్లో నిర్ణయిస్తారు.

ఇదంతా స్వేచ్ఛామార్కెట్ విధానం అని, పోటీలో నిలదొక్కుకునే వారిదే భవిష్యత్తు అని కొందరు ప్రచారంచేస్తున్నారు. ఇది సమాన ప్రాతిపదికన జరిగే పోటీ ఎంత మాత్రమూ కాదు. ఇక్కడ భారతదేశంలో రైతుకు ఏరూపంలో సబ్సిడీ ఇచ్చినా అది తప్పుడు విధానం అని గగ్గోలు పెట్టే 'మేధావులు' అమెరికాలో ఏటా రైతులకు 50 వేల కోట్ల డాలర్ల సబ్సిడీని అక్కడ ప్రభుత్వం ఇస్తోందన్న వాస్తవాన్ని మాత్రం మరుగు పరుస్తారు.

25 కోట్ల జనాభా ఉన్న అమెరికాలో వ్యవసాయం మీద ఆధారపడేవారు 4 శాతం అంటే, ఒకకోటిమంది. వారికందే సబ్సిడీ లెక్కవేస్తే మనకరెన్సీలో ఒక్కో ఎకరానికి 4లక్షల రూపాయలు. అటువంటి రైతుతో మన బక్కరైతులు పోటీ పడాలనడం ఎంత దుర్మార్గమైన వాదన!

“మా ప్రభుత్వం వ్యవసాయ పరిశ్రమకు ఇచ్చే ఈ సబ్సిడీని నిలిపివేసి, వ్యక్తులుగా వ్యవసాయ కమతాలు నడుపుతున్న చిన్నరైతులకు, పశుపెంపకందారులకు, సహజ, సేంద్రీయ ఎరువులను ఉపయోగించి వ్యవసాయం చేసే వారికి ప్రోత్సాహం ఇస్తే అటు పర్యావరణము జీవవైవిధ్యమూ పరిరక్షించబడతాయి. ఇటు

ఆహార ఉత్పత్తుల నాణ్యత పెరుగుతుంది" అని ఆర్గానిక్ ఉత్పత్తుల వినియోగదారుల సంక్షేమ సంఘం నాయకుడు రోనీ కమ్మన్స్ అన్నారు.

1997 నుండి ఇప్పటిదాకా 3 లక్షల మందికి పైగా రైతులు భారతదేశంలో ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇంకా కోట్లాదిమంది దరిద్రంలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రతిరోజూ సగటున 6,000 మంది వ్యవసాయాన్ని వదిలిపెట్టిపోతున్నారు. ఇది చాలాదన్నట్టు కార్పొరేట్ల వత్తిడితో నడిచే వ్యవసాయంలో ఉపయోగించే రసాయన ఎరువులు, పురుగు మందుల వలన భూసారం క్షీణించిపోతుంది. పంటల్లో వైవిధ్యం తగ్గిపోతుంది. పోషక పదార్థాలు మృగ్యమైపోతున్న తిండి గింజలు ఉత్పత్తి అవుతున్నాయి. నీటికాలుష్యం పెరిగింది. నీటికొరత పెరుగుతోంది. ఆరోగ్యాలు క్షీణిస్తున్నాయి. ఇలా అన్నివైపులా దిగజారుతున్న వ్యవసాయాన్ని పరిరక్షించడానికి, చిన్న కమతాలను కాపాడి, వైవిధ్యభరితంగా, భూసార రక్షణను గ్యారంటీ చేసే ప్రత్యామ్నాయ విధానాలు నేటి తక్షణ అవసరం. కాని ప్రభుత్వం దీనికి పూర్తి వ్యతిరేక దిశలో నడుస్తోంది. కార్పొరేట్ వ్యవసాయానికీ బాటలు వేస్తోంది. మోన్‌శాంటో, కార్గిల్, బేయర్, వాల్‌మార్ట్ వంటి విదేశీ కంపెనీలకు మన దేశ వ్యవసాయాన్ని ఎరగా వేస్తోంది.

దీని పర్యవసానంగా గ్రామాల్ని వదిలిపెట్టి పట్టణాలకు వలసపోయేవారి సంఖ్య ఇంకా పెరుగుతుంది. మోడీ గారి 'మేకిన్ ఇండియా'కు పనికొచ్చే చౌక కార్మికులు ఇక్కడికి వచ్చే విదేశీ కంపెనీలకు పుష్కలంగా దొరకుతారు. ఐతే ఇటువంటి చౌకబారు పనులైనా ఎందరికి దొరకుతాయనేది ప్రశ్నార్థకమే. ఉపాధిరహిత అభివృద్ధి మనచుట్టూ సాగుతోందన్నది విస్మరించలేము.

కార్పొరేట్లు ప్రవేశపెడుతున్న కొత్తకొత్త టెక్నాలజీలు, ఆటోమేషన్ ఇప్పుడు ఉన్న ఉద్యోగాలను సైతం దిగమింగేస్తున్నాయి.

మన పాలకులు అమెరికా, ఫ్రాన్స్ ఇంగ్లండ్ తదితర దేశాల తరహాలోనే మనదేశాన్ని కూడా అభివృద్ధి చేసేస్తాం అని ప్రచారం చేస్తూ ఉంటారు. కాని ఆయా పశ్చిమదేశాలు అన్నీ సామ్రాజ్యవాద దోపిడి ద్వారా, వలస విధానం ద్వారా మూడో ప్రపంచదేశాలను కొల్లగొట్టి అభివృద్ధిచెందాయి. ఈ వాస్తవం మన పాలకుల కళ్లకు కనపడటం లేదా? ప్రభుత్వాలు మోకాళ్లమీద సాగిలపడి మరీ స్వాగతిస్తున్న విదేశీ బహుళజాతి కంపెనీలు మనదేశం మీద ప్రేమకొద్దీ వస్తున్నాయని, వాటికి ఈ దేశాన్ని

"సమతుల్యత లోపించిన, కలుషితమైన ఆహారం కారణంగా రోగాలబారిన పడే ప్రజానీకం సంఖ్య శరవేగంగా పెరుగుతోంది. బహుళ జాతి కంపెనీలు మార్కెట్లోకి తెచ్చే ప్రాసెస్డ్ ఫుడ్స్‌లో విషపూరిత రసాయనాలు పుష్కలంగా ఉన్నాయి. మోన్‌శాంటో, బేయర్, కార్గిల్, వాల్‌మార్ట్ వంటి సంస్థలు మన దేశంలో ప్రజలు ఏం తినాలో, ఆ పదార్థాలను ఎలా తయారు చేయాలో కూడా శాసించనున్నాయి."



పట్టణాలకు వలసపోతున్న రైతులు, కూలీలు

కొల్లగొట్టే ఆలోచనే లేదని, సామ్రాజ్యవాద దోపిడీ స్వభావం సొంతం మారిపోయిందని మన పాలకరాజకీయ పక్షాలు భావిస్తున్నాయా? "విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి" "వ్యాపార సౌలభ్యం" (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్), " బిజినెస్ ఫ్రెండ్లీ ఇండియా" "వ్యవసాయాన్ని లాభసాటి వ్యాపారంగా అభివృద్ధి చేయడం" వంటి నినాదాల వెనక నయా ఉదారవాద ప్రపంచీకరణ కుట్ర దాగుందన్న వాస్తవాన్ని పాలకులు గ్రహించడం లేదా? లేక కావాలనే ప్రజలను మభ్యపెడుతున్నారా?

నాలుగువందల సంవత్సరాల క్రితం ఇంగ్లండులో రైతులను పొలాల నుండి క్రూరాతిక్రూరంగా తరిమివేసిన విధానమే నేడు మనదేశంలో కార్పొరేట్ వ్యవసాయం పేరుతో అమలు చేయాలని ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి ప్రయత్నిస్తున్నాయి. ఒకప్పుడు మనదేశాన్ని కొల్లగొట్టడానికి ఈస్ట్ఇండియా కంపెనీ వంటి విదేశీ కంపెనీ అవసరం అయింది. కాని నేడు స్వదేశీ పాలకులే సామ్రాజ్యవాద దోపిడీని సులభతరం చేయడానికి ఉత్సాహంగా ఉరకలు వేస్తున్నారు! రసాయనాలతో నానిపోయిన భూములు, వైవిధ్యంలేని పంటలు, ప్రాణహాని కలిగించే పురుగు మందులు, దిగజారే పర్యావరణం, ఇదే భవిష్య భారత దేశ వ్యవసాయ దృశ్యంగా రూపొందనుందా?

ఇప్పుడు ముందుకు తెస్తున్న వ్యవసాయాభివృద్ధి (!) నమూనా గనుక కొనసాగితే మనదేశంలో మరిన్ని కరువు పీడిత ప్రాంతాలు తయారవుతాయి. సారరహిత భూములు అతిపెద్ద సవాలుగా రానున్న కాలంలో ముందుకు రాబోతోంది.

సమతుల్యత లోపించిన, కలుషితమైన ఆహారం కారణంగా రోగాలబారిన పడే ప్రజానీకం సంఖ్య శరవేగంగా పెరుగుతోంది. బహుళ జాతి కంపెనీలు మార్కెట్లోకి తెచ్చే ప్రాసెస్డ్ ఫుడ్స్‌లో విషపూరిత రసాయనాలు పుష్కలంగా ఉన్నాయి. మోన్‌శాంటో, బేయర్, కార్గిల్, వాల్‌మార్ట్ వంటి సంస్థలు మనదేశంలో ప్రజలు ఏం తినాలో, ఆ పదార్థాలను ఎలా తయారు చేయాలో కూడా శాసించనున్నాయి.

### ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం

పైన వివరించిన పరిణామక్రమం ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం (రీజినల్ కాంప్రెహెన్సివ్ ఎకనామిక్ పార్టనర్‌షిప్) ఆర్.సి.ఇ.పి తో మరింత వేగవంతం కానుంది. ఆసియా– పసిఫిక్ ప్రాంతంలోని 16 దేశాల మధ్య ప్రస్తుతం చర్చించబడుతున్న వ్యాపార ఒడంబడిక ఈ ఆర్.సి.ఇ.పి. ఇది ప్రపంచ జనాభాలో సగభాగానికి వర్తిస్తుంది. దీని ప్రభావం ఆహారోత్పత్తి చేసే 42 కోట్ల మంది చిన్న, మధ్యతరహా రైతులపై ఉంటుంది. ఈ

**"ఆర్.సి.ఇ.పి ఈ దేశంలో చిల్లర వ్యాపారాన్ని కూడా వదిలిపెట్టడం లేదు. రిటైల్ రంగంలోకి బహుళజాతి కంపెనీల ప్రదేశాన్ని అనుమతించి కోట్లాదిమంది చిన్న చిల్లర వర్తకులను నిరాశ్రయుల్ని చేయనుంది. ఈ విదేశీ కంపెనీలు దేశంలోని ఆహారధాన్యాల మార్కెట్‌ను అతితక్కువ కాలంలోనే తమ గుప్పెట్లోకి తెచ్చుకుంటారు. ఆ తర్వాత వ్యవసాయ ఉత్పత్తుల ధరలను, మార్కెట్‌ను వాళ్లే శాసిస్తారు."**

ప్రాంతంలో ఉత్పత్తయ్యే పంటలలో 80 శాతం వీరే పండిస్తున్నారు ప్రస్తుతం.

ఆర్.సి.ఇ.పి ఆహారం, వ్యవసాయం – ఈ రెండు రంగాలలో చొరబడే అవకాశాలను కార్పొరేట్ సంస్థలకు కల్పించే లక్ష్యంతో మొదలైంది. వ్యాపారాన్ని అభివృద్ధిచేయడానికి పెట్టుబడులను ప్రోత్సహించడానికి ఇది ఏర్పడిందని పైకి చెపుతున్నారు. విదేశీ కంపెనీలు భూములను కొనుగోలు చేయడానికి ఇది వీలు కల్పిస్తుంది. దాంతో భూముల ధరలు పెరిగి స్పెక్యులేషన్ తారాస్థాయికి చేరుతుంది. పర్యవసానంగా చిన్నరైతులు భూముల నుండి గెంటివేయబడతారు. ప్రస్తుతం దేశంలో పెద్దఎత్తున జరుగుతున్న భూకబ్జా (ప్రభుత్వాలు దీనినే భూసేకరణ అనో, ల్యాండ్‌ఫూలింగ్ అనో ముద్దుగా అభివర్ణిస్తాయి) మితిమీరుతోంది. ఇంకో పక్క విత్తనాల మార్కెట్‌పై కార్పొరేట్ కంపెనీల గుత్తాధిపత్యం మరింత బలపడుతుంది.

మనదేశ డెయిరీ మార్కెట్ విదేశీ సంస్థల నుండి ఎదుర్కొనే పోటీ ఆర్‌సిఇపి వలన మరింత ప్రతికూలంగా మారుతుంది. ఆయా దేశాలు అందించే సబ్సిడీలతో చౌకగా విదేశాల నుండి దిగుమతి చేసుకునే డెయిరీ ఉత్పత్తులతో పోటీ మన స్వదేశీ డెయిరీల పాలిటి మరణ శాసనం కానుంది. ప్రస్తుతం మనదేశంలో డెయిరీ వ్యాపారం లక్షలాది మంది పాల రైతులతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉండి జనసత్వాలతో ముందుకు సాగుతోంది. "స్వేచ్ఛా వ్యాపారం" ముసుగులో విదేశీ కంపెనీలకు గనుక అవకాశమిస్తే అభివృద్ధి దిశగా ముందుకు పోతున్న మన స్వదేశీ డెయిరీ రంగం వినాశనం వైపు తిరోగమిస్తుందని ఆర్.ఎస్. సోధీ అన్నారు. దేశంలోని అతిపెద్ద సహకార పాల డెయిరీ గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా సోధీ ఉన్నారు.

ప్రభుత్వం నుండి ఎటువంటి సహాయమూ లేకుండానే మనదేశంలో డెయిరీ రంగం ద్వారా ఉపాధి పొందుతున్న వారిలో మహిళలే అధికశాతం ఉన్నారు. చిన్న, మధ్యతరహా రైతులకు, కౌలురైతులకు ఈ రంగం ప్రాణాధారంగా ప్రస్తుతం ఉంది. వ్యవసాయంలో వస్తున్న లోటును కొంతవరకైనా పూడ్చుకుని నిలబడడానికి ఇది కీలకంగా ఉంది. భారతదేశ డెయిరీ రంగంపై ఇప్పుడు ఫాంటెర్రా అనే బడా కంపెనీ కన్నుపడింది. ఫాంటెర్రా న్యూజిలాండ్ దేశంలో ఉన్న కంపెనీ. ఇది ప్రపంచంలోకెల్లా అతిపెద్ద డెయిరీ. ఆర్.సి.ఇ.పి ద్వారా భారతదేశ డెయిరీ మార్కెట్‌లోకి ప్రవేశించడానికి ఇది రంగం సిద్ధం చేసుకుంటోంది. ఒకసారి ఫాంటెర్రా అడుగు పెడితే మనరైతులు ఆ కంపెనీకి ఊడిగమైనా చేయాలి. లేదా పాల వ్యాపారానైనా వదిలిపెట్టి పోవాలి.

ఆర్.సి.ఇ.పి ప్రస్తుతం మనదేశంలో జరుగుతున్న వినాశకర వ్యవసాయ విధానాన్నే వేగంగా విస్తరింపజేయడానికి వత్తిడి పెంచుతుంది. మనరైతులు కార్పొరేట్ వ్యవసాయానికి ఊడిగం చేసే బానిసలుగా మిగిలిపోవడమో, లేక భూముల్ని వదిలిపెట్టి వలసపోవడమో తప్ప మార్గాంతరం ఉండదు.

ఆర్.సి.ఇ.పి ఈ దేశంలో చిల్లర వ్యాపారాన్ని కూడా వదిలిపెట్టడం లేదు. రిటైల్ రంగంలోకి బహుళజాతి కంపెనీల ప్రదేశాన్ని అనుమతించి కోట్లాదిమంది చిన్న చిల్లర వర్తకులను నిరాశ్రయుల్ని చేయనుంది. ఈ విదేశీ కంపెనీలు దేశంలోని ఆహారధాన్యాల మార్కెట్‌ను అతితక్కువ కాలంలోనే తమ గుప్పెట్లోకి తెచ్చుకుంటారు. ఆ తర్వాత వ్యవసాయ ఉత్పత్తుల ధరలను, మార్కెట్‌ను వాళ్లే శాసిస్తారు. ఎక్కడైనా చిన్న, మధ్య రైతులు నిలదొక్కుకుని కార్పొరేట్ వ్యవసాయానికి ఎదురొడ్డి నిలిచినా, వాళ్లు ఈ విదేశీ రిటైల్ వ్యాపార సంస్థల బారి నుండి తప్పించుకోలేని పరిస్థితి వస్తుంది.

కోట్లాదిమంది ఉపాధి ఆర్‌సిఇడి వలన హరించుకుపోనున్నది. ఆహార స్వావలంబన, జీవవైవిధ్యం, ఆహారభద్రత, ప్రజల ఆరోగ్యం– అన్నీ దెబ్బతింటాయి. ఈ విధంగా భారీ సంఖ్యలో ఉపాధి పోగొట్టుకున్న ప్రజలకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించగలిగే పరిస్థితి ప్రస్తుతం భారతదేశంలో లేదు.

ఎంతో దూరదృష్టితో విధాన రూపకర్తలు రూపొందించిన స్వావలంబన, ఆహారభద్రత, చిన్న ఉత్పత్తి దారులపై ఆధారపడిన వ్యవసాయం, పర్యావరణరక్షణ, స్వయం పునరుత్పత్తి సామర్థ్యం వంటి మంచి సూత్రాలను విడిచిపెట్టి ఈ వినాశకర విధానాలను ఎందుకు అమలు చేయనిచ్చారని భవిష్యత్ తరాల ప్రజలు మనని తప్పకుండా ప్రశ్నిస్తారు.

గ్రామాలన్ని ఖాళీ అయిపోతూంటే– దానిని నివారించేందుకు గ్రామస్థాయి మౌలిక వసతుల కల్పనపై శ్రద్ధపెట్టకుండా నిర్లక్ష్యం చేశారెందుకు? ఇది కూడా మనకి ఎదురవబోయే మరో ప్రశ్న.

కేవలం వేళ్లమీద లెక్కించగలిగే కార్పొరేట్ల ప్రయోజనాల కోసం ఇన్ని కోట్ల మంది ప్రజల భవిష్యత్తును ఎందుకు పణంగా పెట్టారు? ఇది తప్పనిసరిగా మనకెదురయే మూడో ప్రశ్న.

ఇండియాకే కాదు, అసలు ప్రపంచంలో ఏ దేశానికైనా పరిశ్రమ తరహాలో భారీ, కేంద్రీకృత వైవిధ్యరహిత వ్యవసాయం విధానం అవసరమా? భారీ రసాయనాల, పురుగు మందుల కాలుష్యం అవసరమా? చేవచచ్చిన, కాలుష్యపూరితమైన, రోగకారకమైన ఆహారాన్ని ఉత్పత్తి చేసే విధానం అవసరమా?

మనదేశపు వ్యవసాయం ఎదుర్కొంటున్న సంక్షోభానికి పరిష్కారం ఉంది. గ్రామీణాభివృద్ధికి దోహదపడే, పర్యావరణ పరిరక్షణకు దోహదపడే వ్యవసాయ విధానం అమలు చేయాలి. కాని దేశాన్ని ఏలుతున్న ప్రభుత్వాలు, అవి కాంగ్రెస్ గాని, బిజెపిగాని, ఏదైనప్పటికీ, కార్పొరేట్లకే సేవచేసేపనిలో ఉన్నాయి. ఈ ప్రభుత్వాలకు మన వ్యవసాయాన్ని పరిరక్షించే ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానాన్ని చేపట్టే శక్తి, సత్తా లేదు. ఒకవేళ అటువంటి విధానాన్ని వీళ్లు చేపట్టడానికి పూనుకున్నారని వాదన కోసం అనుకున్నా, తీవ్ర అసమానతలతో ఉన్న మనదేశంలో ఆ ప్రత్యామ్నాయ విధానాన్ని కార్పొరేట్ సంస్థలు ముందుకు సాగనియ్యవు.

నయా ఉదారవాద విధానాలకు, సామ్రాజ్యవాద దోపిడీకి, కార్పొరేట్ల అంతులేని లాభాపేక్షకి వ్యతిరేకంగా నికరంగా నిలిచి పోరాడగలిగే ప్రత్యామ్నాయ రాజకీయ శక్తులు, వాటిని ముందుకు తేవడానికి ఉత్ప్రేరకంగా పనిచేసే ప్రజాఉద్యమాలు భారతదేశ వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారం చూపగలవు.

**(మంత్లీ రివ్యూ వ్యాసానికి స్వేచ్ఛానుసరణ)**

# భారతీయ సాంస్కృతిక వైవిధ్యం - సవాళ్ళు

తెలకపల్లి రవి



రచయిత ప్రముఖ రాజకీయ విశ్లేషకులు

భారతదేశంలో సాంస్కృతిక వైవిధ్యం – భిన్నత్వం – సవాళ్ళు. ఈ రెండూ కూడా అపారమైనవి. రెండూ కూడా చాలా విస్తృతమైనవి. వీటిల్లో ఏ ఒక్కదానికి మనం మాట్లాడుకోవాలన్నా చాలా చాలా సమయం పడుతుంది. భారతదేశంలో ఉన్న సాంస్కృతిక వైవిధ్యాన్ని, భిన్నత్వాన్ని చెప్పాలంటే వింధ్య హిమాచల గంగా యమునా ఉచ్చల జలధి తరంగ పంజాబ సింధు, గుజరాత, మరాఠ, ద్రావిడ ఉత్కళవంగ ఇన్ని భాషలున్న ఈ దేశానికి ఒక బెంగాలి గీతాన్ని జాతీయ గీతంగా పెట్టుకోవడంలోనే ఈ దేశం యొక్క సాంస్కృతిక ఔన్నత్యం, వైవిధ్యం కనపడుతుంది. అనుకోకుండా బెంగాలీ కవి వ్రాసిన గీతాన్నే బంగ్లాదేశ్‌కు కూడా జాతీయ గీతంగా పెట్టుకున్నారు. ప్రపంచంలో రెండు దేశాలకు జాతీయ గీతాన్ని రాసిన ఒకే ఒక కవి భారతదేశంలో ఉండటం కూడా యాదృచ్ఛికం కాదు. అందుకని భారతదేశం ఒక దేశం కాదు, ఒక ఉపఖండం అన్నారు. ఆ సేతుశీతాచలం అంటే అపారమైన వైవిధ్యానికిది నిలయం. సరే మన గల్లా జయదేవ్ గారికి సమస్యలేవీ పెద్దగా లేవు కాబట్టి ఆయనకు భరత్ – అను నేను డైలాగ్ చెప్తే సరిపోతుంది. అసలే ఆంధ్రప్రదేశ్ అవిశ్వాస పర్వంలో కొట్టుమిట్టాడుతూ వుంటే ఆయన ఏం చెప్తారా, ఎలా ప్రారంభిస్తారాహై ప్రొఫైల్డ్ కార్పొరేట్ ఇంగ్లీష్ లో ఎలా దంచి కొడతాడో అని మనందరం చూస్తుంటే భరత్ – అను నేను సినిమాలో బావమరిది చెప్పిన డైలాగ్ చెప్తే కాని ఆయనకు తృప్తి కలగలేదు. అంటే భారతదేశం యొక్క సాంస్కృతిక వైవిధ్యం ఇక్కడ కూడ కనిపిస్తుంది. రాజకీయాలు సినిమాలు అన్ని కలిసిపోయినటువంటి ఒకానొక విచిత్రమైన లేదా వికృత, విషాద సన్నివేశంలో మనం ఉన్నాము. భారతదేశమనేది భిన్నత్వంలో ఏకత్వంగా మనం చూస్తామా. ఏకత్వంలో భిన్నత్వం చూస్తామా అనేది ఇక్కడ ప్రశ్న. భిన్నత్వంలో ఏకత్వం అనే మాటకి ప్రాధాన్యత ఇచ్చేట్లయితే అన్నీ కలిసిపోయే దానికి మనం ప్రాధాన్యత ఇవ్వాలి. ఏకత్వంలో భిన్నత్వం అంటే అది ఇంకొకటి. నా దేశం భగవద్గీత నాదేశం అగ్ని పునీత సీత నా దేశం కరుణాంతరంగ నాదేశం తరంగరంగ గంగా అని నారాయణ రెడ్డిగారు అన్నారు. మనది భారతదేశమమ్మ, మనది భారతభూమి తల్లి, బాదరాయణ ఆది రుషులకు పాదుకొమ్మది చెల్లెలా అని ఇంకొ కాయన అన్నాడు. తక్షశిలా పాటలీపుత్రం హరప్పా, మొహంజదారో క్రోమాన్యాన్ గుహా ముఖాల్లో చారిత్రక విభాత సంధ్యల మానవ కథ వికాస మెట్టిదని ఒకాయన ప్రశ్నించాడు. సారెజహాసే అచ్ఛా, హిందూ సితా హమారా అని ఇక్బాల్ అన్నాడు. ఎందుకన్నాం మనం. ఆయనే అన్నట్టు తోటలో పూలలాగా ఈ దేశంలో రకరకాలైనటువంటి జీవ వైవిధ్యం, పర్యావరణ, మానవ, సాంస్కృతిక, సాంప్రదాయ వైవిధ్యాలు ఉన్నాయి. ఇంత వైవిధ్యం ఉన్న దేశం మరొకటి లేదు. ఇంకెక్కడా లేదు కాబట్టి మనది భారతదేశం అని సగర్వంగా చెప్పుకుంటున్నాం. ఈ దేశంలో – అరకు లోయలోకి వెళ్తే ఇప్పటికి కూడా ఆదివాసి సంస్కృతి మనకు కనిపిస్తుంది. ఆదివాసులలో వనవాసులనే వారి సంస్కృతి కూడా మనకు కనిపిస్తుంది. అక్కడ్నుంచి ఇక్కడకు వస్తే విశాఖపట్నంలో సెజ్‌ల సంస్కృతి కూడా మనకు కనిపిస్తుంది. కాబట్టి అపారమైన ఈ భారత పరంపరను ఒకే దేశం ఒకే ప్రజ, ఒకే మతం, ఒకే ఎన్నిక ఒకే పన్ను ఒకే పార్టీ, ఒకే మోడి అంటే ఎప్పటికీ కుదరదు.


మనది వేదభూమి. వేదాల్లో కూడా మూడు భాగాలున్నాయి కదా.వేదాల్లో సంహితలున్నాయి, అరణ్యకాలున్నాయి, కర్మ కాండుంది ఒక మంత్ర కాండ ఉంది. లోకం దైవాధీనం. దైవం మంత్రాధీనం, మంత్రం బ్రాహ్మణాధీనం బ్రాహ్మణా మమ దేవతాయహా! ఇది ఒక మంత్రం. ఇదేనా మన సంస్కృతి? ఒకే దేశం, ఒకే ప్రజ అనడంలో దానర్థం అదే. ఒకే మతం, ఒకే దేశం, ఒకే ప్రజ అంటే హిందువుగా జీవించు, హిందువుగా గర్వించు అంటున్నారు. గర్వించితే గర్వించు కాని పక్కవాడిని నిర్జించు అనడం ఎందుకు అనేది ప్రశ్న. మన సంస్కృతి గొప్పది, మన అభిమానం గొప్పది అనే దానితో ఆగకుండా ఎప్పుడైతే అభిమానం దురభిమానంగా మారుతుందో అది దుష్పరిణామాలకు దారి తీస్తుంది. అందుకని ఇక్కడి ప్రభుత్వాలు, పార్టీలు, సంస్థలు మాత్రమే కాకుండా మొత్తం భారతీయ పౌర సమాజం తన మూలాల గురించి, తన ఉనికిని గురించి ఆలోచించుకోవాల్సిన ఒక విపత్కర పరిస్థితికి మనం వచ్చాము. ఈ మధ్యన నాకో వీడియో పంపించారు. రోజు పొద్దున్నే చాగంటి కోటేశ్వరరావు గారు, గరికిపాటి నరసింహారావు గారు, చినజియ్యర్ స్వామి గారు చెబుతుంటారు. రాముడు మీద ఇంత దాడి జరుగుతుంటే వీరంతా ఎక్కడికి పోయారు అని వీడియోలో ప్రశ్నిస్తున్నారు. వాళ్ళను కూడా ఈ ఎలిమినేషన్ ప్రాసెస్ డామినేట్ చేస్తున్నది. ఈ ప్రాసెస్ మొదలైన తర్వాత ఒకచోట ఆగదు. అది మనమిప్పుడు చూస్తున్నాం. అందుకని ఛాలెంజెస్ అంటే అతి పెద్ద ఛాలెంజ్. అది ఒకరిద్దరు వ్యక్తులను మూక దాడుల్లో చంపటం కాదు. భారతీయ ప్రజాస్వామిక విలువలను ధ్వంసం చేయటం. భారత రాజ్యాంగ విలువలను ఊచకోత కోస్తున్నటువంటి సందర్భం. భారతీయ సంస్కృతి యొక్క మూలాలను సవాల్ చేస్తున్నటువంటి సమయం ఇది.

ఏమిటీ భారతదేశం యొక్క మూలాలు. గ్రీకు ప్రజాస్వామ్యం గురించి అందరూ చెప్తుంటారు. కాని గ్రీసులో ప్రజాస్వామ్యం రాకముందే లిచ్ఛవీ గణాలలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లిన దేశమిది. మీరు విజయనగరంలో బెజ్జోని కొండ

**"వేమనను మొదట చాలా తొక్కి ప్రక్కన పెట్టారు. కాని వేమన పైకి వచ్చాడు. బుద్ధుని నుంచి వేమన వరకు, ఆధునిక భారతీయ సమాజంలోనూ ఆధిపత్యం, అగ్రవర్ణ తత్వం ఎంతుందో దాన్ని ప్రశ్నించే తత్వం, ఎదిరించే తత్వం కూడా అంత ఎక్కువగా ఉంది. చార్వాకులు ప్రశ్నిం చారు. లోకాయతులు ప్రశ్నించారు. హేతు వాదులు ప్రశ్నించారు."**


పోతన


వేమన


గురజాడ

కెళ్ళండి. బౌద్ధ ఆరామాన్ని చూడండి. అక్కడ మధ్యలో గురువు కూర్చుని ఉంటాడు. చుట్టూ పీఠాలు ఉంటాయి. బౌద్ధారామాల్లో ప్రజా స్వామ్య సంస్కృతి వర్ధిల్లిందని, గాంధీగారు చెప్పడాని కంటే చాలా కాలం క్రిందటే అహింస గురించి జైనులు చెప్పారని చరిత్ర చెపుతూ వుంది. అందుకని భారతదేశమంటేనే ఒకే మతం అంటే ఈ చరిత్రని మనం ఎవరి కిద్దాం? 2014 జూన్ 6వ తేదీన మోడీ ప్రమాణ స్వీకారంతో చరిత్రను మొదలుపెడదామా! దానికంటే ముందు చరిత్ర ఉంది కదా! ఈ దేశంలో జైనులు, బౌద్ధులు, శ్రమణులు ఉన్నారు. బ్రాహ్మణులు ఆచరించే దానిని బ్రాహ్మణుల మతమన్నారు. హిందూ మతం అనలా. అందుకనే హిందూ మతం అనే దానిలో కూడా మూడు దశలున్నాయి. 1- వైదిక దశ, 2- బ్రాహ్మణదశ, 3. హిందూమత దశ. హిందూ మత దశ అనేది బౌద్ధమతం తర్వాత వచ్చింది. బౌద్ధ మతం వచ్చిన తర్వాత బౌద్ధులు వీళ్ళనందరిని ఆకర్షిస్తున్నారు. మన మతం ఏమయి పోతుందని శంకరాచార్య బయల్దేరారు. ఎందుకు బౌద్ధమతం ఆకర్షిస్తుందంటే అప్పుడు బౌద్ధమతంసామాన్యులందర్నీ కలుపుకుంటుంది. వీళ్ళు ఎవర్నయినా చేర్చుకుం టున్నారు. కాబట్టి మనం కూడా ఇలా చేస్తే కాని కుదరదు అని హిందువులుగా ఉన్నవారు భావించారు. అప్పటివరకు శూద్రులు పూజ చేయకూడదు. ఇంట్లో విగ్రహాలు పెట్టుకోకూడదు. గుళ్ళు లేవు అంతకు ముందు బౌద్ధమతం వికసించి, దేశ సరిహద్దులు దాటి వెళ్ళింది. ఇప్పటికి కూడా ప్రపంచంలో వున్న ప్రవక్తల్లో మొట్టమొదటి వాడుగా బుద్ధుడు పరిగణించబడుతున్నాడు. బుద్ధుడు చెప్పినటువంటి వివరణ ఊహాజనిత సోషలిజంకు చాలా దగ్గరగా ఉంది. ఏమని చెప్పాడాయన? ఒకప్పుడు మనుషులందరూ సమానంగా ఉండేవాళ్ళు. ఈ సమానంగా ఉండే మనుషుల్లో కొంతమంది నెమ్మదిగా ఆస్తిపాస్తులు సంపాదిం చుకున్నాక ఇతరులను పీడించడం మొదలు పెట్టారు. ఆ విధంగా సమాజంలో అంతరాలు వచ్చాయి అని బుద్ధుడు చెప్పాడు. తర్వాత వచ్చిన వారు ఏమి చెప్పారంటే సురులు, అసురుల మధ్య యుద్ధం జరిగింది. అసురుల నుండి కాపాడమని వేడుకుంటే ప్రజాపతి బ్రహ్మ రాజుని నియమించాడు అని చెప్పారు. బుద్ధుడు చెప్పిన ప్రకారం రాజు ఎన్నుకోబడతాడు. ఈ రెండో వాదన ప్రకారం దేవుడు నియమిస్తాడు. తర్వాత తన కొడుకు రాజవుతాడు. చరిత్రలో చూస్తే మనకు ఇలాంటి చాలా విషయాలు తెలుస్తాయి. వీటితో పాటు మత ఛాందసాన్ని ప్రశ్నించటం, అసలు దేవుడున్నాడా? అని ప్రశ్నించారు. ప్రశ్నించింది మీరు నేను కాదు. కలడు కలండనువాడు కలడో లేడో అని పోతనే ప్రశ్నించాడు. సంఘ్ పరివార్ వాళ్ళు ఇప్పుడు పోతనను కొడతారా? కనక మృగము భువిని కలదు లేదనకనే తరలిపోయి నాడు రాఘవుండు, బుద్ధి లేనివాడు దేవుడెట్లాయరా విశ్వదాభి రామ వినురవేమ అని ప్రశ్నించినటువంటి వేమనను సంఘ పరివార్ వాళ్ళు కొడతారా? కొట్టలేరు. కొట్టడానికి కుదరదు. అందుకే ఆదికాలంలో తిక్కన, మధ్యకాలంలో వేమన, ఆధునిక కాలంలో గురజాడ మన మహాకవులు అని శ్రీశ్రీ అన్నారు. వేమనని ఆవిష్కరించినటువంటి రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ అద్భుత ప్రసంగాలను ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు ప్రచురించడం చాలా గర్వించదగ్గ విషయం. వేమనను మొదట చాలా తొక్కి ప్రక్కన పెట్టారు. కాని వేమన పైకి వచ్చాడు. బుద్ధుని నుంచి వేమన వరకు, ఆధునిక భారతీయ సమాజంలోనూ ఆధిపత్యం, అగ్రవర్ణ తత్వం ఎంతుందో దాన్ని ప్రశ్నించే తత్వం, ఎదిరించే తత్వం కూడా అంత ఎక్కువగా ఉంది. చార్వాకులు ప్రశ్నించారు. లోకాయతులు ప్రశ్నించారు. హేతు వాదులు ప్రశ్నించారు. శ్రీశ్రీ ఈ ముగ్గురినే కవులు అని ఎందుకన్నారంటే ఈ ముగ్గురు కూడా మానవుడికి పట్టం కట్టారు కాబట్టి. మానవుడు ఏ దైవాన్నైనా పూజించవచ్చు. ఎవరి దేవుణ్ని ఎవరయినా పూజించుకోవచ్చు. పూజించకుండానూ వుండొచ్చు. ఎవరి విశ్వాసం ఏదయినా కావచ్చు. కాని నా అభిప్రాయంతో విభేదిస్తే కుదరదు అనే దగ్గర సమస్య వస్తుంది. మొన్న వచ్చిరి ముసల్మానులు, నిన్న వచ్చిరి బుడత కీచులు, నేడు వచ్చిరి ఇంగిలీసులు అన్నాడు గురజాడ. నిజానికి భారతదేశ చరిత్రను మలుపు తిప్పినటు వంటి బొబ్బిలి యుద్ధం ఫ్రెంచి వాళ్ళకు, ఇంగ్లీషు వాళ్లకు మధ్య ఇక్కడే జరిగింది. ఈ యుద్ధాన్ని ఫ్రెంచి వాళ్ళు గెలిచుంటే వాళ్లే దొరలయ్యే వాళ్లు. కాలేదు కాబట్టి తెల్లదొరలు వచ్చారు. ఇప్పుడు బ్రౌను దొరలు అంటే నల్లదొరలు - ఇప్పుడు చంద్ర నరేంద్ర దొరలు - దొరల కుమారులు, వారిట్వీట్లు, ఫీట్లు ఇదంతా ఒక కథనుకోండి. కాబట్టి ఇదొక పరంపర. భారతదేశమనేది హిందువులదే అందులో ఇంగ్లీషు వాళ్ళకంటే ముందొచ్చిన ముసల్మానులు విదేశీయులు. మనం ముసల్మానులను ఎక్కువ వ్యతిరేకించు తాము. ఎందుకు వాళ్ళిక్కడే కలిసిపోయారు కదా! ముస్లింలు లేకపోతే తాజ్‌మహల్ లేదు, ముస్లింలు లేకపోతే మొఘల్ ఏ ఆజం లేదు, చార్మినార్ లేదు, అక్బర్ లేక పోతే కొన్ని లేవు.

ఇవన్నీ మనం పడగొట్టు కుంటూ పోతే మళ్ళా అవి కట్టడానికి మూడు తరాల వరకు పడుతుంది. సమయం సరిపోదు. కాబట్టి చరిత్ర దృష్టి కాదిది. రెండోది పాశ్చా త్యులు. మాట్లాడితే పాశ్చాత్య నాగరికత అంటారు. పాశ్చాత్యుల నుండి ప్రజాస్వామ్యం, ఇంకా చాలా విషయాలు మనం తెచ్చుకున్నాం కదా! పశ్చిమ అంటే పాశ్చాత్యులనుకుంటు న్నాము. పాశ్చాత్యులు అంటే అనంతరం వచ్చినవాళ్లు. ఇస్కేపశ్చాత్ అంటారు కదా. మన హిందీ సీరియల్స్ చూస్తుంటే పశ్చాత్తాపం అంటేకూడా అటువంటిదే. అంటే పనైపోయాక ఏడవడం. ఎన్నుకున్నాక ఏడవడం లాంటిది. పాశ్చాత్యులకంటే కూడా ఈ దేశంలో ఉండి, ఇక్కడే కలిసిపోయిన వారిపై ఎందుకు ద్వేషం? దీనికేమైనా హేతుబద్ధమైన కారణముందా! వాళ్ళలో కబీర్ లేడా! వాళ్ళలో ఇంకా అనేక మంది ప్రఖ్యాతి చెందిన వారున్నారు.

ఇకమూడోది. భారతదేశంలో ఈ మతాలు ఎలా వున్నా సరే, రాజ్యానికి మతానికీ మధ్యలో ఉండాల్సిన తేడా చాలా స్పష్టంగా వుంది. ఇందులో పాశ్చాత్య దేశాల కంటే భారతదేశం మెరుగుగా ఉంది. ఈ విషయాలలో పాశ్చాత్య దేశాలలో చర్చి చెప్పినట్లే నడిచారు. ఇంగ్లీష రాకుమారుడు అనుకున్న పెళ్లి చేసుకొనేందుకు చర్చి అడ్డమొచ్చే వరకు వారికేమి ఇబ్బందిలేదు. ఆ తర్వాత ప్రొటెస్టెంట్లు విడిపోయారు. మార్టిన్ లూథర్‌కింగ్ తిరుగుబాటు చేసినట్లే వాళ్ళూ తిరుగుబాటు చేశారు. కాని భారతదేశంలో రాజుకు రాజగురువుకు మధ్య, రాజ్యానికి, మతానికి మధ్య ఆ తేడా వుంది. ఇప్పుడు మీరు రామదాసు కథ చూడండి. నా వుద్దేశ్యంలో రామదాసు అందరికంటే పెద్దరెబెల్. ఎవడబ్బ సొమ్మానీ కులుకుతూ తిరిగేవూ రామచంద్రా! అని రాముడిని ప్రశ్నించాడు. ఎవడబ్బ సొమ్మని రామదాసు దేవుడినే అన్నాడు. తానీషా తాలూకు కప్పం తీసుకుని రామదాసు రాముడికో గుడి కట్టించాడు కదా! కప్పం కట్టకుండా గుడి కట్టిస్తే తానీషా ఆయన్ని జైల్లో పెట్టాడు. రాముడు ఏం చేశాడండి. ఓం భీం, ఫట్ తానీషా జీ అని అనలేదు. తమ్ముడిని తీసుకువచ్చి తానీషాకి కట్టాల్సిన డబ్బులు కట్టి విడిపించాడు. ఇందులో సందేశం ఏమిటి? రాజులు వేరు, రాజ్యాలు వేరు. రాజుగారికి ఉండాల్సిన ధర్మాలు వేరు, నీ రాజ్యానికి ఉండాల్సిన ఆర్థికనియతి వేరు, భక్తి ప్రవత్తులు వేరని రాముడే చెప్పాడని మీరొకవైపు చెబుతున్నారు. సరే మన నాగార్జున గారి రామదాసులో వేరే ఉంటుందనుకోండి – దాన్ని హిందీలో అద్వాని గారు ఆవిష్కరించారు. ఇక్కడే సాంస్కృతిక వైవిధ్యం కనిపిస్తుంది. అద్వానీ గారు హైదరాబాద్ వచ్చినపుడు మీరు భద్రాచలం వెళ్తున్నారా అని అడిగితే ఎందుకు భద్రాచలం – ఏముందక్కడ అన్నాడట. ఇది వాస్తవం – లేదండి అక్కడ రాముడు వుంటాడు – ఆంధ్రజాతికిది అయోధ్య గుడి అన్నా రట.అయినా ఆయన పట్టించుకోలేదు. ఆ అయోధ్య అంటే అధికారం అక్కడుంది. ఇక్కడ లేదు కదా. ఆయన ఇప్పటికీ చూశారో లేదో నాకు సందేహమే. అద్వానీ గారిని ఇంటర్వ్యూ చేయడానికి మీడియా మిత్రులు వెళితే ఎక్కడా రాముడి బొమ్మలు లేవట. ఇంటర్వ్యూ చేసిన వారు ఈ విషయాన్ని ప్రత్యేకంగా రాశారు.

"నా వుద్దేశ్యంలో రామదాసు అందరికంటే పెద్దరెబెల్. ఎవడబ్బ సొమ్మానీ కులుకుతూ తిరిగేవూ రామచంద్రా! అని రాముడిని ప్రశ్నించాడు. ఎవడబ్బ సొమ్మని రామదాసు దేవుడినే అన్నాడు. తానీషా తాలూకు కప్పం తీసుకుని రామదాసు రాముడికో గుడి కట్టించాడు కదా! కప్పం కట్టకుండా గుడి కట్టిస్తే తానీషా ఆయన్ని జైల్లో పెట్టాడు. రాముడు ఏం చేశాడండి. ఓం భీం, ఫట్ తానీషా జీ అని అనలేదు. తమ్ముడిని తీసుకువచ్చి తానీషాకి కట్టాల్సిన డబ్బులు కట్టి విడిపించాడు."

మహమ్మదాలీ జిన్నా లండన్‌లో బారిష్టర్ చేసి వచ్చిన తర్వాత సన్మానం చేసి, మీరెందుకు మిడిల్ టెంపుల్ స్కూల్‌లోనే చదివారని అడిగితే అక్కడ అల్లా ఫోటోలున్నాయని ఆయన చెప్పాడట. అల్లా ఫోటోఉందంటే అందరు దంగైపోయారట. ఎందుకని అల్లా ఫోటో ఉండదు? ఇస్లాం ప్రకారం అల్లాకు ఫోటో ఉండదు. కాబట్టి అల్లా ఫోటో ఉండటానికి అవకాశమే లేదు. అద్వానీ గారు పాకిస్థాన్ వెళ్ళి జిన్నాకి కితాబిచ్చి వచ్చారు. ఆయన పాకిస్తాన్ ఏర్పాటుచేస్తే ఈయన ఎన్‌డిఎ సర్కార్ ఏర్పాటు చేశారు. తర్వాత ఆయన్ని బయటకు పంపించారనుకోండి. పాకిస్తాన్ ఏర్పడ్డాక జిన్నా చేసినట్టి మొదటి ప్రసంగంలో ఇస్లాం అంటారేమో, విందా మని అందరూ చెవులు చేటల్లా చేసుకొని ఎదురు చూస్తుంటే ఒక్కసారి కూడ ఆ మాట అనలేదట. మతమనేది రాజకీయాలకొక సాధనం – మహాత్మాగాంధీ ఖిలాఫత్ ఉద్యమం మొదలు పెట్టినప్పుడు ఇది మతపరమైనది, వద్దని వ్యతిరేకించినవాడు జిన్నా. అటువంటివాడు ఆ మతాన్నే తీసుకుని దేశాన్ని విభజించే వరకు నడిపించాడు. అంటే మత రాజకీయాలకు ఎక్కడైనా సరే అధికారం పరమావధి తప్ప ప్రజలతో కాని, ఆధ్యాత్మికతతో కాని దానికి పనిలేదు.

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,** 'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక, ప్రజాశక్తిప్రెస్,
గవర్నరుపేట, విజయవాడ.

**"తదుపరి విషయం కులాలు. హిందూ మతం ఎట్లుంటదో దాని రూపం ఏమిటో మనకు తెలియదు. హిందూమతమంటే బ్రాహ్మణ, వైశ్య, శూద్రులా? అసలు ఇందులో ఎక్కడాలేని అస్పృశ్యులా? తెలియదు. హిందూమతం కులాల ద్వారానే వ్యక్తీకరించబడింది. గాంధీ గారు అస్పృశ్యతా నివారణ చేపట్టాడు. జీవితమంతా రామనామ స్మరణ చేశాడు. రఘుపతి రాఘవ రాజారాం, పతిత పావన సీతారాం అన్నాడు."**



రామ రావణ యుద్ధం

అయోధ్యలో బాబ్రీమసీదుని పడగొట్టినపుడు అక్కడ మీడియావాళ్ళతో పాటు సంత్ రామదాస్ అనే ఆయన్ని కూడా కొట్టారు. ఆయన అడ్డం తిరుగుతున్నాడు. నాదే రామాలయం అంటున్నాడు. కాబట్టి మతపరమైన అసహనానికి భారత దేశం యొక్క పరంపరకు ఏమాత్రం సంబంధం లేదనేది దైవభక్తులైన వారు కూడా గుర్తించవలసిన అవసరముంది. ఎందుకు రామాయణంలో గుహుడున్నాడు – ఎందుకు రామాయణంలో వానరులున్నారు ఎందుకు రామాయణంలో రావణాసురున్ని కూడా గొప్పగా చెప్పారు. ఈ మధ్య ఒక చర్చ వచ్చింది. రావణాసురుడు ఓడిపోతున్నా సీత మీద మాత్రం యాసిడ్ పోయలేదు. కాని శూర్పణఖ ముక్కు చెవులు ఎవరు కోశారు. లక్ష్మణ కుమారుడు కోశాడు. అలాగే సీతని అగ్నిలోకి ఎవరు తోశాడు? రాముడు తోశాడు. వాల్మీకి వ్రాసినటువంటి రామాయణంలోని శ్లోకాలు చదివితే చాలు. చాలా విషయాలు అర్థం అవుతాయి. కంటి జబ్బు చేసినవాడి ముందు దీపం పెడితే ఎలా ఉంటుందో సీతా! నువ్విక్కడ నిలబడితే నాకా విధంగా ఉన్నదన్నాడు రాముడు. నేను రాజును, పరాక్రమవంతుడినని నిరూపించుకోవటం కోసం నిన్ను విడిపించాను. నిన్ను ఏలుకోవడానికి కాదు. నీవు లక్ష్మణుడి దగ్గరికైనా, విభీషణుడి దగ్గరికైనా పోవచ్చు అన్నాడు. ఇంత అందాల రాశివైన నిన్ను చూసి రావణుడు ఊరికే ఉన్నాడంటే నేను నమ్మను అంటాడు. ఇవన్ని వాల్మీకి రాశాడు. వాల్మీకి కూడా రెబలే. వాల్మీకి సీతను రాముడి దగ్గరికి పంపించలేదు. మనం ఈ విషయం గుర్తుపెట్టుకోవాలి. రాముడ్ని పూజించినంత మాత్రాన సీత మీద సానుభూతి చూపించకూడదు అంటే భారతీయ సంస్కృతిలో ఏమి చెప్పినా గాని, భారతీయ సమాజం, పౌరసమాజంలో స్త్రీల పట్ల వివక్ష వుంది. కాబట్టే వాల్మీకి సీత గురించి అలా రాశాడు. లవకుశ సినిమా చాలా బ్రహ్మాండమైన విజయం సాధించింది. లవకుశులు వినుడు వినుడు రామాయణ గాథ అని శ్రీరాముడి చెంతకు వెళ్ళి నిలబడ్డారు. రాముడుగా రామారావు గారు దివ్య మంగళ విగ్రహంతో వచ్చి నిలబడ్డాడు. రాముడ్ని చూడగానే లవకుశులు శ్రీరాఘవం దశరథాత్మజం అని పాడిన తర్వాత మా జనని సీత ఎక్కడుంది, పదండి చూద్దాం అని అడిగారు. అప్పుడు వాళ్ళమ్మ కౌసల్య ఏడ్చింది. వెంటనే లవకుశులు తిరుగుబాటుచేసి వాళ్ళమ్మ దగ్గరకు వచ్చారు. కాబట్టి లవకుశులు చేసింది తిరుగు బాటు. ఈనాటి మన సంస్కారంతో చూసిన ప్పుడు రాముడట్లా చేసుండకూడదని భారతీయు లందరూ అంటారు. మల్లాది రామకృష్ణ శాస్త్రి గారు గొప్ప కవి, రచయిత. ఆయన రామాయ ణం అనడు. సీతాయణం అంటాడు. రాముడి భక్తుడైన బాపు తీసిన ఏ సినిమా అయినా చూడండి. సీతమ్మ వారి కష్టాలే చూపిస్తాడు. అది ముత్యాలముగ్గు కావచ్చు – ఇంకొకటి కావచ్చు. కాబట్టి మిత్రులారా. నేను చెప్పదల్చుకుంది భారతీయ సమాజంలో భిన్నమతాలు ఉండటం, హేతుతత్వం ఉండటం, మానవత్వం ఉండటంతో పాటు స్త్రీల పట్ల సానుభూతి చూపించే లక్షణం కూడా ఉన్నదని మనం తెలుసుకోవాలి.

తదుపరి విషయం కులాలు. హిందూ మతం ఎట్లుంటదో దాని రూపం ఏమిటో మనకు తెలియదు. హిందూమత మంటే బ్రాహ్మణ, వైశ్య, శూద్రులా, అసలు ఇందులో ఎక్కడాలేని అస్పృశ్యులా? తెలియదు. హిందూమతం కులాల ద్వారానే వ్యక్తీకరించబడింది. గాంధీగారు అస్పృశ్యతా నివారణ చేపట్టాడు. జీవితమంతా రామనామ స్మరణ చేశాడు. రఘుపతి రాఘవ రాజారాం, పతిత పావన సీతారాం అన్నాడు. అటువంటి మహాత్మగాంధీని 1948 జనవరి 30న హత్య చేయడం కంటే భారతదేశ సాంస్కృతిక వైవిధ్యానికి పెద్ద సవాలు ఏమయినా వుందా? దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఒక ఏడాదిలోపునే, అంటే 1948 జనవరి 30న మనం ఆయనను కోల్పోయాము. అప్పట్నుంచి ఇప్పటి వరకు ఈ సవాళ్ళు పెరుగుతున్నాయి తప్ప తగ్గడం లేదు. వాస్తవానికి తగ్గి ఉండాల్సింది కాని ఇప్పుడు అదింకా వెర్రితలలు వేస్తున్నది. మతములన్నియు మాసి పోవును, జ్ఞానమొక్కటే నిలిచివెలుగును అని గురజాడ అప్పారావు అన్నాడు. కాని మతం మాసిపోలా. ఎందుకంటే అది రాజకీయాలతో ముడివేసుకుపోయింది. మతాన్ని రాజకీయాలతో పెనవేయడం వలన, హిందూ మతం స్థానంలో హిందూత్వం అనే మత సిద్ధాంతం ఆక్రమించడం, అంతర్జాతీయంగా ఇస్లాం తీవ్రవాదం వంటివి రావడం వల్ల జాతీయస్థాయిలో, అంతర్జాతీయంగా కూడా ఇటువంటి పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇతర మతాలకు చెందినవారు కూడా కొంతమంది నన్ను అడుగుతుంటారు మీరు మీ గురించే మాట్లాడుతుంటారు. పొద్దున్నే వారు అన్ని ఛానల్ళలో మత ప్రచారం చేస్తున్నారు కదా అంటారు. ఛాందసత్వం ఎక్కడున్నా ఖండిస్తాం. కాని అదే సమయంలో ఇతరుల ఉనికిని సహించలేనటువంటి ఒక తత్వం, భారత దేశంలో హిందువులు ఎక్కువగా ఉన్నారు,

కాబట్టి హిందువులదే ఈ దేశం అనే వాదన చాలా చాలా పొరపాటు. ఎందుకంటే ప్రజాస్వామ్యం అంటే మెజారిటీ వాదం కాదు. పైగా మెజారిటీ అనేది శాశ్వతంగా కూడా ఉండదు. మెజారిటీ అనేది కూడా మారుతూ ఉంటుంది. దేశ విభజనకు ముందు ముస్లింలు ఎక్కువగా ఉన్న రాష్ట్రాలలో ఎక్కువచోట్ల కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ప్రజాస్వామ్యం అంటే చట్టబద్ధ పాలన. చట్టానికి అనుగుణంగా పాలన చేయటం. స్వామి అగ్నివేశ్ పుట్టినప్పటి నుండి కాషాయ బట్టలేస్తున్నాడు. ఆయన ఆర్యసమాజ్. ఆరెస్సెస్ సమాజ్ కాదు. ఆర్య సమాజయితే ఆరెస్సెస్ వారికి కుదరదు. వారు ఆయనపై దాడి చేశారు. ఎందుకలాంటి ఘటనలు జరుగుతున్నాయని అందరూ బాధపడ్డారు. కాని దాని కంటే ముందు అక్కడే ఇటువంటి ఘటనల్లో కోర్టుల్లో శిక్షలు పడ్డవారిని కేంద్ర మంత్రి జయంత్ సిన్హాగారెళ్ళి సత్కరించి వచ్చారు. అంటే కేవలం ఇటువంటివి ఖండించక పోవడమొక్కటే కాక, అటువంటి వారిని సత్కరించడమనేది కూడా దేశంలో వస్తున్నది. ఎవరి నాయకులు వారికి ఉండవచ్చు. ఎవరి పార్టీకి వాళ్ళు ఓట్లేసుకోవచ్చు. అది వేరే విషయం. కాని దేశం అన్ని మతాలకు చెందిన వాళ్ళది. అన్ని విశ్వాసాలకు చెందిన వాళ్ళది. ఏమతానికి చెందని వాళ్ళది కూడా. రాజా రామ్మోహన్‌రాయ్ దగ్గర్నుంచి గురజాడ అప్పారావు వరకు ఎందరెందరో సంస్కర్తలు, వైతాళికులు నూతనమైన భావాలు చెప్పినటువంటి దేశం. హిందూమతంలో కూడా రామానుజాచార్యులు, మధ్వాచార్యులు, దయానంద సరస్వతి వంటి వారందరు మతం పరిధిలో సంస్కరణలు ప్రతిపాదించారు. కాబట్టి ఒకటి హిందూ మతమనేది ఏక శిలా సదృశ్యమైనది కాదు. రెండోది భారతదేశం శిలా సదృశ్యమైనది అంతకన్నా కాదు. ఈ రెండింటిని కలగాపులగం చేసి ఈ దేశంలో ఒకటే మతం, ఆ మతానికి ఒకటే వ్యాఖ్యానం, ఆ వ్యాఖ్యానానికి ఒకటే రాజకీయ ప్రాతినిధ్యం. మిగిలిన వాటిని మేము సహించం అంటే అది ప్రజాస్వామ్యం కాదు. అది భారత రాజ్యాంగ ధర్మం కాదు. భారత పౌర సమాజం కూడా అటువంటివి ఆమోదించదు. పల్లెల్లో ఉర్సు జరిగితే అన్ని మతాలవారు వెళ్తారు. కడపలోని దర్గాల దగ్గరికి అన్ని మతాలవారు – అగ్రనటులు, పెద్ద పెద్ద నేతలు కూడా వస్తారు. అలాగే రథోత్సవాలలో, తిరణాళ్ళలో అన్ని మతాల వారు పాల్గొంటారు. కాబట్టి ఇక్బాల్ చెప్పినట్లుగా భారతదేశాన్ని అనేక పూలతో కూడిన తోటలా భావించాలి.

❝ఈ రెండింటిని కలగాపులగం చేసి ఈ దేశంలో ఒకటే మతం, ఆ మతానికి ఒకటే వ్యాఖ్యానం, ఆ వ్యాఖ్యానానికి ఒకటే రాజకీయ ప్రాతినిధ్యం. మిగిలిన వాటిని మేము సహించం అంటే అది ప్రజాస్వామ్యం కాదు. అది భారత రాజ్యాంగ ధర్మం కాదు. భారత పౌర సమాజం కూడా అటువంటివి ఆమోదిం చదు. పల్లెల్లో ఉర్సు జరిగితే అన్ని మతాలవారు వెళ్తారు.❞


స్వామి అగ్నివేష్‌పై ఆర్ఎస్ఎస్ దాడి


వేమన అదికూడా చెప్పాడు. పూలవర్ణం వేరు, పూవు లొక్కటే, దర్శనంబులు వేరు దైవంబు ఒక్కటే విశ్వదాభిరామ వినురవేమ అన్నారు. అధికారంలో ఉన్నవాళ్ళుకాని, అధికారంలోకి రావాలనుకుంటున్న వారుకాని, అధికారంలోకి వస్తామనుకుంటున్న వారు గాని ఎవరైనా సరే మతాన్ని సాధనంగా చేసుకోకండి. ప్రజాశ్రేయస్సును, ప్రజాస్వామ్య విలువలను, భారత రాజ్యాంగం చెప్తున్నటువంటి లౌకిక స్ఫూర్తిని, 19వ అధికరణం ఇచ్చినటువంటి ప్రాథమిక హక్కులను వీటన్నింటిని మీరు ఆధారం చేసుకోవాలి. ఎందుకంటే నా నుంచి రాష్ట్రపతి వరకు దేశ ప్రజలలో ఎవరయినా సరే రాజ్యాంగం మీద ఆధారపడాల్సిందే తప్ప రాజ్యాంగేతర శక్తి మీద ఆధారపడే హక్కు ఎవరికీ లేదు. భారతదేశం ముమ్మాటికీ లౌకిక రాజ్యం. ముమ్మాటికి సామాజిక న్యాయాన్ని, సమాఖ్య వ్యవస్థను చెప్పేది రాజ్యాంగం. కొన్ని భాషలే, కొన్ని మతాలే లేక కొన్ని విశ్వాసాలే, కొందరు మనుషులే ప్రధానం అనేది తీసుకువస్తే అది రాజ్యాంగానికి వ్యతిరేకం అవుతుంది. ఇక చివరి విషయం. ఆంధ్రదేశంలో కుల పైత్యం పెరిగిపోయి, మతతత్వం, కులపైత్యం కలసిపోయినటువంటి ఒక వికృత పరిస్థితి ఏర్పడింది. ఏ కులమని నన్నివరమడిగితే ఏమని చెప్పుదు లోకులకు, పలు గాకులకు అన్నాడు వీర బ్రహ్మేంద్రస్వామి శిష్యుడు. కుల, మత సంకుచితత్వా లకు, పురుషాధిక్యతకు అతీతమైనటువంటి ఒక మానవీయ సంస్కృతిని, ప్రజాస్వామ్య సంస్కృతిని, రాజ్యాంగ సంస్కృతిని మనం ప్రతిష్ఠించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ మార్కెట్ కల్చర్, కమ్యూనల్ కల్చర్ బొమ్మా బొరుసుల్లాంటివి. అసలు అగ్రికల్చర్‌కే దిక్కులేనప్పుడు ఈ కల్చర్ గురించి మాట్లాడే వారెవరున్నారిపుడు.

ఎంతసేపు కూడా మనీ కల్చర్, సెరీ కల్చర్ ఆక్వా కల్చర్, నైట్ కల్చర్, పబ్‌కల్చర్, ఇదంతా నిజానికి నాన్‌కల్చర్. లేదా నాన్సెన్స్ కల్చర్. అరకులోయ వెళ్ళి, అక్కడున్న గిరిజనులతో కలసి మనం ధింసా నృత్యం చేస్తే నిజమైన కల్చర్ తెలుస్తుంది. పల్లెలకు వెళ్ళి అక్కడి పరిమళాల్ని ఆస్వాదిస్తే తెలుస్తుంది. మట్టి మనుషులతో కలిసి నడిస్తే వస్తుంది. లేదంటే ఇక్కడ ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని లైబ్రరీల కొచ్చి –అవి కూడా డిజిటలైజ్ అవుతున్నాయను కోండి– నేర్చుకుంటే తెలుస్తుంది. మతములన్నియు మూసిపోవును, జ్ఞానమొక్కటే నిలిచి వెలుగును అన్న ఒక గురజాడ స్ఫూర్తితో మనం ఒక మానవీయ స్పృహను, సంస్కృతిని పెంపొందించుకోవాలి. సాటి మనుషుల పట్ల సహోదర స్ఫూర్తితో వ్యవహరిస్తుంటే అప్పుడు సహనం దానంతట అదేవస్తుంది. అప్పుడు దేశంలో వుండే వైవిధ్యం బ్రహ్మాండంగా పరిఢవిల్లుతుంది.

❊

# ప్రమాదపు అంచుల్లో ఉన్నత విద్య

**ఆర్. రామచంద్రన్**



రచయిత
ప్రముఖ పాత్రికేయులు

ఖిల్వాడీ అనే హిందీ పదానికి తెలుగులో బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యం వంటి అర్థాలు చెప్పుకోవచ్చు. ప్రస్తుతం కేంద్రంలో వున్న ప్రభుత్వం విద్యారంగం పట్ల, ముఖ్యంగా ఉన్నత విద్యారంగం పట్ల ఇదే తీరులో వ్యవహరిస్తోందని చెప్పవచ్చు. దాదాపు 62 ఏళ్లుగా ఉన్నత విద్యారంగానికి విశేష సేవలందిస్తున్న యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ స్థానంలో భారత ఉన్నత విద్యా కమిషన్ (హెచ్ఇసిఐ) ను ఏర్పాటు చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలు నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి ఉన్నత విద్యారంగంపై కొనసాగుతున్న ప్రత్యక్ష, పరోక్ష దాడులకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. విద్యారంగంపై ఇతర తరహాల ప్రత్యక్ష, పరోక్ష దాడుల్లో కేంద్రంలోని అధికార పార్టీ మాతృసంస్థ అయిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, సంఘ్ పరివార్‌కు చెందిన ఇతర సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. పాలక పార్టీకి చెందిన మంత్రులు, చట్టసభల సభ్యులు, ఇతర హిందూత్వ వాదులు గో'శాస్త్రం' జాతీయ స్థాయిలో ప్రచార కార్యక్రమం చేపట్టి అశాస్త్రీయ వాదనలు, ప్రచారాలతో 'భారతీయ గత వైభవం' పేరిట శాస్త్రీయతను, సహేతుకతను దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తున్నారు.


సంఘ్ పరివార్ సైద్ధాంతికతకు సన్నిహితంగా వుండే వ్యక్తులను ప్రభుత్వం ఆయా సంస్థలలోని విధాన నిర్ణాయక వ్యవస్థలలో, కమిటీలలో సభ్యులుగా నియమిస్తోంది. శాస్త్ర, సాంకేతిక విభాగాలు, శాస్త్ర, పారిశ్రామిక పరిశోధనా మండలి (సిఎస్ఐఆర్) లేబరేటరీల వంటి వ్యవస్థల విధి విధానాలలో ఆరెస్సెస్‌కు చెందిన విజ్ఞాన భారతి నేరుగా జోక్యం చేసుకుంటోంది. ఈ చర్యల ద్వారా జాతీయ యువ సాధికారికత పథకం (ఎన్-ఎస్) ద్వారా 'జాతీయవాదం' పేరుతో ఉద్యమాన్ని దూకుడుగా కొనసాగించేందుకు ప్రయత్నిస్తోంది. ప్రస్తుతం యుజిసి పరిధిలో వున్న దాదాపు 800 యూనివర్శిటీలు, 40 వేలకు పైగా కళాశాలల వంటి ఉన్నత విద్యా సంస్థలపై తీవ్ర ప్రభావం చూపే ఈ చర్యల పట్ల విమర్శలు, వ్యతిరేకత కూడా అదే స్థాయిలో వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం తన చర్యల ద్వారా ఈ సంస్థలలో విద్యను అభ్యసిస్తున్న లక్షలాది మంది విద్యార్థుల భవితను కాలరాయటమే కాక భారతీయ విద్యా వ్యవస్థలో అందరికీ సమాన అవకాశాలు కల్పించాలన్న రాజ్యాంగ లక్ష్యాలను నీరుకారుస్తోంది. వాస్తవానికి యుజిసి స్థానంలో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన కొత్తదేమీ కాదు. 1964–66 మధ్య కాలంలో కొఠారీ కమిషన్, ఉన్నత విద్యారంగ పునరుత్తేజంపై 2007లో యశ్‌పాల్ కమిటీ వంటి కమిటీలు ఉన్నత విద్యారంగ ప్రక్షాళనపై అనేక సిఫార్సులు చేశాయి. అయితే 2007లో తెరపైకి వచ్చిన నేషనల్ నాలెడ్జ్ కమిషన్ జాతీయ స్థాయిలో ఉన్నత విద్యారంగ నియంత్రణా వ్యవస్థను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. 1986–91 మధ్య కాలంలో యుజిసి ఛైర్మన్‌గా వ్యవహరించిన ప్రొ. యశ్‌పాల్ నేతృత్వంలోని కమిటీ విద్యారంగంలో ఎదురవుతున్న అన్ని అంశాలను పరిశీలించి, ఉన్నత విద్యారంగంలోని అన్ని విభాగాల (వ్యవసాయ, వైద్య శాస్త్రాలు మినహా)ను, పరిశోధనలను నియంత్రించేందుకు స్వయం ప్రతిపత్తికి సంబంధించిన మార్గదర్శక సూత్రాలతో రాజీ పడకుండా జాతీయ ఉన్నత విద్యా, పరిశోధనా కమిషన్ (ఎన్‌సిహెచ్ఇఆర్)ను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. అంటే ఎన్‌సిహెచ్ఇఆర్ ద్వారా ఉన్నత విద్యారంగంలో రాజకీయ జోక్యం లేకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో నియంత్రణను కొనసాగిస్తూ పరిశోధనా సంస్థలు, యూనివర్శిటీలు, ముఖ్యంగా యుజిసి చట్టంలో ప్రస్తావించిన వ్యవస్థలతో సమన్వయం చేసుకోవటం ద్వారా ఉన్నత విద్యారంగంలో కనీస ప్రమాణాలను కొనసాగించటం ఈ సిఫార్సుల ప్రధానోద్దేశం.

### ఉన్నత విద్యా, పరిశోధనా బిల్లు

ఎన్‌సిహెచ్ఇఆర్ ఏర్పాటుకు సంబంధించి ఉన్నత విద్యా, పరిశోధనా బిల్లును ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. అయితే ఉన్నత విద్యారంగ పార్లమెంటరీ స్థాయీ సంఘం ఈ ప్రతిపాదనలపై కొన్ని అభ్యంతరాలను లేవనెత్తింది. యుజిసి, అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసిటిఇ) వంటి సంస్థలు చేసిన ప్రతిపాదనలు, యూనివర్శిటీ పాలక మండళ్ల వ్యతిరేకత, కొంతమంది విద్యావేత్తలు, వ్యాఖ్యాతల భిన్నాభిప్రాయాలను స్థాయీ సంఘం పరిశీలించి ఈ అభ్యంతరాలను లేవనెత్తింది. 2014 సెప్టెంబర్‌లో ఈ బిల్లుపై ఓటింగ్ జరిగే సమయానికి అప్పటికి అధికారంలో వున్న బిజెపి ప్రభుత్వం దీనిని ఉపసంహరించుకుంది. ఎన్‌సిహెచ్ఇఆర్ స్థానంలో ప్రస్తుత ప్రభుత్వం హెచ్ఇసిఐని ప్రతిపాదించింది. ఈ బిల్లు ముసాయిదాను విడుదల చేసిన మానవ వనరుల మంత్రిత్వశాఖ తన రెండు నాల్కల ధోరణిని కొనసాగించింది. ఒకవైపు యూనివర్శిటీలు, ఇతర ఉన్నత విద్యాసంస్థల స్వయం ప్రతిపత్తిని విస్తరిస్తామంటూనే, మరోవైపు హెచ్ఇసిఐ నిర్మాణం, పనితీరు విధి విధానాలపై గరిష్ట స్థాయిలో ప్రభుత్వ నియంత్రణ వుంటుందని చెబుతోంది. ప్రభుత్వం ప్రస్తుతం ప్రతిపాదించిన రూపంలోనే ఈ బిల్లు ఆమోదం పొంది చట్ట రూపం ధరిస్తే హెచ్ఇసిఐలో ప్రత్యక్ష రాజకీయ జోక్యానికి తావివ్వటమే కాక, ఉన్నత విద్యా సంస్థలలో హిందూత్వ అజెండా చొరబడటానికి కూడా దారి తీస్తుంది. విద్యాసంస్థల స్వయం ప్రతిపత్తిని మరింతవిస్తరిస్తామంటున్న వాదనను, 'కొద్దిపాటి యంత్రాంగంతో ఎక్కువ పాలన' (లెస్ గవర్నమెంట్, మోర్ గవర్నెన్స్) నినాదాన్ని పరిశీలిస్తే హెచ్ఇసిఐ ఆవిర్భావం ద్వారా ఉన్నత విద్యాసంస్థల బాధ్యత నుండి ప్రభుత్వం

క్రమంగా పక్కకు తప్పుకోవటంతో పాటు ఉన్నత విద్యారంగాన్ని ప్రైవేటు, కార్పొరేట్ రంగాలకు అప్పగించటమే అవుతుంది. లాభార్జనే ప్రధాన ధ్యేయంగా వుండే ఈ రంగాలు విద్యారంగంలోకి ప్రవేశిస్తే విద్య వ్యాపారంగా మారుతుంది. హెచ్ఇసిఐ బిల్లులోని నిర్దిష్ట అంశాలను పరిశీలిస్తే ప్రభుత్వం, కార్యనిర్వాహక వ్యవస్థలు ఉన్నత విద్యారంగం పట్ల ఎంత చిన్న చూపు ప్రదర్శిస్తున్నాయో అర్థమవు తుంది. హెచ్ఇసిఐ అధికారికంగా ఏర్పడితే పై చెప్పిన పరిణామాలన్నీ వాస్తవ రూపం దాల్చటం తథ్యం. కేంద్ర మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 23 ఐఐటిలు వున్నాయి. ఈ సంస్థలన్నీ పరోక్ష స్వయం ప్రతిపత్తి కలిగినవే. కొత్తగా తిరుపతి, పాలక్కాడ్, ధార్వాడ్, భిలాయ్, గోవా, జమ్ములలో ఏర్పాటు చేస్తున్న ఆరు ఐఐటిలు ఇప్పుడు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. ఈ ఐఐటిలన్నింటినీ జాతీయ ప్రాధాన్యత కలిగిన విశిష్ట విద్యాసంస్థలుగా ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో ఐఐటి ఢిల్లీ, ఐఐటి ముంబయి సంస్థలను ప్రభుత్వం ఇటీవల అత్యున్నత స్థాయి విద్యా సంస్థలు ( ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్)గా ప్రకటించింది. ఇలా ప్రకటించిన సంస్థలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ రానున్న ఐదేళ్ల కాలంలో రు.వెయ్యి కోట్ల ప్యాకేజితో ఆర్థిక సహాయం అందించి విశిష్ట సౌకర్యాలు కల్పించనున్నారు. దీనితో ఈ సంస్థలకు ఇతర ఐఐటిల కన్నా విస్తృత స్థాయి స్వయం ప్రతిపత్తి లభిస్తుంది. ఆరు కొత్త ఐఐటిలు ఏర్పాటు చేసి రెండేళ్లు పూర్తయినా వీటికి డైరెక్టర్లను నియమించారు తప్ప, ఏ ఒక్కదానికీ గవర్నర్స్ బోర్డులను ఏర్పాటు చేయలేదు. అంతేకాదు ఈ ఐఐటిలలో కీలక విభాగాలలో బోధనా సిబ్బంది కూడా లేరు. దీనితో ప్రభుత్వం గతంలో వున్న ఐఐటిలనుకొత్త ఐఐటిలకు మెంటార్ (నిర్వాహకుడి)గా నియమించింది. అంటే ఇప్పుడు మెంటార్ ఐఐటిలకు చెందిన బోధనా సిబ్బందే కొత్త ఐఐటిలలో కూడా విద్యాబోధన చేస్తూ ద్విపాత్రాభినయం చేయాల్సి వుంటుంది. అంతే కాదు కొత్త ఐఐటిల బడ్జెట్ అవసరాలను కూడా మెంటార్ ఐఐటిలే తీర్చాల్సి వుంటుంది. అంటే సిబ్బంది వేతనాలు, మౌలిక వసతుల నిర్మాణ ఖర్చులు మినహా ఇతర అవసరాలకు ఐఐటిలే అంతర్గతంగా వనరులను సమకూర్చుకోవాల్సి వుంటుంది. నిర్దిష్టమైన వృత్తి నైపుణ్య కోర్సుల నిర్వహణను అత్యధిక ఫీజులు వసూలు చేయటం, లేదా పాత విద్యార్థుల నిధి నుండి వనరులు సమకూర్చుకోవటం లేదా కెనరాబ్యాంకుతో కలిసి కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ కొత్తగా

"ఈ బిల్లు ముసాయిదా తీరు తెన్నులు పరిశీలిస్తే విద్యారంగంపై అదుపుకోసం ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు స్పష్టమౌతున్నది. ప్రస్తుతం 'స్వయం ప్రతిపత్తి' కలిగిన సంస్థలన్నీ ఈ బిల్లు ద్వారా ప్రతిపాదిత హెచ్ఇసిఐ పరిధిలోకి వస్తాయి. హెచ్ఇసిఐపై ప్రభుత్వ పూర్తి ఆజమాయిషీ వుంటుంది."



ఉన్నత విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు

ఏర్పాటు చేసిన ఉన్నత విద్యారంగ ఆర్థిక సంస్థ (హెచ్ఇఎఫ్ఎ) నుండి రుణాలు తీసుకోవటం వంటి చర్యలు తీసుకోవాల్సి వుంటుంది. ఇదిలా వుండగా ఐఐటిలు తమ సిబ్బంది వేతనాలను 40 శాతం మేర పెంచాలని మానవ వనరుల మంత్రిత్వశాఖ వత్తిడి తెస్తోంది. అయితే అత్యధిక పోటీ కలిగిన జాతీయ స్థాయి పరీక్షలలో విజయం సాధించి ఈ సంస్థల్లో చేరిన విద్యార్థుల మాటేమిటి? ఈ అంశాన్ని ఎవరూ పట్టించుకోవటం లేదు.

### ప్రత్యక్ష నియంత్రణ కోసమే

ఈ బిల్లు ముసాయిదా తీరు తెన్నులు పరిశీలిస్తే విద్యారంగంపై అదుపుకోసం ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు స్పష్టమౌతున్నది. ప్రస్తుతం 'స్వయంప్రతిపత్తి' కలిగిన సంస్థలన్నీ ఈ బిల్లు ద్వారా ప్రతిపాదిత హెచ్ఇసిఐ పరిధిలోకి వస్తాయి. హెచ్ఇసిఐపై ప్రభుత్వ పూర్తి ఆజమాయిషీ వుంటుంది. హెచ్ఇసిఐ ఏర్పాటయితే ఇప్పటి వరకూ యుజిసి చట్టం ద్వారా యూనివర్శిటీలకు లభిస్తున్న రక్షణ అంతా కనుమరుగవటమే కాక యూనివర్శిటీ వ్యవహారాలలో రాజకీయ జోక్యం కూడా పెరుగుతుంది. యూనివర్శిటీల స్వయం ప్రతిపత్తిని విస్తరిస్తామంటున్న ప్రభుత్వం వాటిని తమ ఆధీనంలోకి తీసుకుంటుంది. ఈ బిల్లు ద్వారా విద్యారంగంపై ఆజమాయిషీ కోరుకుంటున్న ప్రభుత్వం విద్యా సంస్థల స్వయం ప్రతిపత్తి పేరిట తన బాధ్యతలను విస్మరిస్తూ నిధుల కేటాయింపునకు గండి కొడుతుండటం గమనార్హం. ఉన్నత విద్యాసంస్థలలో నాణ్యమైన విద్యను కేవలం తగిన ఆర్థిక స్వయం ప్రతిపత్తి ద్వారా మాత్రమే అందించగలం. విద్యాబోధన, విద్యా పరిశోధనలు విడిపోతే పరిశోధనల ప్రక్రియ అంతా మానవ వనరుల మంత్రిత్వశాఖ పరిధిలోకి వస్తుంది. ఉన్నత విద్యాసంస్థలకు నిధుల కేటాయింపు అంతా ఆయా సంస్థలు ప్రభుత్వ రాజకీయ అజెండాను అనుసరించటం ఆధారంగా వుంటుంది. ఇప్పటికే ఐఐటిల విషయంలో ఈ వైఖరి సుస్పష్టంగా తెలుస్తోంది. ఐఐటి ఢిల్లీలో వున్న గ్రామీణాభివృద్ధి సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం (సిఆర్‌డిటి) పంచగవ్య (గోశాస్త్రం)పేరిట జాతీయ కార్యక్రమాన్ని ప్రచారం చేస్తూ, తమ బూటకపు పరిశోధనలకు నిధులను పొందుతోంది. దీనితో ఇతర విభాగాలన్నీ నిధుల కొరతను ఎదుర్కొంటున్నాయి. 2015 నుండి అమలులోకి వచ్చిన జాతీయ విద్యావిధానాన్ని పరిశీలిస్తే ఇందులో అంశాలను ప్రాతిపదికగా తీసుకుని ప్రభుత్వం విద్యారంగంలో మార్పులకు తెర తీస్తోందని, ఇందులో భాగంగానే ప్రతిపాదిత హెచ్ఇసిఐ చట్టాన్ని తెస్తోందని నిపుణులు చెబుతున్నారు. యుజిసి స్థానంలో ప్రత్యామ్నాయాన్ని ప్రవేశపెట్టడం కన్నా చట్టం రద్దును గట్టిగా సమర్థించుకునేందుకే ప్రభుత్వం ఈ బిల్లు ద్వారా ప్రయత్నిస్తోందని వారు అభిప్రాయపడుతున్నారు. ❋

మతోన్మాదం

# ఆర్‌ఎస్‌ఎస్ - ఎమర్జెన్సీ

**ఎ.జి. నూరాని**



రచయిత సుప్రీంకోర్టు
విశ్రాంత న్యాయమూర్తి

**ఆర్**ఎస్ఎస్, బిజెపిలోని దాని పరివారం అత్యవసరపరిస్థితి గురించి అలజడి చేయడానికి ఏ స్థిరమైన కేంద్రీకృతమైన అంశం లేదు. తమ సంస్థపై నిషేధాన్ని సడలించడం కోసం కారాగార వాసపు నిబంధన లపై ఇచ్చే వెసులుబాట్ల కోసం దాని నాయకులు కాంగ్రెస్ ముందు పొర్లుదండాలు పెట్టారు.

అత్యవసరపరిస్థితి గురించి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్), దాని రాజ కీయ విభాగమైన భారతీయ జనతాపార్టీ ప్రతి వార్షికోత్సవం నాడు అది చాలా పాపకార్యం అని శాపనార్థాలు పెడుతుంటారు. భాజపా పూర్వ అవతారం అయిన జనసంఘం, తాము ఎమర్జెన్సీ కాలంలో చాలా "త్యాగాలు" చేశామని గొప్పలు చెప్పుకుంటారు.

నాటి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధి దేశంలో అత్యవసర పరిస్థితిని విధిం చడం కేవలం ఒక పొరపాటు కాదు. అది ఒక పాపం. కేవలం వ్యక్తిగత కారణాల వలన చేసిన రాజ్యాంగవ్యతిరేకమైన నేరం. పేరుకి, అలహా బాదు హైకోర్టు తేది 12 జూన్, 1975న ఆమె లోక్‌సభ ఎన్నిక చెల్లదని ఇచ్చిన తీర్పును మాఫీ చేయడానికి, ఆమె ప్రత్యర్థులను కారాగారంలో వేయడానికి, పత్రికలపై నియంత్రణ, ప్రాథమిక హక్కుల రద్దు, లోక్‌సభ కాలపరిమితి పొడిగింపు, మన ప్రజాస్వామ్యాన్ని అణచివేయడానికి 42వ రాజ్యాంగ సవరణను లోక్‌సభలో అతివేగంగా చేయడం, తనపై చట్ట అతిక్రమణ నేరాలను మాఫీ చేసుకోవడం, దేశాధినేతగా రాష్ట్రపతి వ్యవస్థను స్థాపించేందుకు ప్రస్తుత రాజ్యాంగాన్ని తీసివేసేందుకు రాజ్యాంగ సభ ఏర్పాటుచేయడం వంటివి ఉన్నాయి.

కాని, నాటి ఆర్ఎస్ఎస్ అధినేత ఎమ్.డి దేవరస్ ఇందిరాగాంధీతో జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలలో ఎప్పుడూ ఈ నీచమైన చర్యలను ఖండించలేదు, ప్రజాస్వామ్య క్రమాన్ని పునరుద్ధ రించమని కోరనూ లేదు. అదిచాలదన్నట్టు, ఆయన సలహా సూచనలమేరకు ఆర్ఎస్ఎస్ పరివారం జైళ్ల నుండి విడుదల కావడానికి షరతులు లేని పూచికత్తు పత్రాలు రాసిచ్చారు.

నాటి ప్రభుత్వం తయారుచేసిన నమూనా అర్జీలపై ఆర్ఎస్ఎస్‌కు చెందిన నిర్బంధితులు సంతోషంగా సంతకాలు చేశారు. కొందరైతే ఆ నమూనాలు వచ్చేంత వరకైనా ఆగకుండా తమ సొంతభాషలో అనర్గళమైన పూచీపత్రాలు రాసిఇచ్చి జైలు నుండి బయటపడ్డారు.

ప్రభుత్వం ముద్రించిన ముసాయిదా పత్రం ఇలా ఉంది.

**నమూనా - పూచీపత్రం**

నేను శ్రీ -----------నిర్బంధితుని తరగతి-------

కారాగారవాసిని అంగీకార పూర్వకంగా చేయు రాతపూర్వక వాగ్మూలం ఏమనగా, నా విడుదల జరిగిన పక్షంలో, నేను దేశాంతర్గత భద్రతకు, ప్రజలశాంతికి భంగకరమైన పనులు ఏమీ చేయను. అదేవిధంగా, అత్యవసర సరుకుల పంపిణీని నిరోధించే ఏ విధమైన పనిని చేయను. అలానే నేను చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలలో భాగం వహించను. నేను ప్రస్తుత అత్యవసర పరిస్థితికి భంగకరమైన కార్యకలాపాలలో భాగం వహించను."

డి.ఆర్ గోయల్ నవోదు పత్రాలు "మహారాష్ట్రప్రభుత్వం నిర్బంధితులను విడుదల చేయడానికి నిబంధనలతో కూడిన పూచీపత్రా లను కోరింది. ఆర్ఎస్ఎస్, సంఘానికి చెందిన నిర్బంధితులు స్వతంత్ర్యంగా అటువంటి పూచీ పత్రాలు సంతకం చేయడానికి నిర్ణయించు కున్నారు. ఇది జైలులో అలజడి రేపింది.

సోషలిస్టు నాయకులైన భగ్‌తేకర్, బాబు రావు సమంత్, దశరథ పాటిల్ వంటివారు జనసంఘ్ సభ్యులు ఆ పూచీకత్తు పత్రాలపై సంతకం చేయకుండా నిరోధించేలా చేయమని సంఘనాయకుడు మాల్‌గేతో చర్చించేందుకు వెళ్లారు. జైలు వెలుపల ఉన్న ఆర్ఎస్ఎస్, జన సంఘ్ ముఖ్యనేతలు అటువంటి పూచీపత్రాలపై సంతకాలు చేయడం గురించి నిర్ణయం చేశారని మాల్‌గే వాదించారు". (రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్: రాధాకృష్ణ ప్రకాశన్, 2000 పేజీ 141) ఆర్ఎస్ఎస్ అత్యవసర పరిస్థితిని వ్యతిరేకించ లేరు. తనను తాను రక్షించుకొనేందుకు నేరగాళ్లతోనే సయోధ్య తాను కుదుర్చుకుంది.

బంగ్లాదేశ్ యుద్ధం జరిగినప్పటి నుండి ఆర్ఎస్ఎస్ ఇంధిరాగాంధీపట్ల, కాంగ్రెస్ పట్ల ఒక(ఉదాసీనతను) మెతక వైఖరిని పెంచుకొన్నది. 1984 లోక్‌సభ ఎన్నికలలో ఆర్ఎస్ఎస్ కాంగ్రెస్‌ను వ్యతిరేకించలేదు. దాని ప్రథమ వ్యూహకర్త నానాజీ దేశ్‌ముఖ్ రాజీవ్‌గాంధీకి మద్దతు ఇవ్వడాన్ని బహిరంగంగానే సమర్థించారు.

1977, డిసెంబరు 22న ఆనాటి ఆర్ఎస్ ఎస్ అధినేత ఎమ్.ఎస్ గోల్‌వాల్కర్ ప్రధాన మంత్రికి కంపుకొట్టే వేడివేడి పొగడ్తల అభినందన లేఖ రాశారు. "ఈ సాధనలో అధికభాగపు పరపతి మీకే చెందుతుంది". (ఆర్గనైజరు, జూన్ 16, 1973). ఆమె దీనికి అధికారయుతంగా బదులిచ్చారు. ఆర్ఎస్ఎస్ వారు జైలును కోరుకోలేదు. వారు జైలులోకి విసిరివేయబడ్డారు. అత్యవసరపరిస్థితి జూన్ 25,1975న ప్రకటించ బడింది. జూన్ 30న దేవరస్‌ను నిర్బంధంలోకి తీసుకొని జైలుకు పంపించారు. జులై 4న ఆర్ఎస్ఎస్ ఇతర 23 సంస్థలతో పాటు నిషేధిం చబడింది. దీనికి ఆరెస్సెస్ మొదటి స్పందన ఏమిటి?

ప్రధానకార్యదర్శి మాధవరావు మాల్యా సంస్థను రద్దుచేస్తున్నట్లు ప్రకటించారు. అయినప్ప టికీ, ఆర్ఎస్ఎస్ యొక్క నిర్మాణ వ్యవస్థ సజీవం గానే ఉంది. దాని శాఖలు, శిక్షణలు, సమూహ సమావేశాలు, ప్రదర్శన కవాతులు, ఇతర కార్యకలాపాలు నిలిపివేయబడినాయి. వెంటనే కొందరు క్రియా శీలకమైన ప్రచారక్‌లు జైలులోని బాబాసాహెబ్ దేవరస్‌ను సంప్రదించి, నిషేధిం చబడిన తమ సంస్థ యొక్క ఆచరణ ప్రణాళికను

రూపొందిచ డానికి నాటి బొంబాయిలో జులై మాసాంతంలో కలుసుకొన్నారు. ఎల్‌ఎస్‌ఎస్ (లోక్ సంఘర్ష్ సమితి)కి అతి దగ్గరగా ఆర్‌ఎస్‌ఎస్ పనిచేయా లని వారు నిర్ణయించారు. ఆ విధంగా రాజకీయ సంగ్రామాలకు దూరంగా ఉండాలనే ఆర్‌ఎస్ ఎస్ సాంప్రదాయక విధానాన్ని అతిక్రమించారు. ఎల్‌ఎస్‌ఎస్‌తో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాలను సమన్వయపరిచే పనిని నలుగురు జోనల్ ప్రచారకులతో నిర్వహించబడింది. యాదవరావు జోషి (దక్షిణం), రాజేంద్రసింగ్( ఉత్తరం), మోరోపంత్ పిగళె (పశ్చిమం), భావోరావ్ దేవర్స్ (తూర్పు) దానికి అదనంగా రామ్‌బహు గాండ్‌బోలెకి ప్రతిపక్ష పార్టీల నాయకత్వాన్ని సంప్రదించే బాధ్యత, ఏకనాథ్ రాణాదెకి ప్రభుత్వంతో సంబంధాలు నెరపే బాధ్యత అప్పగించబడ్డాయి. మునుపటి నిషేద సమయం 1948–49లోను రాణాదేకి అదే బాధ్యత అప్పగించబడింది. ఇదే సమా వేశంలో నిషేదిత సంస్థ తదనంతర కార్యాచరణను ఈ విధంగా రూపొందించడం జరిగింది. (ఎ) స్వయంచాలక్‌ల విశ్వాసం నిలిపేందుకు ఏదో ఒక రూపంలో సమావేశ కూటములను నిర్వహించడం. (బి) రహస్య సమాచార పత్రికను స్థాపించడం: (సి) దేశ వ్యాప్తంగా సత్యాగ్రహ సన్నాహలు, రాజకీయాలతో సంబంధంలేని ప్రముఖులు అల్పసంఖ్యాక తరగతుల ప్రజల ప్రముఖ ప్రతినిధులతో సంబంధాలను ఏర్పరచడం (డి) ఎల్‌ఎస్‌ఎస్ రహస్య కార్యకలలోని ఆర్‌ఎస్‌ఎస్‌కు విదేశాలలోని భారతీయుల ఆర్థిక మద్దతును సమీకరించడం. ఏదీఏమైనప్పటికీ చాలామంది విమర్శకులు, ఆర్‌ఎస్‌ఎస్ ఇందిరాగాంధీతో పోరాడేకంటే సర్దుబాటుకే ప్రాధాన్యత నిచ్చిందని విశ్వసిస్తారు.” (ప్రళయ్ కనంగో, ఆర్‌ఎస్‌ఎస్ ట్రైస్ట్ విత్ పోలిటిక్స్”) మనోహర్ 2003, పుటలు 193–194)

మరొక సందర్భం: దేవరస్ వారసుడు రాజేంద్రసింగ్‌తో జరిపిన ముఖాముఖిలో నమోదు చేయబడిన వివరాల ఆధారంగా. “ఆర్‌ఎస్‌ఎస్ నాయకత్వ తొలిస్పందన జాగరూకతతో కూడిన వేచిచూచే విధానం. ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలను పెద్ద సంఖ్యలో నిర్బంధంలోకి తీసుకోవడం మొదలవగానే, జయ ప్రకాష్ నారాయణకు మద్దతుగా ఎల్‌ఎస్‌ఎస్ విభాగంతో దగ్గరగా కలిసి పని చేయడానికి ఆర్‌ఎస్‌ఎస్ స్వయంగా సంసిద్ధత వ్యక్తం చేసింది. ఆ విధంగా రాజకీయ పోరాటాలనుండి దూరంగా ఉండాలనే ఆర్‌ఎస్‌ఎస్ సాంప్రదాయానికి తిలోదకాలిచ్చింది. నిర్బందంలోని బాబాసాహెబ్ దేవరస్‌ను సంప్రదించిన

> **“దేవరస్ లేఖ ముగింపు ఇలా ఉంది: దయచేసి సంఘ్ విషయాన్ని పక్షపాత రహితంగా తిరిగి ఆలోచించమని నేను అభ్యర్థిస్తున్నాను. ఆర్‌ఎస్‌ఎస్‌పై విధించిన నిషేధాన్ని రద్దు చేయవలసిందిగా హృదయపూర్వకంగా ప్రార్థిస్తున్నాను.”**

తరువాత ప్రముఖ ప్రచారక్‌లు జులై మాసాంతంలో బొంబాయిలో జరిపిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకోబడింది. ఇతర పార్టీలతో కలిసి ఆర్‌ఎస్‌ఎస్ పనిచేయడాన్ని సమన్వయ పరిచే ప్రాథమిక బాధ్యతను వహించడానికి నలుగురు జోనల్ ప్రచారకులను నియమించాలి. యాదవరావు జోషి (దక్షిణం), రాజేంద్రసింగ్ (ఉత్తరం) మోరాపంత్ పింగళె (పశ్చిమం), బావొరావు దేవర్స్ (తూర్పు) ఇంకా అదనంగా జనసంఘం బీహార్, పశ్చిమబెంగాల్ కార్యనిర్వాహక కార్యదర్శి రాంబాబు గాడ్‌బొలె ప్రతిపక్ష రాజకీయ నాయకులతో సంబంధాలు నెలకొల్పవలసిందిగా సూచించబడింది. మోరొపంత్ పింగళె ఎల్‌ఎస్‌ఎస్‌తో కార్యకలాపాలను సమన్వయపరచడం, దేశవ్యాప్తంగా సత్యాగ్రహ కార్యక్రమాన్ని నిర్వహించడం, ఏకనాద్ రాందే వివేకానంద్ కేంద్ర అధిపతి ప్రభుత్వంతో సంప్రదింపులు జరపడం– బొంబాయిలో జరిగిన జులై మాసాంతపు సమావేశంలో రహస్యంగా పనిచేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ ......లక్ష్యాలను స్థాపించింది. 1) స్వయం సేవకుల ఆత్మవిశ్వాసాన్ని నిలిపేందుకు వారు కలుసుకొనే అవకాశాలను కల్పించడం (ఉదా. ప్రార్థనా సమావేశాలు, ఆటల పోటీల నిర్వహణమొదలగునవి) 2) రహస్య ప్రచారపత్రికను స్థాపించడం దాని పంపిణీ వ్యవస్థను ఏర్పాటు చేయడం. 3) దేశ వ్యాప్తంగా సత్యాగ్రహకార్యక్రమాలు సిద్ధపరచడం, రాజకీయంతో సంబంధంలేని ప్రముఖ వ్యక్తులతో, అల్పసంఖ్యాక వర్గాల ప్రజల ప్రముఖ వ్యక్తులో సంబంధాలు స్థాపించడం (4) ఎల్‌ఎస్ ఎస్ రహస్య కార్యకలాపాలలోని ఆర్‌ఎస్‌ఎస్‌కు విదేశాలలోని భారతీయులు ఆర్థిక మద్దతును సంపాదించడం. ఈ చివరి లక్ష్యాన్ని సాధించడానికి, అత్యవసరపరస్థితి విధించిన వెంటనే యుఎస్‌లో స్థాపించబడిన ఇండియన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థను ఆర్‌ఎస్‌ఎస్ వినియోగించుకున్నది. 1976 నవంబరులో ఫ్రెండ్స్ ఆఫ్ ఇండియన్ సొసైటి ఇంటర్నేషనల్ ఇంగ్లాండులో స్థాపించబడి విదేశాలలోని స్వయం సేవకుల సమీకరణకు తోడ్పడింది.” (వాల్టర్ కె. ఆండ్రసన్, సిద్ధార్థ డి. దాంలై ది బ్రదర్‌హుడ్ ఇన్ సాఫ్రన్. విస్థార్ పబ్లికేషన్, ఎస్‌ఎజి 1987 పుట 212).

**ఇందిరాగాంధీకి దేవరస్ లేఖలు:**

ఇది దేవరస్ ఇందిరాగాంధీకి, నాటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఎస్‌బి చవాన్‌కు, “సర్కారి సంత్” వినోభాభావేకీ లేఖాస్త్రాలు సంధిస్తున్న సమయం. చవాన్ ఈ లేఖలు మరి ఇతరుల లేఖలు అన్నీకలిపి మహారాష్ట్ర శాసనసభ ముందు ఉంచారు.

ఆగస్టు 22, 1975న దేవరస్ ఇందిరా గాంధీకి వ్రాసిన మొట్టమొదటి లేఖ ఇలాఉంది. “ఆగస్టు 15, 1975న ఎర్రకోట, ఢిల్లీ నుండి మీరు చేసిన ప్రసంగాన్ని నేను ఆకాశవాణి ద్వారా విన్నాను. ఆ ప్రసంగం సమతుల్యంగా, సందర్భోచితంగా ఉన్నది. అది నన్నుఈ ఉత్తరం వ్రాయడానికి పురికొల్పింది. (ఎప్పటిలానే కృత్రిమ ఉత్సాహం, అసత్యమయం)


“ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం హిందూ సమాజాన్ని సమైక్యపరిచి దీనిని నడిపించడం.. ఆర్‌ఎస్‌ఎస్‌ను మతపరమైన సంస్థగా ఆరోపించేవారు ఉన్నారు. ఇది నిరాధారమైన ఆరోపణ. ఈనాటికీ సంఘ్ యొక్క కార్యక్రమాలు హిందూ సమాజం వరకే పరిమితమైనాయి. హిందువేతరులకు వ్యతిరేకంగా సంఘ్ ఎప్పుడూ బోధలు చేయలేదు. సంఘ్ ముస్లింల వ్యతిరేకి అన్నది నిర్ధంద్వంగా తప్పు విషయం. మేము ఎప్పుడు ఇస్లాం, మహ్మద్, ఖురాన్, క్రిష్టియానిటి, క్రీస్తు లేదా బైబిల్ గురించి అనుచితమైన పదం ఉపయోగించలేదు.”

ఎమ్‌ఎస్ గొల్‌వాల్కర్ రచనలైన “వియ్ అండ్ అవర్ నేషన్ హుబడ్ డిఫైన్‌డ్” “బంచ్ ఆఫ్ థాట్స్” ఈ నిరాకరించడంలోని మోసాన్ని వెల్లడిస్తాయి.

దేవరస్ లేఖ ముగింపు ఇలా ఉంది. “దయచేసి సంఘ్ విషయాన్ని పక్షపాతరహితంగా తిరిగి ఆలోచించమని నేను అభ్యర్థిస్తున్నాను. ఆర్‌ఎస్‌ఎస్‌పై విధించిన నిషేదాన్ని రద్దుచేయ

**"(సంఘ్‌పై గల నిషేధాన్ని ఎత్తివేసిన పక్షంలో) ప్రధానమంత్రి సారథ్యంలో దేశ ప్రగతి, అభివృద్ధికి సంబంధించిన ప్రణాళిక, కార్యాచరణలో సంఘ్ స్వచ్ఛంద సేవకులు పాల్గొనడానికి అవకాశం కలుగుతుంది."**


ఇందిరాగాంధీ


వినోభాభావే


బాలాసాహెబ్ దేవరస్

వలసినదిగాహృదయపూర్వకంగా ప్రార్థిస్తున్నాను." అత్యవసర పరిస్థితినిగాని, కారాగారాలలో ఉన్న ఇతరుల విడుదల గురించి గాని ఒక్కమాటైన లేదు. ఈ ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ ఎల్ఎస్ఎస్ సభ్యులు, వారితో కలిశామని చెప్పుకునే ఆర్ఎస్ఎస్, దాని ముఖ్యుడు నానాజి దేశ్‌ముఖ్‌ల నేతృత్వంలో నిర్వహించబడ్డాయి. ఇందిరాగాంధీ అతనిని, అతని లేఖలను ఖాతరు చేయలేదు. దేవరస్ జులై 15, 1975న ఎస్.బి చవాన్‌కు రాసిన మొదటి లేఖలో ఈ విధంగా ఉంది. "సంఘ్ ప్రభుత్వానికిగాని లేదా సమాజానికి గాని వ్యతిరేకంగా రవ్వంతైనా ఏది చేయలేదు. సంఘ్ కార్యక్రమంలో అటువంటి విషయాలకు తావులేదు. సంఘ్ కేవలం సాంఘిక, సాంస్కృతిక అంశాలను మాత్రమే ప్రోత్సహిస్తున్నది.

**కపటపు ముసుగు తొలగింపు...**

ఒక చాడీకోరు న్యాయవాది, ఆర్ఎస్ఎస్ వ్యక్తి, అతని అధినేత ఆజ్ఞల ప్రకారం స్పష్టంగా నడుచుకొనే ఒక న్యాయవాది, కపటపు ముసుగు తొలిగించాడు. అది ఎవరిచేతంటే వివిఎన్ ఖైదా ఖైదీ నెం 2181. నాసిక్ కేంద్రకారాగారం, తేది జులై 12,1976 ముఖ్యమంత్రి చవాన్‌కు వ్రాయబడినది. "ఏడు నెలలక్రితం 60 సంవత్సరాలు దాటిన ఆరోగ్యం సరిగా లేని వారైన కారాగార వాసులను విడుదల చేయాలని మీరు అభిప్రాయం వ్యక్తం చేశారు. దానిని ననుసరించి, అటువంటి నిర్బంధితుల జాబితా తయారు చేయబడింది. ఆపై విచారించిన మీదట వారు అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా ఏమి చేయబోమని ఒక పూచి పత్రం కూడా రాసి ఇచ్చినట్లుగా తెలిసింది. అటువంటి 60 సంవత్సరాల వయసు నిండినవారు 150 మంది నిర్బంధితులలో కేవలం 10 నుండి 12 మందిని మాత్రమే విడుదల చేయడం జరిగింది. నా సూచనమేరకు ఆ విధమైన మినహాయింపు మరికొందరు 60 సంవత్సరాలు నిండిన నిర్బంధితులకు ఇవ్వడం జరిగింది. నేను నా మునుపటి లేఖలో ప్రస్తావించిన విధంగా పూచీపత్రం ఆధారంగా నిర్బంధితులను విడుదల చేయడం ఇరు పక్షాలను సంతృప్తి పరచాలి. పూచీపత్రంలో ఉపయోగించిన పదజాలంలో 'మంచి ప్రవర్తన' అన్న పదం ఉపయోగించడం సరైనది కాదు. దీనిని మీరు అంగీకరించి ఆ పదాలన్నీ తొలగిస్తారని నేను ఆశిస్తున్నాను.

"జులై 6, 1975 రూల్ నెం. 33 డిఫెన్స్ ఆఫ్ ఇండియా యాక్టు ఆర్ఎస్ఎస్‌పై ప్రయోగించబడింది. దీనికి కొనసాగింపుగా ఆర్ఎస్ఎస్ కార్యవర్గ బాధ్యులు సంఘ్ అన్ని కార్యక్రమాలను రద్దుచేస్తూ ప్రకటన చేశారు. అందువలన, విడుదలకు ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలలో పాల్గొనరాదు అనే నియమం అవసరం లేదు. వాస్తవానికి ఈ లేఖ వ్రాయడంలోని అవసరం ఇదే. ఈ ప్రశ్న గురించి అవసరమైన ఆలోచన చేస్తారని నేను ఆశిస్తున్నాను. దానిని బట్టి మా విధానం స్పష్టమవుతుంది. నేను ఈ అభ్యర్థనను ప్రభుత్వంపై ఎటువంటి వ్యతిరేక భావనను లేకుండానే చేస్తున్నాను. ఎందరో ప్రజలు సమాజం మంచికొరకు పనిచేయాలని భావిస్తున్న ప్రేరణను ప్రభుత్వం ఉత్తమంగా వినియోగించు కోవలసింది.దేశం దీనినుండి బహుళమైన లబ్ధిని పొందుతుంది".

ఆర్ఎస్ఎస్ పూచిపత్రం ఇవ్వడానికి తహతహలాడుతోంది. కేవలం పదాలు మాత్రమే సర్దుబాటు కావాలి– వి.డి సావార్కర్ చే వలస రాజ్య ప్రభుత్వానికి ఇవ్వబడిన చాలా పాదాక్రాంతమైన పూచీపత్రాల ఛాయలు.

వినోభాభావే ప్రధానమంత్రితో సమావేశం అవుతున్న సందర్భంగా దేవరస్ వినోభాబావేకీ వ్రాశాడు. ("గౌరవనీయ ఆచార్య వినోభాజీ పాదపద్మములకు") ప్రధానమంత్రికి సంఘ్ గురించి ఉన్న తప్పు అభిప్రాయాన్ని తొలగించేందుకు మీరు ప్రయత్నించాలని, మీకు నా ప్రార్థన. దీని పర్యవసానంగా ఆర్ఎస్ఎస్ స్వచ్ఛంధ సేవకులు విడుదల చేయబడతారు. సంఘ్‌పై గల నిషేదం ఎత్తివేయబడుతుంది. ఆ పరిస్థితి ప్రధానమంత్రి సారథ్యంలో దేశ ప్రగతి, అభివృద్ధికి సంబంధించిన ప్రణాళిక కార్యాచరణలో సంఘ్ స్వచ్ఛంద సేవకులు పాల్గొనడానికి అవకాశం కలుగుతుంది" (డిఆర్ గోయల్, రాష్ట్రీయ స్వయాసేవక్ సంఘ్: రాధాకృష్ణ ప్రకాషన్, కొత్త ఢిల్లీ, 2000, పుట 279) మళ్లీ, అత్యవసర పరిస్థితి తొలగింపు, జయప్రకాష్ నారాయణ్, ఇతర ఖైదీల విడుదల గురించి ఒక్కపదమైనా లేదు.

జయప్రకాష్ నారాయణ్‌చే 1946లో స్థాపించబడి ఆయన విశ్వాసపాత్రమైన సోషలిస్టు అనుచరుడు డాక్టర్ జి.జి పాజ్ సంపాదకత్వంలో నడిచే జనతా పత్రికలో బాబా అధవ్ మరింతగా ఆర్ఎస్ఎస్ నిజస్వరూపాన్ని బహిర్గతం చేశారు. ఆయన 94 సంవత్సరాల వయసులో జనతాకు సంపాదకత్వం వహిస్తూ మహారాష్ట్రలోని పన్‌వెల్‌లో తారాలోని ఆదివాసీ ప్రజలకొరకు యూసఫ్ మెహరల్లి సెంటర్ కార్యకలాపాలను చురుకుగా పర్యవేక్షిస్తుంటారు. బాబా అధవ్ వెల్లడిచేసిన విషయాలు సెక్యులర్ డెమోక్రసీలో కనిపిస్తాయి. (ఆగస్టు 1977, పుట 40–41, జనత, సెప్టెంబరు 16, 1979 పుట 3, 4, 15, 16) ఈ క్రింది అంశాలుగా వీటిలోని భాగాలను ఉటంకించడం జరిగింది. అధవ్ తాను కూడా కారాగారంలో ఉన్నాడు. అలానే, డాక్టర్ జి.జి. పరిక్ యర్రవాడ జైలులో ఉన్నాడు. అతడే జైలు నుండి ఆర్ఎస్ఎస్ ఇచ్చిన పూచీ పత్రాలకు ప్రత్యక్ష సాక్షి.

బాబా అధవ్ ఇలా రాశారు. " మహారాష్ట్ర

లోని యరవాడ జైలులో పూచీపత్రాలు లేదా అభ్యర్థనలు సంతకం చేయడానికి సన్నద్ధమయ్యారా అని ఖైదీలను అడుగుతూ ముసాయిదా అభ్యంతర పత్రాలు మూడు లేదా నాలుగుసార్లు పంపిణీ చేయబడినాయి. ఆ విధంగా చేయడానికి ఆర్‌ఎస్‌ఎస్ ఖైదీలు అత్యధికులు తమ ఆమోదాన్ని తెలియజేస్తూ సంతకాలు చేయడాన్ని నాకళ్లారా నేను చూశాను. అత్యవసర పరిస్థితి కాలంలో పూనే దినపత్రిక తరుణ్‌భరత్ "సంజయ్ గాంధీ ప్రత్యేక సంచికను" వెలువరించింది.

ఆనాటి ఇంకొక సాక్షి బ్రహ్మదత్, చరణ్ సింగ్ భారతీయ లోక్‌దళ్" సభ్యుడు. అతను కూడా అత్యవసరపరిస్థితిలో కారాగారంలో వున్నాడు. ఆర్‌ఎస్‌ఎస్ మతభ్రష్ట ప్రవర్తనకు సాక్షిగా ఉన్నాడు. ఆయన రాసిన పుస్తకం "ఫైవ్ హెడెడ్ మాన్‌స్టర్" (సర్జ్ పబ్లికేషన్స్, న్యూఢిల్లీ, 1978)లో చాప్టర్ 4లో "ఆర్‌ఎస్‌ఎస్ రెండు ముఖాలు" గురించి ఆయన ఇలా రాశారు. ఏప్రిల్ 4 1976 న సంజయ్‌గాంధీ లక్నోలో చేసిన ప్రసంగం పాంచజన్యలో వార్తగా ప్రచురించింది. అందులో (సంజయ్ గాంధీ యువతకు ధనికుల పీడనన ఉండి సామాజికంగా ఉన్న అట్టడుగు వర్గాలను విముక్తి చేయాలని ఒక పిలుపు నిచ్చాడు. ఆ పత్రిక సంపాదకుడు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్‌డి తివారిని ఆయన తీసుకున్న వివిధ చర్యలు గురించి అభినందిస్తూ రాశారు.

"ఒక ముఖ్యమైన పత్రం దానిలో మూడు లేఖలు ఉన్నాయి. అందులో రెండు సర్ సంఘ్‌చాలక్, బాలాసాహెబ్ దేవరస్ యరవాడ సెంట్రల్ జైల్, పూనే నుండి ఇందిరాగాంధికి రాసినది. ఆ లేఖలో ఆర్‌ఎస్‌ఎస్ స్వచ్ఛంధ సేవకులు ప్రభుత్వానికి సహకరిస్తారని అందుకు ప్రతిగా సంస్థపై నిషేధాన్ని ఎత్తివేయాలని, సంస్థ సభ్యులను కారాగారాల నుండి విడుదల చేయాలని ఉంది. ఆర్‌ఎస్‌ఎస్‌లోని ఉన్నత అధికారి సంస్థ తరుపున ఆ విధమైన లేఖ రాస్తే, మిగిలిన వారి గురించి చెప్పుకోవలసింది ఏమీ ఉండదు. బాలా సాహెబ్ వినోభాజీకి కూడా లేఖ రాశారు. అందులో ఆర్‌ఎస్‌ఎస్ గురించి ఇందిరాజీకి ఉన్న అపార్థాన్ని తొలగించి, కారాగారాలలోని స్వచ్ఛంధ సేవకులను విడుదల చేయించాలని, అలా చేస్తే వారు ఇందిరాజీ ప్రారంభించిన అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆ తరువాత ఆయన మహరాష్ట్ర ముఖ్యమంత్రి ఎస్.బి చవాన్‌ను అభ్యర్థిస్తూ లేఖ రాశాడని వెల్లడైంది. అందులో ఇందిరాజీతో చవాన్‌కుగల పలుకుబడిని ఉపయోగించి ఆర్‌ఎస్‌ఎస్‌పై నిషేదం ఎత్తివేయాలని కోరాడు. ఈ సమాచారం లేఖల

> **"ఒక ముఖ్యమైన పత్రం దానిలో మూడు లేఖలు ఉన్నాయి. అందులో రెండు సర్ సంఘ్‌చాలక్, బాలా సాహెబ్ దేవరస్ యరవాడ సెంట్రల్ జైల్, పూనే నుండి ఇందిరాగాంధికి రాసినది. ఆ లేఖలో ఆర్‌ఎస్‌ఎస్ స్వచ్ఛంద సేవకులు ప్రభుత్వానికి సహకరిస్తారని అందుకు ప్రతిగా సంస్థపై నిషేధాన్ని ఎత్తివేయాలని, సంస్థ సభ్యులను కారాగారాల నుండి విడుదల చేయాలని ఉంది."**



జయప్రకాష్ నారాయణ

నకలులతో సహా మహా రాష్ట్ర శాసనసభ ముందు అక్టోబరు 18, 1977న ఉంచబడినవి. బాపురావు మోఘ ఈ లేఖలు రాసిన విషయాన్ని జులై 24, 1977 నాటి తన పాంచజన్యలో ధృవపరిచారు. ఆయన ఈ విధంగా కూడా రాశారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రభుత్వం తో చర్చలు జరపాలని కోరుకున్నది. కాని, ప్రభుత్వం దానికి బదులు ఇవ్వలేదని", తేది జులై , 1976న ప్రతిపక్ష పార్టీల నాయకులు కొత్త ఢిల్లీలో కలుసుకున్నారు. ఆ సమావేశపు సంగ్రహ వివరణ 4వ పేరాలో ఇలా ఉంది. "చౌదరి చరణ్‌సింగ్ ఆర్‌ఎస్‌ఎస్ గురించి ప్రశ్న లేవనెత్తారు. కొత్త పార్టీలో ఏ ఆర్‌ఎస్‌ఎస్ స్వచ్ఛంద కార్యకర్త చేరరాదు, కొత్త పార్టీలోని ఏ సభ్యుడు ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరరాదన్నది తన దృఢమైన విశ్వాసమని ఆయన చెప్పాడు. ఇది ద్వంద్వ సభ్యత్వానికి సంబంధించిన ప్రశ్న. అది కొత్త పార్టీలో ఏ విధమైన మూఢత్వపు పని జరగడానికి అవకాశం ఇవ్వరాదన్నది". ఇది నేరుగా చేసిన సవాలు. సనసంఘ్ తరపున ఒ.పి త్యాగి మాట్లాడారు".

"కొత్త పార్టీ ఏ నియమాలు తగినవని భావిస్తే వాటిని ఏర్పాటు చేయవచ్చు. ప్రస్తుతం ఆర్‌ఎస్‌ఎస్ నిషేదంలో ఉంది. రద్దుచేయబడి ఉంది". ఆ తరువాత సంవత్సరానికి ఆర్‌ఎస్‌ఎస్, జనసంఘ్ నాయకులు ఈ హామీ నుండి వెనక్కు మళ్లారు. తమకు తాము అత్యవసరపరిస్థితి కాలంలో తాము నిర్వహించిన వీరోచిత పాత్ర గురించి చెప్పుకోవడం ప్రారంభించారు.

ఈ రోజు ఆర్‌ఎస్‌ఎస్ సేవకులు, భక్తులు ఫాసిజం గురించి మాట్లాడుతున్నారు. ఇటాలియన్ పండితుడు మార్జియ కాసొలరి చారిత్రక పత్రాల ఆధారంగా వ్రాసిన పుస్తకంలో ఏమి ఉందో చదవండి. "తేది మార్చి 31, 1934న మూన్‌జి, హెడ్గెవర్, లాలు గోఖలేల మధ్య ఒక సమావేశం ఏర్పాటు చేయబడింది. ఆ సమావేశంలో చర్చించిన అంశం హిందువులను ఇటలీ, జర్మనీ విధానంలో ఏ విధంగా వ్యవస్థీకరించాలి అన్న అంశం: లాలు – మంచిది మీరు హిందుసభ అధ్యక్షులు మీరు హిందువులను సంఘటిత పరచడం గురించి మాట్లాడుతున్నారు. హిందువులను వ్యవస్థీకరించడం ఎప్పటికైనా సాధ్యమవుతుందా".

"నేనంటాను – మీరు అడిగిన ప్రశ్నగురించి నేను కూడా చాలాకాలం నుండి ఆలోచిస్తున్నాను. హిందు ధర్మశాస్త్రాల ఆధారంగా ఒక విధానాన్ని ఆలోచించాను. అది భారతదేశం అంతటా హిందూయిజాన్ని స్థిరీకరిస్తుంది. కానీ ఒక విషయం ఏమంటే మనకూ మనదైన ఒక స్వరాజ్యం పాతకాలపు శివాజీ లేదా నేటికాలపు ముసోలిని లేదా హిట్లర్ వంటి నియంతతో ఏర్పరచుకోనంతవరకు ఈ భావన ఆచరణలోకి సాధ్యంకాదు. కాని అటువంటి నియంత భారత దేశంలో ఉద్భవించేవరకు చేతులు ముడుచుకొని కూర్చోమని అర్థంకాదు. మనం ఒక శాస్త్రీయమైన విధానం తయారుచేసుకొని దీనిని ముందుకు తీసుకుని పోవాలి" (మార్జియ కొసొలరి' ఇన్‌ది షేడ్ ఆఫ్‌ది స్వస్టిక్, 2011, పుట 78)

ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగం ఆర్టికల్ 12 లోనే సర్ సంఘచాలక్‌ను తన నియంతగా ("మార్గదర్శి, తాత్వికుడు") తన వారసుడిని తానే నియమించుకునే అధికారంతో చేసింది. "ఫాసిజానికి ఉండే కుటిలత్వమే ఇది. అదేదో ఆర్‌ఎస్‌ఎస్ నోటి నుండో లేక అది సృష్టించిన బిజెపి నోటి నుండో వచ్చింది కాదు. ❋

**కమ్యూనిస్టు ప్రణాళిక 170వ వార్షికోత్సవ ప్రత్యేకం**

# 21వ శతాబ్దంలో కమ్యూనిస్టు ప్రణాళిక

**పాల్‌యం స్వీజీ, జాన్ మాగే, జాన్ బెల్లమి ఫాస్టర్**

**మంత్లీ రివ్యూ పత్రిక వ్యవస్థాపకుడు దీర్ఘకాలం దాని సంపాదకుడైన పాల్ యం.స్వీజీ (1910-2004) "కమ్యూనిస్టు ప్రణాళిక" 150వ వార్షికోత్సవం సందర్భంగా ఒక వ్యాసం వ్రాశారు. "కమ్యూనిస్టు మ్యానిఫెస్టో-నేడు" శీర్షికతో 1988 మేనెల మంత్లీ రివ్యూ సంచికలో ఆ వ్యాసం ప్రచురించబడింది. ప్రణాళిక 170వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఒక వ్యాసం తయారు చేయవలసిందిగా మా వియత్నాం మిత్రులు కోరారు. వారి అభ్యర్థన మేరకు జాన్ మాగే మరియు జాన్ బెల్లమీ ఫాస్టర్‌లు గతంలో స్వీజీ పేర వెలువడిన వ్యాసాన్ని పునర్లిఖించారు. సారాంశం చెడకుండా ప్రారంభం, ముగింపును వర్తమాన పరిణామాలకు అనుగుణంగా తాజాపరిచారు. ఈ వ్యాసానికి ఒక కొత్త శీర్షిక (21వ శతాబ్దిలో కమ్యూనిస్టు ప్రణాళిక)పెట్టి పై ముగ్గురు రచయితల పేర వెలువరించారు.**

**-ఎడిటర్స్, మంత్లీ రివ్యూ.**

**పెట్టుబడిదారీ సంక్షోభం:**

1848లో కమ్యూనిస్టు ప్రణాళిక వ్రాసే నాటికి, గడచిన దశాబ్దకాలంగా యూరప్ ఖండాన్ని అంతులేని సంక్షోభం కమ్మేసింది. నేడది ప్రపంచవ్యాపితంగా పెట్టుబడిదారీ వ్యవస్థనే చుట్టుముట్టింది. కారల్‌మార్క్స్, ఫెడరిక్ ఎంగెల్స్‌లు ఈ అంశంపై ఇలా చెప్పారు. "కాలానుగుణంగా ఆవృత్తమయ్యే ఈ వాణిజ్య సంక్షోభాలు ప్రతిసారీ మరింత ప్రచండ రూపంలో పునరావృతమౌతుంటాయి. "మొత్తం బూర్జువా సమాజమంతటా ఆ సంక్షోభం వ్యాపించి వుంటుంది. ఆ పరిణామక్రమం ఈ కాలానికీ వర్తిస్తుంది. పెట్టుబడిదారీ సంక్షోభం ఒక రుగ్మత. ఆ రుగ్మతలకు మూల కారణాలను వారు ఇలా వ్యక్తీకరించారు. "ఈ సంక్షోభాలు అంటువ్యాధుల్లా ప్రబలుతాయి. గడచిన యుగాలన్నింటా 'అధికోత్పత్తి' అనబడే అంటువ్యాధి ప్రబలడమే ఈ సంక్షోభాలకి మూలం." అధికోత్పత్తి యుగంలో నేటికీ బూర్జువా ఆర్థికవేత్తలు ఈ అంశాన్ని అర్థం చేసుకోలేదు. భవిష్యత్‌లో అర్థం చేసుకోగలరని ఆశించలేము.

ఈ పెట్టుబడిదారీ సంక్షోభం, తీవ్ర మాంద్యం 2007-08లో అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో ప్రారంభమై ప్రపంచమంతా వేగంగా విస్తరించింది. ఇది ప్రపంచ చరిత్రగతినే మార్చిన పరిణామంగా రూపుదాల్చింది. రెండు సంవత్సరాల అనంతరం, ఆర్థిక వ్యవస్థ కోలుకోవటం ప్రారంభించినప్పటికి ఆ క్రమం చాలా నెమ్మదిగా సాగుతున్నది. ప్రస్తుత సంక్షోభం ఆరంభమై దశాబ్దకాలం గడుస్తున్నా అది ఇప్పటికీ ప్రమాదకరస్థాయిలో కొనసాగుతున్నది. అమెరికా సంయుక్త రాష్ట్రాలు, యూరోప్, జపాన్‌లలో అభివృద్ధి మందగించింది. అక్కడ ఆర్థిక అస్థిరత అలముకున్నది. కొత్త తరం ఆర్థిక సంక్షోభ ప్రకంపనలు నిరంతరం కొనసాగుతున్నాయి. వాటి ప్రభావం ప్రపంచవ్యాపితంగా విస్తరిస్తున్నది. అభివృద్ధి కోణంలో పరిశీలించినపుడు కొన్ని ప్రాంతాలలో పరిస్థితి ఆశాజనకంగా వుంది. వేళ్లపై లెక్కపెట్టదగ్గ అలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రత్యేకంగా చెప్పుకోదగింది చైనా. చైనాలో కూడా ప్రపంచ ఆర్థికవ్యవస్థతో బలంగా అనుసంధానమైన ఆర్థిక రంగాల్లో స్థిరత్వం కొనసాగింపు ప్రశ్నార్థకంగానే వుంది. అందుకే ప్రపంచ ఆర్థికవ్యవస్థ దీర్ఘకాల స్తబ్దత ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నట్లు ఆర్థిక రంగాన్ని నిశితంగా పరిశీలిస్తున్న నిపుణులు ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గత దశాబ్దాల సమస్యగా దీన్ని కొన్ని సందర్భాల్లో అభివర్ణిస్తున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో నెలకొన్న ఈ స్తబ్దతే ప్రపంచ వ్యాపితంగా అనుభవజ్ఞులైన ఆర్థికవేత్తలకు కూడా పెద్ద ప్రశ్నార్థకంగా మారింది.

పెట్టుబడిదారీ సంక్షోభం పునరావృతమౌతున్న తీరును ఇలా అభివర్ణించింది. "నిర్దిష్ట కాలవ్యవధిలో వరుసగావచ్చే వాణిజ్య సంక్షోభాలు మొత్తం బూర్జువా సమాజపు అస్తిత్వాన్నే అంతకంతకూ ప్రమాదకర స్థితికి నెడుతున్నాయ"ని కమ్యూనిస్టు ప్రణాళిక ఉద్ఘాటిస్తున్నది. మరింత ప్రచండరూపంలో బోనెక్కిస్తున్నది. భవిష్యత్ పరిణామాలను అంచనావేసే ప్రయత్నాలలో పై అవగాహన కేంద్ర బిందువుగా నిలుస్తున్నది. ఆర్థిక వ్యవస్థలు సుదీర్ఘ కాలంపాటు బలహీన మైన వ్యవస్థలుగా కొనసాగటం ఎపుడు సాధ్యమౌతుందంటే ప్రభుత్వ, ప్రైవేటురంగ వ్యవస్థలు ప్రపంచవ్యాపితంగా విస్తరించాలి. గతంలో ఎన్నడూ కనీవినీ ఎరగని స్థాయికి వడ్డీ రేట్లను బలవంతంగా కుదించివేస్తేనే పై లక్ష్యం నెరవేరుతుంది. ఈ నూతన రుణాల వరద వుత్పాదక రంగాలవైపు మళ్ళదు. ఫలితంగా ప్రపంచవ్యాపితంగా నెలకొంటున్న ఆస్తుల ధరలు ద్రవ్యోల్బణం వైపు మళ్లుతాయి. ఫలితంగా ప్రపంచ జనాభాలో కొద్దిమందికి మాత్రమే లబ్ది చేకూరుతుంది. అవి రియల్ ఎస్టేట్ లేదా ఇతర సెక్యూరిటీల రూపంలో కొద్దిమంది చేతుల్లోనే పోగుబడ్డాయి.

శ్రమదోపిడీతో అదనపు విలువను పోగేసుకోవటం ద్వారా నిరంతరం లాభాల అన్వేషణకు, కొత్త పెట్టుబడులుగా ఆ అదనపు విలువను మార్చుకోవటానికిగల వైరుధ్యాల మధ్య ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ కొట్టుమిట్టాడుతున్నది. ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో నూతన పెట్టుబడులు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచి అధికోత్పత్తి ఉపద్రవాన్ని సృష్టిస్తున్నాయి. తద్వారా ఆ వైరుధ్యాలు వ్యవస్థలకు ఒక పరిష్కారాన్నందించే కంటే అదనపు సమస్యలకు కారణమౌతున్నాయి. శ్రామికుల వినిమయాన్ని అదుపులో వుంచటం ద్వారా ప్రపంచవ్యాపితంగా వేతనాలను కుదించివేస్తున్నారు. శ్రామికుల వినిమయాన్ని నియంత్రించటం అనేది శ్రామిక వర్గపు అప్పుల భారాన్ని భారీగా పెంచుతున్నది. ఫలితంగా అమెరికా సంయుక్త రాష్ట్రాల శ్రామికుల్లో అత్యధికులకు ఎలాంటి నికర పొదుపుకు అవకాశం లేకుండా పోతున్నది. కమ్యూనిస్టు ప్రణాళికలో పేర్కొన్నట్లు పెట్టుబడిదారీ సంక్షోభ చక్రం అనిశ్చిత ప్రపంచంలో నిస్సందేహంగా పునరావృతమౌతున్నది. 2007-08లో ప్రారంభమైన మహా సంక్షోభం నుండి స్పష్టత చేకూరటమనేది అంతి

మ దశకు చేరింది. కొత్త అప్పులు మంజూరు, వడ్డీరేట్లు కుదింపు వంటి కిటుకుల వల్ల ఆర్థిక వ్యవస్థ పుంజుకునేందుకు ఇంకేమాత్రమూ అవకాశాలు లభించటంలేదు. ''ప్రతిసారీ మరింత ప్రచండ రూపం''అంటూ కమ్యూనిస్టు ప్రణాళికలోని నుడికారాన్ని ధృవపరుస్తూ, సంక్షోభం కొనసాగుతున్నది.

**మన పయనం ఎక్కడికి?**

మార్క్స్, ఎంగెల్స్‌లు అంకితభావం గల విప్లవకారులు. పెట్టుబడిదారీ విధానానికి వారసత్వంగా సంక్రమించిన పరిష్కారం సాధ్యంకాని వైరుధ్యాల మూలంగా విప్లవోద్యమాలు పరిఢవిల్లి, ఈ వ్యవస్థను కూల్చేసి దాని స్థానంలో మరింత హేతుబద్ధమూ, మానవత్వాన్ని ప్రభవించే నూతన వ్యవస్థ నిర్మాణానికి మార్గం సుగమం అవుతుందని వారు బలంగా విశ్వసించారు. కానీ వారి విశ్లేషణ ఒక భిన్నమైన చారిత్రక ఫలితాల సాధనకు అనుమతిస్తుందా? నిస్సందేహంగా అవుననే సమాధానం వస్తుంది. కమ్యూనిస్టు ప్రణాళిక మొదటి పుటలో 'బూర్జువాలు-కార్మికులు' అన్న విభాగం ఇలా వక్కాణిస్తున్నది.

**"ఇప్పటివరకూ నడచిన సమాజ చరిత్ర అంతా వర్గపోరాటాల చరిత్రే. పురాతన కాలపు స్వతంత్ర పౌరుడూ బానిసా, రోమన్‌కాలపు ప్రభువర్గీయుడు, సామాన్యుడు, ఫ్యూడల్ యుగపు భూస్వామ్య ప్రభువు, అర్థ బానిస, మధ్య యుగాల నాటి వృత్తి సంఘ యజమాని- చేతివృత్తి పనివాడు, ఇలా ...ఒక్క మాటలో చెప్పాలంటే పీడకులు, పీడితులు ఎల్లప్పుడూ పరస్పరం శతృవులుగా నిలబడి, ఒకప్పుడు చాటుమాటుగానూ, మరొకప్పుడు బాహాటంగానూ నిరంతరం పోరాటం చేస్తూ వచ్చారు. ఈ పోరాటాల పర్యవసానంగా ప్రతిసారి మొత్తం సమాజం విప్లవాత్మక పున:నిర్మాణానికి లోనయ్యేది. లేదా వైరి(ఆస్తిపర) వర్గాలుసమిష్టిగా నాశనమయ్యేవి."**

వైరివర్గాలు సమిష్టిగా నాశనమయ్యేవి అన్న అవగాహనకు మించి కమ్యూనిస్టు ప్రణాళికలో ఇంకేమీ చెప్పబడలేదు. ఎందుకంటే పెట్టుబడిదారీ వ్యవస్థలో సాగే వర్గపోరాటం ద్వారా సాధించబోయే ఫలితం ఇలా వుంటుందని మార్క్స్, ఎంగెల్స్‌లు వూహించకపోవటమే అందుకు చాలావరకు కారణం కావచ్చు. కానీ నేటి ప్రపంచాన్ని పరిశీలిస్తే పెట్టుబడిదారీ వ్యవస్థ సజీవ ఆర్థికవ్యవస్థల సహజ పునాదులను నాశనం చేస్తున్నది. వైరివర్గాల సమిష్టి వినాశనం సమీప భవిష్యత్‌లో చారిత్రకంగా సాధ్యమేనని మనం స్పష్టంగా చెప్పాలి. ముఖ్యంగా మొత్తం చారిత్రకగతినంతటినీ సిద్ధాంతరీత్యా అవగాహన చేసుకోగల స్థాయికి చేరుకున్న బూర్జువా సిద్ధాంతవేత్తల్లో ఒక భాగం కార్మికవర్గంలో కలుస్తుందన్నది కూడా చారిత్రక సత్యమే.

> **"పెట్టుబడిదారీ సమాజం గురించిన వాస్తవాలను ప్రపంచ ప్రజలముందుంచాలని మనం తప్పక ప్రయత్నించాలి. బూర్జువా సైద్ధాంతిక వేత్తలు ప్రచారం చేస్తున్నట్లు 'పెట్టుబడిదారీ వ్యవస్థే చరిత్రకు అంతం' కాదని, కానీ అది నిరంతరాయంగా కొనసాగితే చరిత్ర అంతం కావటం ఖాయమని మనం వివరించాలి."**



ఫ్రెడరిక్ ఏంగెల్స్ — కారల్ మార్క్స్

**ఏం సాధించాలని మనం ప్రయత్నిస్తున్నాం?**

పెట్టుబడిదారీ సమాజం గురించిన వాస్తవాలను ప్రపంచ ప్రజలముందుంచాలని మనం తప్పక ప్రయత్నించాలి. బూర్జువా సైద్ధాంతిక వేత్తలు ప్రచారం చేస్తున్నట్లు 'పెట్టుబడిదారీ వ్యవస్థే చరిత్రకు అంతం' కాదని, కానీ అది నిరంతరాయంగా కొనసాగితే చరిత్ర అంతం కావటం ఖాయమని మనం వివరించాలి. ఈ సమస్యపై కమ్యూనిస్టు ప్రణాళికలో మనకు స్పష్టత లభిస్తుందా? అవును. మనం దాన్ని జాగ్రత్తగా అధ్యయనం చేస్తే సృజనాత్మకంగా అన్వయిస్తే తప్పక స్పష్టత లభిస్తుంది. మనం తరచూ దృష్టి సారించని ప్రణాళికలోని ఒక భాగంలో మార్క్స్, ఎంగెల్స్‌లు తమ విశ్లేషణలో ఒక నూతన అంశాన్ని ప్రస్తావించారు.

**"చివరి అంశం ఏమంటే వర్గపోరాటంలో చావో రేవో తేలిపోయే సమయం ఆసన్నమైనపుడు, పాలకవర్గంలో సాగుతున్న విచ్ఛిత్తి ప్రక్రియ- నిజానికి అది పాత సమాజం అంతటా సాగుతున్న విచ్ఛిత్తి ప్రక్రియ-స్పష్టమైన ప్రచండ రూపం ధరిస్తుంది. దాని ఫలితంగా పాలకవర్గంలోనే కొద్దిమంది తమ వర్గంతో సంబంధాలు తెంచుకొని, భవిష్యత్‌ను శాసించే విప్లవవర్గంతో వచ్చి కలుస్తారు. గతంలో ఫ్యూడల్ వర్గానికి చెందిన ఒక భాగం విడిపోయి బూర్జువా వర్గంతో కలిసిపోయింది. అదేవిధంగా ఇప్పుడు కూడా బూర్జువా వర్గానికి చెందిన ఒక భాగం విడిపోయి కార్మికవర్గంతో కలుస్తుంది. ముఖ్యంగా మొత్తం చారిత్రక గతినంతటినీ సిద్ధాంతరీత్యా అవగాహన చేసుకోగల స్థాయికి చేరుకున్న బూర్జువా సిద్ధాంతవేత్తల్లో ఒక భాగం కార్మికవర్గంలో కలుస్తుంది."**

'పెట్టుబడిదారీ విధానానికి పూర్వమున్న ఆర్థిక నిర్మాణాలు' గురించి మార్క్స్ అభిప్రాయాలను మనం గమనించాలి. భూస్వామ్య సమాజాన్ని అంతమొందించిన వర్గం-ఆస్తి సంబంధాలు రద్దయిన కాలం గురించి మార్క్స్ అవగాహనలను పై అంశం ప్రతిబింబిస్తుంది. అదే విధంగా పెట్టుబడిదారీ విధానాన్ని అంతమొందించే అలాంటి కాలమొకటి రానున్నదని మనం విశ్వసిస్తున్నాము. అయితే పెట్టుబడిదారీ సంబంధాలను రూపుమాపే క్రమం భిన్నమైన రూపంలో తప్పక జరిగితీరుతుంది.

వర్తమాన పెట్టుబడిదారీ వ్యవస్థలను,

(మిగతా 35వ పేజీలో)

**ఈ మాసం ప్రత్యేకం**

# ప్రమాదంలో సమాచార హక్కు చట్టం

**ఎం. శ్రీధర్ ఆచార్యులు**



రచయిత
కేంద్ర సమాచార కమిషనర్

కేవలం స్వేచ్ఛా, స్వాతంత్రాలు మాత్రమే ప్రాథమిక హక్కులుకావు. హక్కులు తరచు శాసనవ్యవస్థ పనితీరుకు పరిమితులు విధిస్తుండగా, స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు పాలనా యంత్రాంగాన్ని హద్దుల్లో ఉంచుతాయి. ప్రజల స్వేచ్ఛ రాజ్యం జోక్యాన్ని నిరోధిస్తుంది కాబట్టి తొలుత హక్కులను వ్యతిరేకార్థంలోనే చూసేవారు. (అమెరికా హక్కుల బిల్లు ఒకఉదాహరణ) భారత రాజ్యాంగం కూడా అనేక రకాల హక్కులకు పూచీ ఇచ్చింది. వీటిలో కొన్ని సకారాత్మకంగా ఉండగా, మరికొన్ని వ్యతిరేకార్థంలోనూ ఉన్నాయి. ఉదాహరణకు 21వ అధికరణంలో ఏ వ్యక్తి జీవితానికి లేదా వ్యక్తిగత స్వేచ్ఛకుఆటంకం కలిగించకూడదని పేర్కొన్నారు. దీనర్థం సరైన చట్ట, న్యాయపరమైన చర్యలు లేకుండా ఒక వ్యక్తి స్వేచ్ఛను రాజ్యం హరించకూడదని! వ్యక్తుల జీవితాలకు, స్వేచ్ఛకు పూర్తిస్థాయిలో ఇది గ్యారంటీ ఇవ్వదు కాబట్టి వ్యతిరేకార్థంలో పేర్కొన్నది అవుతుంది. అదే విధంగా 14వ అధికరణంలో పేర్కొన్న వివక్షకు వ్యతిరేకంగా రక్షణ కూడా ఇటువంటిదే! నిర్ధారిత చర్యలు ప్రతిపాదించిన కొన్ని అంశాలను మినహాయిస్తే సమానత్వపు హక్కు కూడా వ్యతిరేకార్థంలో వాడినదే! రాజ్యాంగంలోని 14వ అధికరణం మానవులను అసమానులుగా చూడటాన్ని నిషేధించడం మాత్రమే కాకుండా, ఆదాయ పంపిణీలో అసమానతలను నియంత్రించే బాధ్యత ను, వ్యక్తుల సాంఘిక హోదాలోనూ, సౌకర్యాలలో, అవకాశాల్లో అసమానతలను తొలగించే బాధ్యతను కూడా రాజ్యంపై ఉంచింది. కేవలం వ్యక్తుల మధ్య సమానత్వం సాధించడమే కాదు, దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో, వివిధ వృత్తుల్లో ఉండే వారి మధ్య కూడా సమానత్వం సాధించడం దీని లక్ష్యం!

**ప్రాథమిక హక్కుగా**

అదే విధంగా సమాచార హక్కు అనేది సానుకూల స్వభావం కలిగింది. ప్రజలకు సమాచారాన్ని రాజ్యం అందుబాటులో ఉంచాలి. ఆదేశిక సూత్రాలు కూడా ఈ స్వభావం కలిగినవే అయినా రాజ్యం చేయదగిన సిఫార్సులు మాత్రమే! అమలు చేసి తీరాలనేంలేదు. కానీ కచ్చితంగా అమలు చేసి తీరాల్సినప్పుడు రాజ్యం ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకుంటుంది. ఉదాహరణకు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం ప్రకారం పని కచ్చితంగా చూపితీరాల్సిన బాధ్యత రాజ్యంపై ఉంది. దీనికోసం జాతీయ స్థాయి నుండి మారుమూల గ్రామాల వరకు విస్తృత యంత్రాంగాన్ని ప్రభుత్వాలు ఏర్పాటు చేసుకున్న విషయం తెలిసిందే. అదే విధంగా సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) 2005, అమలుకు బహుళ అంచెల వ్యవస్థను ఏర్పాటు చేయడం తప్పనిసరిగా మారింది.

స్వాతంత్రానికి పూర్వం వలసపాలన కొనసాగింది కాబట్టి అది గోప్యతను పాటించింది. కానీ స్వాతంత్రం తరువాత, రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటైన ప్రభుత్వానికి ప్రజల నుండి రహస్యాలను దాచిపెట్టాల్సిన అవసరం లేదు. మరోమాటలో చెప్పాలంటే పారదర్శకంగా పాలన సాగవలసి ఉంది. సమాచార హక్కును రెండు రకాల సంబంధాల్లో అర్థం చేసుకోవాల్సిఉంటుంది. మొదటిది వ్యక్తుల మధ్య ఉండాల్సినది కాగా, రెండవది వ్యక్తికి, రాజ్యానికి మధ్య ఉండాల్సిన సంబంధం. మొదటిది నైతిక బాధ్యత లక్షణం కలిగిఉండగా, రెండవది చట్టంలో పేర్కొన్న విధంగా సుపరిపాలనకు తప్పనిసరిగా ఉండాల్సిన లక్షణం. సమాచారహక్కు ప్రతిపాదన దశలో ఆ అంశంపై నియమించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ ఇఎం సుదర్శన్ నాచిపాన్ 2005లో రాజ్యసభలో మాట్లాడుతూ 'ప్రాథమిక హక్కుల అమలు అంశాన్ని పరిశీలించాల్సి ఉంది. వీటి అమలుకోసం చట్టం చేయాల్సిన బాధ్యతను రాజ్యాంగం భారత ప్రభుత్వంపై ఉంచింది. ఆ చట్టం భారత ప్రజల ప్రయోజనాలను పరిరక్షించడానికే ఉపయోగపడాలి కానీ ప్రభుత్వ ప్రయోజనాలనో, స్థానిక సంస్థల లాభాలనో కాపాడేదిగా ఉండకూడదు. అందువల్లనే ప్రాథమిక హక్కులను ఉమ్మడి జాబితాల్లో చేర్చలేదు.' అని అన్నారు. సమాచార కమిషన్ పాత్రను ప్రస్తావిస్తూ ఆయన 'కమిషన్ సమాచార హక్కు చట్టం సరిగా అమలయ్యేలా చూడాలి. ఒక వేళ అది అమలుకాకపోతే, అమలయ్యేలా కమిషన్ చర్యలు తీసుకోవాలి. అటువంటి చర్యలు తీసుకోవడం రాజ్యాంగబద్ధ బాధ్యత. కమిషన్ ఈ పని చేయకపోతే, చట్టం తీసుకువచ్చి ప్రయోజనమేమిటి? పవిత్ర గ్రంథంలో ఒక భాగంగా ఉండటం కోసం ఈ చట్టాన్ని మనం రూపొందించడం లేదు' అని చెప్పారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి పలువురు వ్యక్తులు, వివిధ సంస్థల ప్రతినిధులు కేంద్ర కమిషన్ నియామాకంపై వ్యక్తం చేసిన అభిప్రాయాలను క్రోడీకరిస్తూ ' ఈ వ్యవస్థ పనిచేసే తీరుపైనే సమాచార లభ్యత ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకున్నప్పుడు కమిషన్‌తో పాటు దీని వివిధ విభాగాలను స్వేచ్ఛగా, పూర్తి స్వతంత్రంగా పని చేయనివ్వాలి. దీనికోసం ఎన్నికల కమిషన్ తరహా స్థాయిని సమాచార కమిషన్‌కు ఇవ్వాలి' అని అన్నారు. సమాచార బిల్లులోని ప్రతి అంశాన్ని క్షుణంగా పరిశీలించిన తరువాతే పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఈ సిఫార్సు చేసింది. ఈ నేపథ్యంలోనే రాజ్యాంగబద్ధ సంస్థలైన కేంద్ర ఎన్నికల కమిషన్‌కు, కేంద్ర సమాచార హక్కు కమిషన్ మధ్య ఉన్న సారూప్యతలను,సమానత్వాన్ని పరిశీలించాల్సిఉంది.

**రాజ్యాంగబద్ధతపై**

సమాచార కమిషన్ (సిఐసి) ఎన్నికల సంఘం కన్నా ఒక మెట్టు దిగువనే ఉంటుందని, రెండూ సమానం కాదని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు వివిధ మీడియా సంస్థలు వార్తలు ఇస్తున్నాయి. ఈ వార్తల ప్రకారం ఎన్నికల

కమిషన్ రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైనది కాగా, సమాచార కమిషన్‌కు ఆ స్థాయిని కల్పించారన్నది కేంద్ర ప్రభుత్వ వాదన! అయితే తప్పుడు అవగాహన కారణంగానే ఈ తరహా అభిప్రాయం ఏర్పడుతుంది. ఉదాహరణకు రాజ్యాంగంలోని 3వ భాగంలో చేర్చలేదన్న కారణంతో ఓటుహక్కు (ఆర్టికల్ 325) ప్రాథమికహక్కు కాదని ఎవరైనా అనగలరా? ఓటు వేయడమన్నది అభిప్రాయాన్ని తెలియచేయడం, అంటే భావ వ్యక్తీకరణ హక్కులో భాగం! ప్రజాస్వామ్యానికి పునాదైన ఈ హక్కును అమలు చేయడానికే ఎన్నికల కమిషన్‌కు విశేషాధికారాలు ఇచ్చాం. సమాచార హక్కు కూడా అటువంటిదే! ప్రాథమిక హక్కుల్లో నేరుగా ప్రస్తావించనప్పటికీ ఇది 19(1)(ఎ) అధికరణంలో పేర్కొన్న భావవ్యక్తీకరణ ఛత్రం కిందకే వస్తుంది. ప్రజలకు అవసరమై విషయాలను తెలియచేయడానికి సిద్ధపడని అధికారులను, ఆ మేరకు విధులు నిర్వహించేలా సమాచార కమిషన్ స్వతంత్రంగా, విచక్షణతో ఆదేశాలు జారీ చేస్తుంది. ఓటుహక్కు, సమాచార హక్కు చూడటానికి వేరువేరుగా కనిపించినప్పటికీ, ఒకే ప్రాథమిక హక్కులో ఉన్న రెండు భాగాలు మాత్రమే! మానవహక్కుల ప్రపంచ ప్రకటన (యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్-యుడిహెచ్ఆర్)ను 1950లో భావ వ్యక్తీకరణ హక్కులో భాగంగా చేర్చాం. ఆ ప్రకటనలోని 19వ అధికరణం 'సమాచారాన్ని కోరడం, పొందడం, దానిని వివిధ మీడియా సంస్థల ద్వారా తెలియచేయడం కూడా భావ వ్యక్తీకరణ స్వేచ్ఛలో భాగమే' అని పేర్కొంది.

**"ఉదాహరణకు రాజ్యాంగంలోని 3వ భాగంలో చేర్చలేదన్న కారణంతో ఓటుహక్కు (ఆర్టికల్ 325) ప్రాథమికహక్కు కాదని ఎవరైనా అనగలరా? ఓటు వేయడమన్నది అభిప్రాయాన్ని తెలియచేయడం, అంటే భావ వ్యక్తీకరణ హక్కులో భాగం! ప్రజాస్వామ్యానికి పునాదైన ఈ హక్కును అమలు చేయడానికే ఎన్నికల కమిషన్‌కు విశేషాధికారాలు ఇచ్చాం. సమాచార హక్కు కూడా అటువంటిదే!"**




సమాచారహక్కు చట్టం పరిరక్షణకోసం ఆందోళన

దీని ప్రకారం సమాచారహక్కు కూడా రాజ్యాంగంలో 19(1)(ఎ), 19(2) అధికరణల ప్రకారం ప్రాథమిక హక్కేనని స్పష్టమౌతోంది. రాజ్యాంగబద్ధంగా స్థిరమైనది కావడంతో పాటు, న్యాయపరంగా ప్రాథమిక హక్కుగా నిర్వచింపబడినది కాబట్టి కేవలం మంత్రి మండలి నిర్ణయాలతో దీనిని నీరుగార్చడం సాధ్యంకాదు. పార్లమెంటు కు మాత్రమే ఆ అధికారం ఉంది. మరో మాటలో చెప్పాలంటే కొద్ది మంది వ్యక్తు లతో కూడిన చిన్న సమూహాల (మంత్రిమండలి) నుండి అత్యధిక సంఖ్యలో సభ్యులు ఉండే పార్లమెంటుకు అధికారాలు దఖలు పడ్డాయి. రాష్ట్ర స్థాయి లోనూ ఇదే వర్తిస్తుంది.

**చారిత్రిక నేపథ్యం ...!**

నిజానికి సమాచార హక్కు అనేది కొత్తదేమి కాదు. దీని మూలాలు 1872 నాటి ఎవిడెన్స్ యాక్టులోనే ఉన్నాయి. ఈ చట్టంలోని 76వ సెక్షన్ అనేక రకాల డాక్యుమెంట్లను అధికారుల నుండి పొందడానికి ప్రజలకు వీలు కల్పించింది. దీని ప్రకారం దస్తావేజులను పరిశీలించి తనకు కావాల్సిన డాక్యుమెంట్లను కొంత ఫీజు చెల్లించి ప్రజలు పొందేవారు. వీటిపై సంబంధిత అధికారి స్టాంపు వేసి, సంతకం చేసి 'ట్రూ కాపీ' అని రాసి మరీ ఇచ్చేవారు. సాధారణ పరిభాషలో సర్టిఫైడ్ కాపీలుగా వీటిని వ్యవహరించేవారు. 2005లో వచ్చిన సమాచార హక్కు చట్టం ఒక రకంగా ఇదే!19వ శతాబ్ధం నాటి చట్టంపై ప్రజానీకానికి అంతగా అవగాహన ఉండేది కాదు. 2005 చట్టంతో పూర్తి స్థాయి యంత్రాంగం ఏర్పడటంతో పాటు, అధికారిక సమాచారాన్ని అందుబాటులో ఉంచడం. తిరస్కరించిన అధికారులపై చర్యలు తీసుకునే వీలు కలిగింది. ప్రజల్లో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. 1872 నాటి చట్టంలో అధికార యంత్రాంగంపై చర్యలు తీసుకునే అవకాశం ఉండేది కాదు. దీనికోసం న్యాయవ్యవస్థ ముందు పిటిషన్ దాఖలు చేయాల్సివచ్చేది. అదంతా వ్యయ ప్రయాసాలతో కూడుకున్నదన్న విషయం తెలిసిందే. దీంతో సామాన్యులు అంతగా ముందుకు వచ్చేవారు కాదు. అవసరమైన సమాచారాన్ని పొందడంలో ఉన్న కష్టనష్టాలను పూర్తిస్థాయిలో అర్ధం చేసుకున్న తరువాతే సమాచారహక్కు చట్టం ప్రతిపాదన ముందుకు వచ్చింది. అంతేకాదు రాజ్యాంగ నిబంధనల చట్రం ప్రకారం, ప్రజాస్వామ్య సూత్రాల ఆధారంగా సుపరి పాలనలో భాగంగా ఈ చట్టాన్ని రూపొందించారు. ప్రస్తుతం 60కి పైగా దేశాలు ఈ తరహా చట్టాలను రూపొందించాయి. ఈ చట్టం యొక్క ప్రాథమిక హక్కు స్వభావాన్ని అమెరికన్. కెనడా కోర్టుల చారిత్రాత్మక తీర్పుల కన్నా ముందే లాటిన్ అమెరికా గుర్తించింది. 2009లో నే అంతర్జాతీయ న్యాయస్థానాలు దీనిని గుర్తించడం ప్రారంభించాయి. చివరగా 2011లో ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల విభాగం దీనిని గుర్తించింది.

**న్యాయ నిర్వచనాలు ...**

దేశంలోని వివిధ న్యాయస్థానాలు తమ తీర్పుల్లో సమాచార హక్కు చట్టాన్ని నిర్వచించి, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛలో భాగంగా, ప్రాథమిక హక్కుగా నిర్ధారించాయి. నిజానికి చట్టం రూపొందించిన 2005 కన్నా ముందే ఈ దిశలో అనేక తీర్పులు వచ్చాయి. 1962లో న్యూస్ ప్రింట్‌ను దిగుమతి చేసుకోవడంపై ఆంక్షలు పెట్టినప్పుడు బెన్నెట్ కాలమ్ వర్సస్ భారత ప్రభుత్వం కేసులో ఆ తరహా ఆంక్షలు ప్రజల తెలుసుకునే హక్కుకు భంగకరమని సుప్రీంకోర్టు పేర్కొంది. 'రాజ్యాంగంలో పేర్కొన్న భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ కేవలం పత్రికలకు మాత్రమే కాదు. అది విస్తృత ప్రజానీకానికి ఉద్దేశించింది. భావ వ్యక్తీకరణ అంటే పౌరులందరికి చదవడానికి, సమాచారాన్ని తెలుసుకోవడానికి హక్కు కూడా'

> **“కానీ, ఈ దేశ ప్రజలకు ప్రతి ప్రభుత్వ చర్యను గురించి తెలుసుకునే హక్కు ఉంది. పౌర సంస్థలు, అధికారులు, వ్యవస్థలు చేసే ప్రతి పని గురించి వారు తెలుసుకోవచ్చు. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛలో ఇది కూడా ఒక భాగమే. దేశ భద్రతకు హాని కలిగించే సమాచారం తప్ప ప్రతి సమాచారాన్ని తెలుసుకునే హక్కు ప్రజలకు ఉంది.”**

అని వ్యాఖ్యానించింది. 1986లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కేసులోనూ, 1973లో టైమ్స్ న్యూస్ పేపర్‌కేసులోనూ ఇటువంటి తీర్పులే వచ్చాయి. 1975లో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం వర్సస్ రాజ నారాయణ్ కేసులో ధర్మాసనం సమాచారహక్కును మరింత స్పష్టంగా పేర్కొంది. 'ప్రభుత్వ విధుల్లో ఉన్న వారు తప్పనిసరిగా వారి ప్రవర్తనకు బాధ్యులైఉండాలి. విధి నిర్వహణలో కొన్ని రహస్యాలు ఉండవచ్చు. కానీ, ఈ దేశ ప్రజలకు ప్రతి ప్రభుత్వ చర్యను గురించి తెలుసుకునే హక్కు ఉంది. పౌర సంస్థలు, అధికారులు, వ్యవస్థలు చేసే ప్రతి పని గురించి వారు తెలుసుకోవచ్చు. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛలో ఇది కూడా ఒక భాగమే. దేశ భద్రతకు హాని కలిగించే సమా చారం తప్ప ప్రతి సమాచారాన్ని తెలుసుకునే హక్కు ప్రజలకు ఉంది. అలాగని ప్రతిదానికి ఆ ముసుగు వేస్తామంటే కుదరదు. వారు చేసే పనుల హేతుబద్ధతను అధికార యంత్రాంగం వివరించగలిగి ఉండాలి. అదే అణచివేతనుండి, అవినీతి నుండి ప్రజలను కాపాడుతుంది' అని పేర్కొంది. ఎస్‌పి గుప్తా వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు 'పౌరులు దేశ పరిపాలన వ్యవస్థ గురించి నిజాలను తెలుసుకునే హక్కు మాత్రమే ప్రజాస్వామ్య వ్యవస్థకు వాస్తవమైన పునాదిగా ఉంటుంది. . ఆ కారణంగా ప్రభుత్వాలు మరింత పారదర్శకంగా ఉండాలన్న డిమాండ్ ప్రపంచ వ్యాప్తంగా ఊపందుకుంటోంది' అని పేర్కొంది.

**స్వతంత్రతపై దాడి**

భారత రాజ్యాంగం ప్రకారం ప్రాథమిక హక్కుల్లో ఒకటైన భావప్రకటనా స్వేచ్ఛను అమలు చేసి, దాని ఫలాలను ప్రజలకు అందించే రాజ్యాంగబద్ధ బాధ్యతల్లో ఉన్న కేంద్ర సమాచార కమిషన్, రాష్ట్ర కమిషన్లను పాలనాపరమైన ఉత్తర్వుల ద్వారా నీరుగార్చకూడదన్న విషయం స్పష్టమే! అయినప్పటికీ సమాచార హక్కు చట్టాన్ని సవరించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. కొన్ని మీడియా సంస్థల కథనాల ప్రకారం ఎన్నికల కమిషన్‌తో సమానంగా సమాచార కమిషన్‌ను చూడటానికి కేంద్ర ప్రభుత్వం నిరాకరిస్తోంది. సమాచారానికి సంబంధించిన పౌరుల పిటిషన్లను అధికారుల నేతృత్వంలో పరిష్కరించే ఒక స్టాట్యూటరీ వ్యవస్థగానే ప్రభుత్వం దీనిని భావిస్తోంది. అయితే, ఈ భావన సరికాదు. ఎన్నికల కమిషన్ ఏ విధంగా ఓటు హక్కును పరిరక్షిస్తుందో అదే విధంగా సమాచార కమిషన్ కూడా ప్రజల హక్కును రాజ్యాంగం ప్రకారమే కాపాడుతుంది. అంతే కాకుండా, సమాచారహక్కు చట్టంలో ఎన్నికల కమిషనర్లకు, సమాచార కమిషనర్ల వేతనాలకు మధ్య పోలిక పెట్టడాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం తప్పు పడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. 'బుర్ర ఉపయోగించకుండా, హడావిడిగా ఈ చట్టాన్ని రూపొందించారని కేంద్ర ప్రభుత్వంలోని పెద్దలు భావిస్తున్నారు' అన్నది ఆ వార్తల్లోని సారాంశం. నిజానికిది ప్రభుత్వ ఉద్యోగుల నుద్దేశించి చేస్తున్న వ్యాఖ్య! రాష్ట్రాల సమాచార కమిషనర్లుగా అధనపు కార్యదర్శుల స్థాయిలో పనిచేసి, ఉద్యోగ విరమణ చేసిన వారిని తరచు నియమిస్తున్నారు. అయితే, ఎనిమిది రంగాల్లో నిపుణులైన వ్యక్తులను కమిషనర్లుగా నియమించాలని స్పష్టంగా పేర్కొంది. ఈ ఎనిమిదిమందిలో ఒకరు మాత్రమే ప్రభుత్వ కార్యక్రమాల్లో నైపుణ్యం పొందిన అధికారిగా ఉండాలని చట్టం నిర్దేశించింది. అయితే, రాజకీయ నాయకులు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోకుండా వారిష్టం వచ్చిన విధంగా నియామకాలు చేస్తు న్నారు. నిజానికి సమాచార హక్కు చట్టంలోని ప్రతి అంశమూ ప్రజల చేత రూపొందించ బడినది. ప్రతి అక్షరాన్ని పూర్తిస్థాయిలో చర్చించిన తరువాతే బిల్లులో చేర్చారు. ఈ చట్టానికి పార్లమెంటులో సవరణలు చేయాలని భావిస్తే అంతకు ముందు జరిగిన కసరత్తును పరిగణలోకి తీసుకుని వాటిని ప్రజల ముందుఉంచాలి. విస్తృతంగా చర్చను చేపట్టాలి. కొద్దిమందిబ్యూరోక్రాట్ల అభిప్రాయం అత్యధిక ప్రజల ప్రయోజనాలను గండికొట్టకుండా చూడాలంటేపౌరసమాజం మరింత క్రియాశీలంగా వ్యవహ రించాలి. ప్రతిపాదించిన సవరణలపై తమ అభ్యంతరాలను పెద్ద ఎత్తున ప్రభుత్వానికి తెలపాలి.

మరో అంశాన్ని కూడా ఇక్కడ ప్రస్తావించాలి. 2004లో సమాచారహక్కు బిల్లు చర్చకు వచ్చినప్పుడు సబ్‌క్లాజు 8లో కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను పాటించేందుకు డిప్యూటీ కమిషనర్లను నియమించాలన్న ప్రతిపాదన ఉంది. సుదీర్ఘచర్చల తరువాత అటువంటి నియమాకం కమిషన్ స్వతంత్రతకు హాని కలిగిస్తుందని భావించి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ దానిని తొలగించింది. 'కేంద్ర సమాచార కమిషనర్ మరికొందరు సమాచార కమిషనర్ల సహకారంతో చట్టంలో నిర్దేశించిన అన్ని విధులను స్వతంత్రంగా, ఎవరి ఆదేశాలతో నిమిత్తం లేకుండా నిర్వర్తించాలి' అని తుదిచట్టంలో పేర్కొన్నారు. 'కేంద్ర సమాచార కమిషన్ అత్యంత కీలకమైనది. అఖిలభారత స్థాయిలో బాధ్యతలను అత్యంత స్వేచ్ఛగా, స్వతంత్రంగా నిర్వహించాల్సిఉంది. చట్టంలో నిర్దేశించిన పనులను ఎటువంటి ఒత్తిడి లేకుండా నిష్పక్షపాతంగా చేయాలంటే కేంద్ర కమిషనర్‌కు, ఇతర కమిషనర్లకు ప్రధాన ఎన్నికల అధికారికి, ఎన్నికల అధికారులకు ఉన్న స్థాయిని కేటాయించాలి' అని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ అభిప్రాయపడింది.

**ప్రజాస్వామ్యానికి స్థూపం!**

రాజ్యాంగంలో పేర్కొన్న సంస్థే రాజ్యాంగ బద్ధమైనదని చెప్పడం పూర్తిగా సాంకేతికమే అవుతుంది. మరింత అవగాహనతో, అర్థవంతమైన స్థాయిలో ఈ వ్యాఖ్యానం చేయాల్సిఉంటుంది. ప్రజల ఓటుహక్కును కాపాడటానికి ఎన్నికల కమిషన్ ఏ విధంగా అఖిలభారత స్థాయి నుండి క్షేత్రస్థాయి వరకు కృషి చేస్తుందో. సమాచార కమిషన్ కూడా ప్రజల తెలుసుకునే హక్కును కాపాడటానికి అదే స్థాయిలో, అటువంటి కృషే చేస్తున్నది. 2005 వరకు ఓటు హక్కు, సమాచార హక్కును ఒకే స్థాయిలో ప్రాథమిక హక్కుగా పరిగణించారు. కాబట్టి, సమాచార కమిషన్, ఎన్నికల కమిషన్ ఒకే స్థాయి గలవి. ప్రభుత్వ, రాజకీయ ఆసక్తుల నుండి సమాన స్వతంత్రత కలిగినవి. ఇవి భారత ప్రభుత్వ విస్తరణ విభాగాలు కావు. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే స్థూపాలు! న్యాయవ్యవస్థ తరహాలోనే ఈ రెండు వ్యవస్థలనూ శాసన, అధికార విభాగాల నుండి దూరంగా ఉంచాలి.

# ప్రత్యామ్నాయ విధానాల చుట్టూ ప్రజలను సమీకరించాలి

**సందేహాలు సమాధానాలు**



**- బి.వి.రాఘవులు**

**లాభం కోసం పెట్టుబడి ఎక్కడికైనా ప్రయాణం చేస్తుంది. ఏమైనా చేస్తుందని చెప్పుకుంటాం. గాట్ ఒప్పందంతో పాటు డబ్ల్యుటిఓ కూడా పెట్టుబడి ప్రవాహానికి ఆటంకం లేకుండా చూసే సాధనాలే కదా! మరి అనేక దేశాలు రక్షణాత్మక చర్యలు ఎందుకు తీసుకుంటున్నట్టు? ఇలా తీసుకుంటున్నవన్నీ పెట్టుబడిదారి దేశాలే! ప్రపంచ పెట్టుబడికి కేంద్రంగా ఉన్న అమెరికా కూడా ఈ రకమైన చర్యలు తీసుకుంటోంది కదా.. దీనర్థం ఏమిటి? పెట్టుబడికి ఉన్న అంతర్జాతీయ స్వభావం కన్నా (ద్రవ్య పెట్టుబడి యైనా) జాతీయ స్వభావం ఏదశలోనైనా కీలకంగా మారుతుందా? జాతీయ పెట్టుబడి ప్రయోజనాలే ముఖ్యమైతే పెట్టుబడి ప్రవాహం కుదించుకుపోతుంది కదా? అది ప్రాథమిక సూత్రానికే విరుద్ధం కదా?**

**– వి. రాజగోపాల్, విజయవాడ.**

ప్రపంచ స్థాయిలో చూసినప్పుడు ముఖ్యంగా సంపన్న దేశాల్లో రెండు ధోరణులు కనిపిస్తున్నాయి. మొదటిది ఆర్థిక రంగంలో రక్షణాత్మక చర్యలు తీసుకోవడం. రెండవది వలసలు వచ్చేవారికి వ్యతిరేకంగా వివిధ రకాల ఆంక్షలు విధించడం, అలాగే వ్యతిరేకత సృష్టించడం. ఆర్థిక విషయాల్లో రక్షణాత్మక చర్యలు అమెరికా ఎక్కువగా తీసుకుంటున్నట్లు మనకి కనిపిస్తున్నది. ఈ పరిణామాలు ఇప్పటి వరకు ప్రపంచ వ్యాప్తంగా అమలు జరుగుతున్నాయి. ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలకు భిన్నంగా వున్నట్టు మనకు కనిపిస్తోంది. కొంత వ్యత్యాసం వున్న మాట కూడా నిజమే. అయితే ఈ వ్యత్యాసం రూపంలో తప్ప వాటి ప్రయోజనంలో మాత్రం కాదు. ఇప్పటి వరకు అనుసరిస్తున్న ప్రపంచీకరణ విధానాలు గాని, అమెరికాలో ఇప్పుడు ముందుకు తెస్తున్న రక్షణాత్మక చర్యలు గాని ఒకే వర్గ ప్రయోజనంతో చేపడుతున్నవే. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడుల ప్రయోజనాలు కాపాడేందుకు.

గత మూడు దశాబ్దాల నుండి ప్రపంచ వ్యాప్తంగా అమలు చేయబడుతున్న ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలు పెట్టుబడిదారీ విధానాన్ని సంక్షోభ పరిస్థితుల నుండి శాశ్వతంగా విముక్తి చేశాయని చాలా మంది భావించారు. కాని 2008లో అమెరికాలో ప్రారంభమైన సంక్షోభం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మొత్తానికి విస్తరించడంతో ఈ అంచనాలు తలక్రిందులయ్యాయి. దశాబ్దం గడుస్తున్నా అభివృద్ధి చెందిన దేశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను పూర్వస్థాయికి చేర్చడంలో విఫలమయ్యాయి. ఈ సంక్షోభంపై భిన్నాభిప్రాయాలు, భిన్న ఆలోచనలు, చర్చలు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా అమెరికాలో పాలక వర్గంలోని కొన్ని తరగతులు రక్షణాత్మక చర్యలు తీసుకోవడం ద్వారా అమెరికా ఆర్థిక ఆధిపత్యాన్ని కాపాడుకోవచ్చన్న ఆలోచనతో ట్రంప్‌ను అధ్యక్ష స్థానంలో కుర్చోబెట్టారు. పర్యవసానంగా ట్రంప్ అమెరికాకే మొదటి ప్రాధాన్యత నినాదంతో అనేక రక్షణాత్మక చర్యలు ప్రకటించారు. ఈ ప్రయత్నాలు వివిధ దేశాల్లో ప్రతి చర్యలకు దారితీస్తున్నాయి. సుంకాలు విధించటం, ఆర్థిక ఆంక్షలు ప్రవేశపెట్టడం, వాణిజ్యయుద్ధాలు విస్తరిస్తున్నాయి. అయితే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి వెనక్కి పోయి జాతీయ రూపాన్ని పెట్టుబడి సంతరించుకుందని చెప్పలేం. గతంలో కూడా అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి దేశ రాజకీయ పరిధిలోని పనిచేస్తూ వచ్చింది. దేశ రాజకీయ అవసరాలకు, అంతర్జాతీయ పెట్టుబడి అవసరాలకు మధ్య వైరుద్యాలు గతంలోనూ వుండేవి. 2008 తరువాత అవి మరింత తీవ్రమయ్యాయి. వివిధ దేశాల మధ్య ఆర్థిక విభేదాల రూపంలో ఈ వైరుధ్యాలు మనకి కన్పిస్తున్నాయి. అయినంత మాత్రాన అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి అంతరించి, పెట్టుబడి జాతీయ రూపం సంతరించుకుందని చెప్పకూడదు. మారిన పరిస్థితులకు అనుగుణంగా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి సర్దుబాటు చేసుకొనే ప్రయత్నం చేస్తున్నదని భావించాలి. ఎటువంటి వివాదాలకు, ఘర్షణలకు తావులేకుండా ఈ సర్దుబాట్లు జరుగుతాయని భావించరాదు. అమెరికా వ్యవహరిస్తున్న తీరులో ఈ అంశాలు మనకి స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ప్రపంచ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి, సోషలిజానికి వ్యతిరేకంగా సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ దేశాలను కూడగట్టేందుకు అంతర్జాతీయ స్థాయిలో అమెరికా నాయకత్వం వహిస్తున్నది. ఇందుకోసం నిధులను వెచ్చిస్తున్నది. ప్రపంచ పెట్టుబడిదారీ దేశాల కోసం తాము ఎందుకు ఖర్చుపెట్టాలన్న ఒక జాతీయవాద భావాన్ని రెచ్చగొట్టి అమెరికాలోని ఓటర్ల నుండి ఆదరణ పొందటానికి ట్రంప్ ప్రయత్నం చేశాడు. ఇందులో భాగంగా ప్రపంచ వ్యాప్తంగా అమెరికా, దాని మిత్రులు నిర్వహిస్తున్న యుద్ధాలు, నడుపుతున్న కూటములకు అయ్యే ఖర్చు అమెరికా ఒక్కటే ఎందుకు పెట్టాలి, మిగిలిన మిత్ర దేశాలన్నీ భాగం పంచుకోవలసిందే అంటూ రెచ్చగొట్టే ప్రచారంతో ట్రంప్ అమెరికా ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నం చేశారు. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, సిరియా వంటి దేశాల్లో యుద్ధాలకు గానూ నాటోకు, కొరియా ఉపఖండంలో సైనిక ఖర్చులకు నిధులు కత్తిరిస్తామని, ఐక్యరాజ్య సమితికి, దాని ఉపసంస్థలకు, ప్రపంచ బ్యాంకుకు, ఇతర ఆర్థిక సంస్థలకు నిధులు నిలిపివేస్తామని అమెరికా ప్రకటించింది. అంతర్జాతీయ ఒప్పందాల నుండి వైదొలగుతామని పేర్కొన్నది. వాతావరణం ఒప్పందం నుండి వైదొలగింది. అంతర్జాతీయ వాణిజ్య సంస్థ నుండి బయటకు వెళ్తామని చెబుతున్నది. ఇటువంటి చర్యల్లో భాగంగానే కొరియాతో అణ్వాయుధ నిర్మూలన ఒప్పందం చేసుకొని కొరియా ఉప ఖండపు భారాన్ని తగ్గించుకోవాలని చూస్తున్నది.

అయితే ట్రంప్ చేపడుతున్న ఈ పనులు అంతర్జాతీయ పెట్టుబడికి ఉపయోగపడుతున్నంత కాలం చలామణి అవుతాయి. పరిధికి మించి ముందుకు పోతే అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి ప్రతిఘటన చేస్తుంది. ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాల పర్యవసానాలు తమకు నచ్చనపుడుట్రంప్ విధానాలను ప్రక్కకు నెట్టే చర్యలు ముందుకు వస్తాయి. అమెరికా రాజకీయాల్లో అటువంటి వివాదపుఛాయలు ఇప్పటికే మనకు కనిపిస్తున్నాయి.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో జరుగుతున్న పరిణామాలు ప్రస్తుత పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ బలహీనతలను వ్యక్తం చేస్తున్నాయి. ఈ బలహీనతల నుండి అమెరికా ఆధిపత్యాన బయటపడగలమన్న ఆశ కలగడం లేదు. ఈ పరిస్థితి అమెరికా ఆర్థిక వ్యవస్థ నాయకత్వ స్థానాన్ని కోల్పోతున్నదన్న భావం కలిగిస్తున్నది. అనేక ఒడిదుడుకులు ఉన్నమాట నిజమైనా అమెరికా ఆధిపత్యం పోయిందని అనుకోవడం సరికాదు. ఇప్పటికీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో

డాలరే ముందు పీఠిన వున్నది. ఏకధృవ ప్రపంచం అన్నట్లుగానే రాజకీయాలు కూడా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం వున్న సంక్షోభ పరిస్థితులను పెట్టుబడిదారీ వ్యతిరేక మార్గంలోకి మళ్ళించే కార్మికవర్గ, అభ్యుదయ శక్తులు బలహీనంగా వున్నాయి.

**బి.వి రాఘవులు గారికి...**

**టిడిపి మళ్లీ 2019 ఎన్నికల్లో గెలిస్తే నియంతగా మారే అవకాశం ఎక్కువగా ఉంది. ప్రజా ఉద్యమాలను కర్కశంగా అణిచేవేసే అవకాశం ఉంది. ఆంధ్రాలో, టిడిపి దేశంలో బిజెపి వస్తే చాలా ప్రమాదం. కావున, తెలుగురాష్ట్రాల్లో ఈ రెండింటినీ దెబ్బ కొట్టాలంటే వామపక్షాలు, జనసేనను ఒప్పించి, కాంగ్రెస్‌తో ఎంపీసీట్లు కొన్ని ఎక్కువగా, అసెంబ్లీ తక్కువ, ఇచ్చి పొత్తుకాకుండా, సర్దుబాటు చేసుకుంటే, వామపక్షాలు జనసేనకు, ప్రజాఉద్యమాలకు, మంచి అవకాశం ఉండవచ్చు. రాజకీయ, ఎన్నికల ఎత్తుగడలలో, కేంద్ర పార్టీ ఆలోచ నలతో ఆంధ్రాలో లోగడ చాలా నష్టపోయాము. మళ్లీ అలాంటి, నష్టము జరుగకుండా చూడ గలరు. ఎట్టి పరిస్థితులోనూ మళ్లీ తిరిగి, టిడిపిని అధికారంలోకి రాకుండా చూడగలరు. సర్దు బాటు వల్ల, ఎంపీ సీట్లు కొన్ని కాంగ్రెస్‌కి, వది లేయడం వలన మనకు అంతగా నష్టం ఉండదు. పైగా రాష్ట్రంలో రాజకీయాలు మార వచ్చు. బూర్జువా పార్టీలు ఏదీ, గట్టిగా బలపడకుండా ఎత్తుగడలు మారకపోతే జాతీయ ఆలోచనలతోనే ఎక్కువగా, పోతే మనరాష్ట్రంలో పార్టీ బలహీనపడుతుంది. బిజెపి, టి.డి.పి. ఆ రెండింటికి పడకపోయినా, ఈ సమయంలో ఆ రెండింటిని దెబ్బకొట్టేందుకై, చాలా వ్యూహంతో, వామపక్షాలు, జనసేన, కసరత్తు చేయవల సిందిగా కోరుతూ గట్టిగా ప్లాను చేస్తారని ఆశిస్తూ.**

**- వి. రమేష్, వీరులపాడు, కృష్ణాజిల్లా.**

ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాలు చాలా కాలం నుండి రెండు శక్తుల మధ్య చీలిపోయి వున్నాయి. కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు సుదీర్ఘకాలం అధికారంలోను, ప్రతిపక్షంలోను వున్నాయి. మూడో శక్తి ఆవిర్భావానికి మధ్యలో కొన్ని ప్రయత్నాలు జరిగినప్పటికీ అవి స్థిరపడలేదు. ఇప్పుడు రాబోయే పార్లమెంట్, శాసన ఎన్ని కలలో మళ్ళీ మరొక అవకాశం వస్తున్నది. రాష్ట్ర రాజకీయాలలో రెండు బూర్జువా పార్టీలు ప్రధాన శక్తులుగా ఉండటంవామపక్ష ప్రజాస్వామ్యశక్తుల పురోగమనానికి, ప్రజాస్వామ్య మనుగడకు ఉ పకరించదు. అందుకే వామపక్షాలు నిరంతరం బూర్జువా రాజకీయాలకు భిన్నమైన ప్రత్యామ్నా యానికి ప్రయత్నిస్తుంటాయి. ప్రస్తుతం రాష్ట్రంలో తెలుగుదేశం, వైఎస్ఆర్ పార్టీలకు మధ్య రాజకీయ పోటీ నడుస్తున్నది. ఈ రకంగా రెండు శక్తుల మధ్య పోటీనడవడం ఆ పార్టీలకు, బూర్జువా రాజకీయవాదులకు సంతోషంగా వుటుంది. కాంగ్రెస్, బిజెపిలు వున్నా రాష్ట్రంలో నామమాత్రమే. ఈ రెండు పార్టీలు కూడా బడా పెట్టుబడిదారులకు, భూస్వాములకు, కార్పొరేట్ శక్తులకు ప్రాతినిధ్యం వహించేవే అయినా అనేక కారణాల మూలంగా రాష్ట్రంలో ప్రస్తుతానికి చాలా బలహీనంగా వున్నాయి. బిజెపి, కాంగ్రెస్ లు రెండూ సరళీకరణ విధానాల అమలులో పోటీపడేవే. అదనంగా బిజెపి మతోన్మాదాన్ని రాజకీయ సాధనంగా వాడుకుంటున్నది. ప్రాంతీ య పార్టీల స్థానంలో ఈ పార్టీలు బలం పుంజు కుంటే సంతోషించాల్సినదేమీ ఉండదు. అటు వంటి పరిస్థితి దేశ రాజకీయాలకు, రాష్ట్ర ప్రయో జనాలకు కూడా నష్టదాయకం అవుతుంది.

అందుకే ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, వైఎస్ఆర్, కాంగ్రెస్, బిజెపి పార్టీలకు భిన్నమైన విధానాలతో ఒక ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి అవసరమని, దాని సాధన కోసం నిరంతరం ప్రయత్నం చేయాలని సిపిఎం-సిపిఐ భావిం చాయి. వచ్చే ఎన్నికలు అటువంటి శక్తులను సమీకరించేందుకు మంచి అవకాశమని భావిస్తు న్నాయి. ఇప్పటికే ప్రత్యామ్నాయ విధానాలతో ప్రజల ముందుకు వచ్చాయి. అటువంటి కార్య క్రమం చుట్టూ వివిధ శక్తులను సమీకరించాలని ప్రయత్నిస్తున్నాయి. జనసేన పార్టీ ప్రత్యామ్నాయ కార్యక్రమంలో కొన్ని ముఖ్యమైన అంశాలపై ఏకీభావం వ్యక్తం చేసింది. వెనుకబడిన ప్రాం తాల అభివృద్ధి, సామాజిక న్యాయం, కార్మికులు, రైతాంగం, వృత్తిదారులు మొదలగు కష్టజీవులకు కనీస ఆదాయ గ్యారంటీ, ప్రజాస్వామ్య, నీతి వంతమైన పాలన వంటి విషయాల్లో ఒకే అభిప్రాయంతో ఈ పార్టీల కార్యక్రమం వున్నది. అందువల్ల సిపిఎం-సిపిఐ, జనసేన, ఇంకా కలిసి వచ్చే సారూప్య శక్తులతో ముందుకు పోవాలనుకుంటున్నాయి.

కాంగ్రెస్, బిజెపి పార్టీలు వంటి జాతీయ పార్టీలకు భిన్నమైనప్పటికీ ప్రాంతీయ బూర్జువా పార్టీలు పూర్తి అవకాశవాదంతో వ్యవహరిస్తా యనేది మన అనుభవం. ఈ పార్టీలు అధికా రంలో వున్నప్పుడు ఒకరకంగా, ప్రతిపక్షంలో వున్నప్పుడు మరో రకంగా మాట్లాడతాయి. ఒకరోజు బిజెపితో స్నేహం, మరో రోజు దానితో వైరం విధానాలను అవలంభిస్తాయి. రాష్ట్రంలో తెలుగుదేశం, వైఎస్ఆర్‌సిపిల రాజకీయ పిల్లి మొగ్గలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. అలాగేస్వయంకృతాపరాధంతో పతనమైపోయిన కాంగ్రెస్ పార్టీని పునరుద్దరించే పని మనది కాదు. అందుకే రాష్ట్రంలో టిడిపి, వైఎస్ఆర్, కాంగ్రెస్, బిజెపిలకు వ్యతిరేకంగా వుండే, ప్రజా కార్యక్రమం మీద ఆధారపడిన ప్రత్యామ్నాయ శక్తిని ముందుకు తెచ్చే ప్రయత్నం సిపిఎం- సిపిఐలు చేస్తున్నాయి. ❋

---

## సామాజిక న్యాయం ప్రజాసంక్షేమం కోసం

(13వ పేజీ తరువాయి)

తున్న మోసాలను అరికట్టడం, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవడం.

**గ్రామీణాభివృద్ధి**

(53)వేలకొద్ది గ్రామాలు నాగరిక సమాజ అభివృద్ధికి ఆమడ దూరంలో వున్నాయి. కనీస వసతులు, సౌకర్యాలు కూడా లేవు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల్లో, అటవీ ప్రాంతాల్లో ఈ దుస్థితి ఉంది. ఇక్కడ అక్షరాస్యత తక్కువ, వైద్య సౌకర్యాలు మృగ్యం, రవాణా సౌకర్యాలు లేవు. ఇలాంటి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత నిచ్చి ప్రత్యేక పథకాలు రూపొందించాలి.

**పర్యావరణ పరిరక్షణ**

(54) అభివృద్ధి పేరుతో ప్రజల ప్రాణాలను హరించే పరిశ్రమలను జనావాసాల మధ్య లేకుండా చేయాలి. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత. ఆక్వా కాలుష్యాన్ని నివారించాలి. విద్యార్థి దశనుండేపర్యావరణంపై అవగాహన పెంచాలి.

**సైన్స్ & టెక్నాలజీ**

(55)ఆధునిక టెక్నాలజీ పేరుతో ఉద్యోగులపై అదనపు భారం మోపి, నిరుద్యోగాన్ని పెంచే విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయి. ఐ.టి.లో నిరుద్యోగం పెరుగుతోంది. డిజిటల్ సేవల పేరుతో క్యాష్‌లెస్ ఎకానమీ, భూరికార్డుల తారుమారు, రేషన్ ఇవ్వకపోవడం వంటి అనేక సమస్యలు ప్రజలెదు ర్కొంటున్నారు. ఆధార్ సమాచారం బహిరంగంగా వెల్లడవడంతో పౌరుల ప్రైవసీకి దెబ్బ తగిలింది. స్థూలంగా నేటి టెక్నాలజీ కార్పొరేట్ ప్రయోజనాలను నెరవేరుస్తోంది. దీనికి భిన్నంగా ప్రజల శ్రమ తగ్గించడం, సౌకర్యాలు మెరుగు పర్చడం, భారాలు తగ్గించడం, ఉపాధి పెంచడం లాంటి సానుకూల ప్రయోజనాలు చేకూరేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి గ్రామానికి ఉచిత వైఫై. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, సామాజిక న్యాయ సాధనకు, ప్రజా సంక్షేమానికి యువత ఉజ్జ్వల భవిష్యత్తుకు, మహిళా సాధికారితకు రాష్ట్రంలోని వామపక్ష, ప్రజాతంత్ర, అభ్యుదయ, సామాజిక, శక్తులన్నీ ఏకం కావాలి. ❋

# అసామాన్య ఆర్థికవేత్త సమీర్ అమీన్

(2వ పేజీ తరువాయి)

దేశాలు ఉత్పత్తి చేసిన సరుకులకు, మూడో ప్రపంచ దేశాలు ఉత్పత్తి చేసిన సరుకులకు ఎక్కడా పోలిక లేదు. అంతర్జాతీయంగా సామ్రాజ్యవాదం చేసిన శ్రమ విభజన దీనికి కారణం."

ఐతే అమీన్ ఇచ్చిన ఈ వివరణనుండి మరో ప్రశ్న తలెత్తుతుంది. మూడో ప్రపంచ దేశాలలో కార్మికుల శ్రమశక్తి చవుకగా లభిస్తున్నప్పుడు సంపన్న దేశాలనుండి పెట్టుబడి మూడో ప్రపంచ దేశాలకి తరలివచ్చి ఉండాలి కదా? దానికి విరుద్ధంగా మూడో ప్రపంచ దేశాలు ప్రధానంగా ముడి సరుకుల ఉత్పత్తికి, సంపన్న దేశాలు యాంత్రిక ఉత్పత్తులకు ఎందుకు పూనుకున్నాయి? అర్ఘిరి ఇమ్మాన్యుయెల్ అసమాన మారకంపై ఇచ్చిన సైద్ధాంతిక వివరణ పై ప్రశ్నకు మరింత బలాన్ని చేకూరుస్తుంది కదా! ఆయన ఇలా ప్రతిపాదించారు" సమాన ఉత్పత్తి వ్యయం ఇమిడిఉన్న సరుకుల నడుమనే మారకం జరిగింది. ఐతే మూడో ప్రపంచ దేశాల కార్మికుల జీతాలు తక్కువ అయినందున వాటి ధరలు తక్కువగా నిర్ణయించబడ్డాయి. పెట్టుబడి గతిశీలత (మొబిలిటీ) వల్లనే ఇరుప్రాంతాలలోనూ లాభాలరేటు సమానం అయిపోయింది. ఒక ప్రాంతం ముడి సరుకుల ఉత్పత్తిపైన, ఇంకొక ప్రాంతం యాంత్రిక ఉత్పత్తులపైన కేంద్రీకరించినప్పటికీ పెట్టుబడి గతిశీలత వలన లాభాల్లో తేడా లేకుండాపోయింది."

ఈ వివరణ నుండి ఇంకో ప్రశ్న వస్తుంది. "లాభాల్లో తేడాను తొలగించగలిగిన పెట్టుబడి గతిశీలత సంపన్న మూడో ప్రపంచ దేశాలు వేర్వేరు ఉత్పత్తులు చేపట్టే పరిస్థితిని (స్పెషలైజేషన్) ఎందుకు తొలగించలేకపోయింది?"

నిజానికి ప్రస్తుత దశలో ప్రపంచీకరణ కొంతమేరకు చేస్తున్న పని ఇదే. అయినప్పటికీ ఇరు ప్రాంతాలలోని శ్రమశక్తి విలువలలోని తేడాలను మాత్రం అది తొలగించలేదు. (సంపన్న దేశాలలో పెరుగుతున్న ఉత్పాదకతకు అనుగుణంగా వేతనాలు పెరిగే పరిస్థితి మాత్రం ఆగిపోయింది ప్రస్తుతానికి) ఇక్కడ గమనించాల్సిన అంశం ఏమంటే సమీర్ అమీన్ 'అసమాన మారకం' సిద్ధాంతాన్ని అంతవరకే పరిమితం చేయలేదు. ఒక ప్రపంచ వ్యాప్త వ్యవస్థగా పెట్టుబడిదారీ విధానం వివిధ దశలగుండా పరిణామం చెందడాన్ని అతడు పరిశీలించాడు. అందులో తాజా దశ ప్రపంచీకరణ దశ. అన్ని దశలలోనూ మూడో ప్రపంచదేశాల శ్రామికులు 'మహాదోపిడీ'కి గురవుతూనే ఉన్నారు. సంపద ప్రపంచస్థాయిలో కేంద్రీకరించబడుతున్న క్రమాన్ని మార్క్సిస్టు విశ్లేషణ ద్వారా అర్థం చేసుకోవడం, వివరించడం చేశాడు అమీన్.

అమీన్ విశ్లేషణనుంచి మనకు వచ్చే స్పష్టమైన నిర్ధారణ ఒక్కటే. మూడో ప్రపంచ దేశాలు ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థనుండి పూర్తిగా విడగొట్టుకోవాలి. అప్పుడే 'మహా దోపిడీ' నుండి బైటపడి నిజమైన అభివృద్ధిని సాధించగలుగుతాం. ఈ విషయాన్ని నా దృష్టిలో అమీన్ కన్నా స్పష్టంగా, ఖరాఖండిగా చెప్పిన వారు ఇంకొకరు లేరు. ఆనాడు సంపన్న దేశాల పరిధికి వెలుపల ఉన్న దేశాలలో ఒక్క జపాన్ మాత్రమే సంపన్న దేశాల సరసన చేరగలిగింది. దీనికి కారణం జపాన్ ఎన్నడూ ఒక వలస దేశంగా లేకపోవడమే. ఇక వేరే ఏ దేశంలోనూ ఆ విధంగా జరగలేదు. అమీన్ అంచనాలో చైనా ఆ విధంగా సంపన్న దేశంగా ఎదగగలిగే అవకాశం ఉంది. దానికి కారణం ఆ దేశంలో చాలా విస్తృతమైన స్థాయిలో మవో కాలం నుంచీ సంస్కరణలు అమలు జరగడమే. (పశ్చిమ దేశాలు సైనికంగా చైనాను ఆక్రమించుకునే ప్రమాదం ఉందని, ఆ ప్రమాదం చైనాకు, సోషలిజం కూలిపోయిన అనంతరం ఏర్పడ్డ రష్యాకు పొంచి ఉందని అమీన్ భావించారు)

ప్రస్తుత నయా ఉదారవాద పెట్టుబడిదారీ దశ ఇక ముందుకు పోలేని దశకు చేరుకున్నదని అమీన్ స్పష్టమైన అభిప్రాయం. అంటే పెట్టుబడిదారీ విధానమే అంత్య దశకు వచ్చేసిందని మాత్రం నిర్ధారించరాదు. ఇక్కడినుండి పరిణామం పెట్టుబడిదారీ వ్యవస్థ మళ్ళీ పుంజుకొని బలపడే దిశవైపుగా సాగుతుందా, లేక సోషలిజంవైపుగా సమాజం మారుతుందా అన్నది ఆచరణే నిర్ణయిస్తుంది. ఈ కారణం వల్లనే అమీన్ తన కొన వూపిరివరకూ విప్లవ కార్యాచరణలో కొనసాగుతూ, తనతోబాటు ఇతరులనూ కార్యాచరణ వైపు ప్రోత్సహించేవారు. ప్రపంచవ్యాప్త విప్లవ కార్యాచరణను సమన్వయం చేయడానికి మరొక అంతర్జాతీయ సంస్థ ఏర్పడాలని కూడా ఆయన చెప్పేవారు.

ఆయన చూపిన గొప్ప ఆత్మీయత, ఔదార్యం, పరిపూర్ణమైన సాన్నిహిత్యం గురించి ప్రస్తావించకుండా ఆయన జీవితంలో ఏదీ పూర్తికాదు. ఆయన ఉత్సుకత, ఆయన నవ్వు, ప్రజలందరినీ ఒకచోటికి చేర్చగలిగిన ఆయన ఆపారమైన శక్తి, విప్లవ కార్యాచరణ దిశగా వారిని నడపగలిగిన బలం హృదయాన్ని కదిలిస్తుంది. ఆయనతో సన్నిహితంగా వచ్చినవారికి ఎవరికైనా ఆ గుణాలన్నీ సంక్రమిస్తాయి. ఎవరు అంగీకరించినా, అంగీకరించకపోయినా ఆయనతో మాట్లాడటమే నేర్చుకునే అనుభవం. తనతో మాట్లాడిన ఎవరినైనా ఆయన యుద్ధానంతర ఫ్రాన్స్ నుంచి బాండుంగ్ మహాసభ నుంచి 2008 ఆర్థిక సంక్షోభం వరకూ అనేక విషయాల్లోకి తీసుకెళ్తారు. తన విశ్వాసాన్ని నిలుపుకున్న ఒక కమ్యూనిస్టుతో మాట్లాడటం ఎంతో ఆహ్లాదకరం. స్నేహితులు, కామ్రేడ్స్, అభిమానులు ఆయన్ను కోల్పోవడం విషాదకరం.

**అనువాదం: సింహాద్రి సరోజిని**

# 21వ శతాబ్దిలో కమ్యూనిస్టు ప్రణాళిక

(30వ పేజీ తరువాయి)

ముఖ్యంగా సంపన్న దేశాలలోని వ్యవస్థలనే వేగంగా విచ్ఛిన్నం చేస్తున్న తీవ్రమైన వైరుధ్యాలు ముదురుతున్న తీరును మనం గమనించవచ్చు. ప్రపంచ వ్యాపితంగా అన్ని దేశాలలో సంపదలు, ఆదాయాలలో పెరుగుతున్న అంతరాలు, హరించుకుపోతున్న ఆర్థికవ్యవస్థలు, వేగం పుంజుకుంటున్న సరళీకృత ఆర్థిక విధానాలు, మరియు ద్రవ్యపెట్టుబడి విస్తరణ, అన్నింటికంటే మించి మానవాళిని భయభ్రాంతులను చేస్తూ ప్రపంచవ్యాపితంగా విస్తరిస్తున్న ఆర్థిక సంక్షోభం అలాంటి వైరుధ్యాలకు కారణ భూతంగా వున్నాయి. ఈ చారిత్రక పరిణామాలన్నీ కమ్యూనిస్టు ప్రణాళికలో పేర్కొన్న, వర్తమానంలో జరుగుతున్న 'విచ్ఛిత్తి' అవగాహనకు లోబడి ఉన్నాయి. రాజ్యాంగ యంత్రంలో పెరుగుతున్న అస్థిరతకు పై పరిణామాలు సాక్షీభూతంగా నిలుస్తున్నాయి. సైద్ధాంతిక రంగంలో జరుగుతున్న పరిణామాలను అధిగమించి ఈ కాలంలో పెట్టుబడిదారుల మధ్య నెలకొన్న, దాచేందుకు వీలులేని తీవ్ర వైరుధ్యాలు తలెత్తుతున్నాయి. చిన్న పిల్లలు కూడా ఈ అంశాన్ని గమనించగల్గుతున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలోని ఆత్మహత్యా సదృశ్యమైన పరిణామాలు బహిర్గతమయ్యేకొద్దీ, ప్రపంచ వ్యాప్తంగా పలు విప్లవోద్యమాలతో పాటు, మొత్తం చారిత్రక ఉద్యమాల సైద్ధాంతిక భూమికను అర్థం చేసుకున్న ఉన్నతతత స్థాయి బూర్జువా సైద్ధాంతికవేత్తలకు సహితం పెద్దప్రశ్న ఎదురౌతున్నది. మన జాతికి భవిష్యత్తు వున్నదా? అందుకోసం మనమేం చేయాలి? అన్నదే ఆ ప్రశ్న. దానికి మరింత సమయం వున్నది. సాధ్యమైనంత త్వరగా మనం గుర్తించిన అంశాలను ప్రజలకు చేరవేయటమే మన ముందున్న ప్రధాన కర్తవ్యం.

**అనువాదం : వై. సిద్ధయ్య**

# భారతీయ సంస్కృతిపై మతతత్వ దాడి



**- బిపన్‌చంద్ర**

**జా**తీయవాదం పెరుగుదలతోపాటు 19వ శతాబ్దాంతానికి మతవాదం కూడా పుట్టి భారత ప్రజల ఐక్యతకు, జాతీయోద్యమానికి పెద్ద సవాలుగా తయారైంది. మతవాద ఆవిర్భావం, అభివృద్ధి గురించి చర్చించడానికి ముందు మతతత్వాన్ని నిర్వచించడం అవసరం.

మతతత్వం ప్రాథమికంగా ఒక సిద్ధాంతం. మత ఘర్షణలు ఈ సిద్ధాంత వ్యాప్తి ఫలితం. ఒక మతానికి చెందిన ప్రజల గ్రూపుకు ఒకేరకమైన లౌకిక ప్రయోజనాలు- అంటే ఒకేరకమైన సామాజిక, ఆర్థిక రాజకీయ ప్రయోజనాలు వుంటాయని విశ్వసించడం మతతత్వం. భారతదేశంలో హిందువులు, ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు లాంటి మతపరమైన గ్రూపులు వేర్వేరు ప్రత్యేకమైన సమూహాలుగా ఏర్పడతాయి. ఒక మతానికి చెందినవారికి ఒకేరకమైన మత ప్రయోజనాలేగాక ఒకేరకమైన లౌకిక ప్రయోజనాలు కూడా ఉంటాయి. కాబట్టి భారత జాతి అనేది లేదు. ఉన్నది హిందూ జాతి. లేక ముస్లిం జాతి వగైరాలు. కాబట్టి భారతదేశం మత సమూహాల సమాహారం. ఒక మతానికి చెందిన ప్రజల సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు మరొక మతానికి చెందిన ప్రజల ప్రయోజనాలకు భిన్నంగా ఉంటాయి. ఇది మతతత్వంలోని రెండవ పార్శ్వం

వివిధ మతాలకు చెందిన ప్రజల ప్రయోజనాలు పరస్పర విరుద్ధంగానే గాక శత్రుభావంతో కూడుకొన్నవిగా పరిగణించడం మతతత్వం యొక్క మూడవదశ. ఈ దశకు చేరిన మతతత్వవాదులు హిందువులకు, ముస్లింలకు ఉమ్మడి సెక్యులర్ ప్రయోజనాలేమీ వుండవని, హిందూ ముస్లింల ప్రయోజనాలు పరస్పరం విరుద్ధంగా వుంటాయని నొక్కి వక్కాణిస్తారు.

మతతత్వ వాదం మధ్యయుగాల అవశేషం కాదు. మధ్యయుగాల నుండి కొనసాగుతూ వచ్చింది కాదు. ప్రజల జీవితంలో మతం చాలా ముఖ్యమైన భాగమైనప్పటికీ, కొన్ని సందర్భాలలో మతపరంగా పోట్లాడుకొన్నప్పటికీ 1870-80 దశాబ్దానికి ముందు మతతత్వ సిద్ధాంతం గాని మత రాజకీయాలు గాని లేవు. మతతత్వం మూలాలు ఆధునిక వలసవాద సామాజిక, ఆర్థిక, రాజకీయ నిర్మాణంలో ఉన్నాయి.

అప్పుడు తలెత్తే ప్రశ్న: ముస్లింలలో మతపరమైన వేర్పాటువాద ఆలోచనలు ఎలా పెరిగాయి?

ఇందుకు ఒక కారణం విద్య, వాణిజ్యం, పరిశ్రమలలో సాపేక్షంగా ముస్లింల వెనుకబాటుతనం.

విద్యలో ముస్లిముల, వెనకబాటుతనం కారణంగా వారికి మరొక నష్టం జరిగింది. ప్రభుత్వోద్యోగులకు, వృత్తులకు ఆధునిక విద్య తప్పనిసరి. వీటిలో కూడా ముస్లిమేతరుల కంటే ముస్లింలు వెనకబడిపోయారు. అంతేగాక 1857 తిరుగుబాటుకు ప్రధానంగా ముస్లిముల్ని బాధ్యులుగా చేసి 1858 తరువాత ప్రభుత్వం ముస్లిముల పట్ల వివక్ష చూపింది. ముస్లిములలో విద్యావ్యాప్తి జరిగాక, ముస్లిం విద్యావంతులకు వాణిజ్యం, వృత్తులలో అవకాశాలు తగ్గిపోయాయి. వారు అనివార్యంగా ప్రభుత్వోద్యోగాలవైపు చూశారు. భారతదేశం వెనుకబడిన వలసదేశం గనుక ప్రజలకు ఉద్యోగ అవకాశాలు బహు తక్కువ. ఈ పరిస్థితులలో విద్యావంతులైన హిందువులకు వ్యతిరేకంగా విద్యావంతులైన ముస్లిముల్ని రెచ్చగొట్టడం బ్రిటిషు అధికారులకు, బ్రిటిషు వారికి విధేయులుగా వున్న ముస్లిం నాయకులకు సులభతరమయింది. ప్రభుత్వోద్యోగాలలో ముస్లింలకు ప్రత్యేక అవకాశాలు కల్పించాలని సయ్యద్ అహమ్మద్‌ఖాన్ తదితరులు డిమాండ్ చేశారు. ముస్లిం విద్యావంతులు బ్రిటిషు ప్రభుత్వానికి విధేయులుగా వుంటే ప్రభుత్వం వారికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇతర సౌకర్యాలు కల్పిస్తుందని ప్రకటించారు. కొందరు విధేయులైన హిందువులు, పార్శీలు అదేరకంగా వాదించారు. కాని అలాంటి వారు చాలా తక్కువ. ఫలితంగా దేశం మొత్తం మీద స్వతంత్ర భావాలుగల న్యాయవాదులు, పాత్రికేయులు, విద్యార్థులు, వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు రాజకీయ నాయకులవుతూ ఉంటే, ముస్లిములలో ప్రభుత్వ విధేయులైన భూస్వాములు, పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులు, ఇంకా రాజకీయ ప్రాబల్యం వహించారు.

ఈ రోజులలో పాఠశాలల్లో, కళాశాలలో, చరిత్ర బోధించిన పద్ధతి కూడా హిందువులలోనూ, ముస్లింలలోనూ మతతత్వ పెరుగుదలకు తోడ్పడిందని చరిత్ర విద్యార్థులుగా మనం గమనించాలి. బ్రిటిషు చరిత్రకారులు, వారిని అనుసరించి భారతీయ చరిత్రకారులు మధ్యయుగాన్ని, ముస్లిం యుగంగా వర్ణించారు. టర్కీ, ఆఫ్ఘన్, మొగల్, పాలకుల పరిపాలన ముస్లిం పరిపాలనగా పిలవబడింది. సాధారణ ముస్లిం ప్రజలు హిందూ సాధారణ ప్రజల్లాగే పేదరికంతో, పన్నుల భారంతో అణగారిపోయారు. రాజులు, సర్దారులు, జమీందారులు, జాగీర్దార్లు- వారు హిందువులైనా, ముస్లింలైనా సాధారణ హిందూ, ముస్లిం జనబాహుళ్యాన్ని, అల్పప్రాణులుగా, నీచులుగా పరిగణించారు. అయినప్పటికీ మధ్యయుగాలలో ముస్లింలంతా పాలకులని, ముస్లిమేతరులంతా పాలితులనీ ఈ చరిత్రకారులు వర్ణించారు. ఇతరచోట్లలాగానే భారతదేశంలో ప్రాచీన,మధ్యయుగాల రాజకీయాలు, ఆర్థిక రాజకీయ ప్రయోజనాన్ని ప్రాతిపదికగా చేసుకున్నాయి. కానీ, మతపరమైన అంశాల్ని కాదనే వాస్తవాన్ని వివరించడంలో ఈ చరిత్రకారులు విఫలమయ్యారు. బ్రిటిషు చరిత్రకారులు ఇతర మతతత్వ చరిత్రకారులు భారతదేశ సమ్మిశ్ర సంస్కృతి సిద్ధాంతంపై దాడిచేశారు.

*(బిపన్‌చంద్ర రచించిన 'ఆధునిక భారతదేశ చరిత్ర' గ్రంథంనుండి ఈ వాక్యాలు గ్రహించబడ్డాయి)*

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt.
Ph: 9490099275. Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.13, No.5. Published on September 1, 2018